www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 56
బుధవారం | 11-6-2025
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: పౌర్ణమి మ.1.14 తదుపరి పాడ్యమి, నక్షత్రం: జ్యేష్ఠ రా.8.11 తదుపరి మూల, వర్జ్యం: తె. 4.46-6.29, దుర్ముహూర్తం: ఉ.11.48-12.40, అమృతఘడియలు: ఉ.10.35-12.20, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.45
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

జగన్ మీడియాను నిషేధించాలి

- వరుసగా మూడోరోజూ మహిళల ఆందోళనలు
- రాష్ట్రవ్యాప్తంగా సాక్షి ఆఫీసుల వద్ద నిరసనలు
- నియోజకవర్గాల ముఖ్య కూడళ్లలో భారీ ర్యాలీలు
- పత్రిక ప్రతులు, దిష్టిబొమ్మల దహనం
- పోలీసులకు ఫిర్యాదులు.. అధికారులకు వినతులు
- తిరుపతిలో పెట్రోల్‌తో మహిళ ఆత్మహత్యాయత్నం
- ఏలూరులో సాక్షి కార్యాలయంపై కోడిగుడ్లతో దాడి
- 'సాక్షి'పై చర్యలు తప్పవు: కేంద్రమంత్రి భూపతిరాజు

13

మంటలు 'పుట్టించారు'!

- అగ్ని ప్రమాదంపై తప్పుడు ప్రచారం
- ఏలూరులో గోడౌన్‌లో మంటలు
- పైఅంతస్తులో ఉన్న 'సాక్షి' ఆఫీసు
- ఆందోళనకారులు నిప్పంటించారని దుష్ప్రచారం.. ఖండించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మెల్యే సారూ.. తగ్గాలి మీరు!

వైసీపీ నేతలే ఆదర్శంగా దందాలు

పలువురు శాసనసభ్యుల ఇష్టారాజ్యం

అరాచక పాలన అంతమై... సరిగ్గా ఏడాది! కూటమి సర్కారు కొలువుదీరి రేపటితో సంవత్సరం అవుతోంది! భూదందాలు, ఇసుక మాఫియా, మట్టి దోపిడీ, వెంచర్లు వేస్తే వాటాలు, అవకాశాలు వెతికి మరీ ముడుపులు పిండిన ఎమ్మెల్యేల కథ ముగిసింది. కానీ... 'మేం మాత్రం తక్కువా' అని కూటమి ఎమ్మెల్యేల్లోనూ కొందరు చెలరేగిపోతున్నారు. అచ్చంగా... నాటి వైసీపీ ఎమ్మెల్యేల దందాలను తలపిస్తున్నారు. కొన్నిచోట్ల వైసీపీ నేతలనే భాగస్వాములుగా చేసుకుని వసూళ్లు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాలను బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు అప్పగించేశారు. ఏడాదిలోనే ఆయా శాసన సభ్యులు వ్యతిరేకత మూటగట్టుకున్నారు. పరిస్థితి మారకపోతే వారికే కష్టమని... కూటమి ప్రభుత్వానికీ కష్టమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కొత్త సర్కారు కొలువుదీరి ఏడాదైన సందర్భంగా ఆయా ఎమ్మెల్యేల తీరుపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న విశ్లేషణాత్మక కథనం...

- కుటుంబ సభ్యుల చేతికి పగ్గాలు
- కొన్నిచోట్ల వైసీపీ నేతలతో ములాఖత్
- ప్రతి పనికీ రేటు కట్టి ముడుపులు
- భూదందాలు, ఇసుక, గ్రావెల్, దోపిడీలు
- మద్యం షాపుల నుంచీ మామూళ్లు
- కాంట్రాక్టులు, పనులు వైసీపీ వారికే
- సొంత పార్టీ శ్రేణులపై నిర్లక్ష్యం
- కొందరి తీరుపై ప్రజల్లో వ్యతిరేకత




(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఎమ్మెల్యేలు బాధ్యతగా పనిచేయాలి. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. విమర్శలకు, వివాదాలకు, ఆరోపణలకు దూరంగా ఉండాలి'.. ఇటీవల టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు చేసిన దిశానిర్దేశమిది. కానీ కొందరు ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాల్లో మునిగితేలుతున్నారు. ఐదేళ్ల జగన్ హయాంలో వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన పార్టీ శ్రేణులను పక్కన పెట్టేసి.. వైసీపీ నుంచి వచ్చిన నాయకులకు పెద్దపీట వేస్తున్నారు. వారితో కలిసి వ్యాపారాలు చేస్తున్నారు. తమ అవినీతి.. అక్రమాల కోసం సొంత పార్టీనే పణంగా పెడుతున్నారు. వైసీపీ విధ్వంసపాలనకు ముగింపు పలికిన నియోజకవర్గ ప్రజలకు

మిగతా 12వ పేజీలో...

రాష్ట్ర వేడుకగా ఏడాది పండుగ



- సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్ పేరిట ఉత్సవాలు
- రేపు సాయంత్రం అమరావతిలో భారీ సభ
- వేడుకల్లో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు పాల్గొనాలి.. ప్రభుత్వ ఉత్తర్వులు

12



ఆ వ్యాఖ్యల వెనుక కుట్ర

- సమాజంలో అలజడికి పన్నాగం
- ఖండించాల్సిన కొమ్మినేని ప్రోత్సహించారు
- వాదనలు వినిపించిన స్పెషల్ కౌన్సెల్
- కొమ్మినేనికి రిమాండ్.. జైలుకు తరలింపు
- కృష్ణంరాజు చేసిన దుర్మార్గమైన వ్యాఖ్యలను మీరెందుకు ఖండించలేదు?
- మిమ్మల్ని ఎందుకు వదిలి పెట్టాలి?
- జడ్జి ప్రశ్నలు.. నీళ్లు నమిలిన కొమ్మినేని
- అట్రాసిటీ సెక్షన్లపై కోర్టు అభ్యంతరం
- బెయిల్ కోసం హైకోర్టుకు కృష్ణంరాజు

13

"రాజధాని చుట్టూ వేశ్యలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు ఉన్నారని దుర్మార్గమైన వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు.. మీరెందుకు వాటిని ఖండించలేదు. హిందూ దేవతలు, ముస్లిం దేవతలు, క్రిస్టియన్ దేవతలు అంటూ నవ్వుతూ వ్యంగ్యంగా మాట్లాడడం.. కృష్ణంరాజు వ్యాఖ్యలను ప్రోత్సహించినట్లే కదా!. అందువల్ల మీరు శిక్షార్హులే. మిమ్మల్ని ఎలా వదిలి పెట్టాలి?."

– కొమ్మినేనిని ఉద్దేశించి న్యాయాధికారి వ్యాఖ్యలు

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను దారుణంగా అవమానిస్తూ.. 'వేశ్యలు'గా సంబోధిస్తూ సాగిన డిబేట్‌కు సంబంధించి సాక్షి చానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు మంగళవారం మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఈ నెల 24 వరకు రిమాండ్

మిగతా 14వ పేజీలో...

దేశంలో పడిపోతున్న జననాల రేటు

భర్తీ రేటు కన్నా తక్కువగా నమోదు



- ఆర్థిక పరిస్థితుల వల్లే పరిమిత కుటుంబం
- స్థిరంగా కొనసాగుతున్న యువత జనాభా
- పని చేయదగిన వారు 68 శాతం మంది
- వృద్ధులు 7 శాతం.. దేశ జనాభా 146 కోట్లు.. వచ్చే 40 ఏళ్లలో 170 కోట్లకు
- ఆ తర్వాత క్రమేణా తగ్గుదల.. ఐరాస ప్రపంచ జనాభా నివేదిక-2025లో వెల్లడి


సగటు ఆయుర్దాయం
పురుషులు 71 ఏళ్లు
మహిళలు 74 ఏళ్లు

న్యూఢిల్లీ, జూన్ 10: ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు.. మరోపక్క ఉరుకులు పరుగుల జీవితం.. దీంతో దేశంలో జననాల రేటు వేగంగా పడిపోతోంది. యాభై ఏళ్ల క్రితం ఒక కుటుంబంలో సగటున ఐదారుగురు పిల్లలు ఉండగా, ఇప్పుడు ఒకరు లేదా ఇద్దరితో సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం జనాభాలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ... 40 ఏళ్ల తర్వాత జనాభా పెరుగుదలలో తగ్గుదల నమోదవుతుందని ఐరాస అంచనా వేసింది. దేశ జనాభా 146 కోట్లకు చేరింది. దేశ జనాభా పెరుగుదల, ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఐక్యరాజ్యసమితి తన జనాభా నివేదికలో వివరించింది. యూఎన్ఎఫ్‌పీఏకు చెందిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ (ఎస్ఓడబ్ల్యూపీ) 2025 నివేదికను మంగళవారం విడుదల చేసింది. భారత్‌లో మరణాల కంటే (భర్తీ రేటు)జననాల రేటు తక్కువ ఉందని దానిలో వెల్లడించింది. జననాల రేటు తగ్గడాన్ని నిజమైన సంక్షోభంగా పేర్కొంది. వివిధ కారణాల వల్ల లక్షలాది మంది ప్రజలు అధిక సంతానాన్ని కోరుకోవడంలేదని వెల్లడించింది. దేశంలో జననాల రేటు 1.9కి పడిపోయిందని, భర్తీ స్థాయి 2.1 కంటే తక్కువగా

మిగతా 2వ పేజీలో...

పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక

- ముందే సాగునీరు విడుదల.. 24 గంటల్లో బ్యాంకు రుణాలు
- ఉపాధి నిధులతో గట్ల వెడల్పు .. వరిలో సన్నరకాలను ప్రోత్సహించాలి
- సాగు పరిజ్ఞానం, విధానాలపై అన్నదాతలకు అవగాహన పెంచాలి
- వచ్చే వేసవిలో 5 లక్షల ఎకరాల్లో సాగు.. సమీక్షలో చంద్రబాబు నిర్దేశం





అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్ పంటల ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని, 365 రోజులు సాగు భూములు పచ్చగా ఉండేలా చూడాలని, మూడు పంటల విధానాన్ని తీసుకురావాలని సీఎం చంద్రబాబు వ్యవసాయ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సాగు సన్నద్ధతపై మంగళవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ పంటలను తుఫాన్ల నుంచి రక్షించుకునేలా పంట కాలాన్ని ముందుకు జరిపేలా కార్యాచరణ మొదలు పెట్టినట్లు అధికారులు సీఎంకు చెప్పారు. దీనికి అనుగుణంగా ఈ ఏడాది గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాలకు ముందుగానే సాగునీరు విడుదల చేసినట్లు తెలిపారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లోని భూములకు కాలువల ద్వారా ఇప్పటికే నీరు విడుదల చేశామన్నారు. జూలై మొదటి వారంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, కంది, వేరుశనగ, పత్తి ప్రధానంగా సాగు చేస్తుండగా, వేరుశనగ, పత్తి సాగు తగ్గుతోందన్నారు. కంది సాగు పెరిగి, వరి సాగు స్థిరంగా కొనసాగుతోందని వివరించారు. గత 20 ఏళ్లలో రాష్ట్రంలో 14 తుఫాన్లు సంభవించగా, అక్టోబరులో 5, నవంబరులో 6, డిసెంబరులో 3 తుఫాన్లు ప్రభావం చూపాయని

మిగతా 12వ పేజీలో...

కోస్తా, రాయలసీమకు భారీ వర్షసూచన

14 నుంచి నైరుతితో పురోగతి.. 16 తర్వాత అల్పపీడనం

14

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

- 224 మంది అభ్యర్థుల ఎంపిక
- 23 నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు

14

స్వర్ణాంధ్ర 2047 కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- చైర్మన్‌గా సీఎం చంద్రబాబు..
- కో-చైర్మన్‌గా టాటా సన్స్ చంద్రశేఖరన్

ప్రపంచంలో పెద్ద మతం క్రైస్తవం

2

- వేగంగా పెరుగుతున్న ఇస్లాం
- మతం లేదన్న వారి సంఖ్య గణనీయం
- స్థిరంగా హిందూ మతం.. ప్యూ రిసెర్చ్

గనుల ఆదాయానికి గండి

- రెవెన్యూ నిర్లక్ష్యంతో మైనింగ్ లీజులకు బ్రేక్
- రెవెన్యూ పోరంబోకు పేరిట లీజులు
- అవి తమ భూములంటున్న అటవీ శాఖ
- రికార్డుచూసి నిజమేదో తేలిస్తే సత్వర పరిష్కారం
- సెటిల్ చేయకుండా చోద్యం చూస్తున్న రెవెన్యూ
- నిలిచిపోయిన వంద మైనింగ్ లీజులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ పోరంబోకు భూముల పరిధిలో ఉన్న కొండలు, గుట్టలను మైనింగ్ లీజుల రూపంలో ప్రభుత్వం కేటాయిస్తుంటుంది. దీని వల్ల ఏటా వేల కోట్ల ఆదాయం ఖజానాకు చేరుతుంది. మైనింగ్ లీజులను రెవెన్యూశాఖ నిర్దేశించిన ప్రభుత్వ పోరంబోకు భూముల్లోనే కేటాయిస్తారు. దీనికోసం రెవెన్యూ శాఖ నుంచి గనుల శాఖ ఆమోదం

మిగతా 12వ పేజీలో...

ప్రభుత్వానికి మైనింగ్ లీజులు రూ.వందల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. రెవెన్యూ పోరంబోకు భూములనే లీజులకు ఇస్తారు. ఈ ప్రక్రియలో రెవెన్యూశాఖది కీలక పాత్ర. ఆ శాఖ నివేదిక ఇచ్చిన తర్వాతే లీజు ప్రక్రియను గనులశాఖ ప్రారంభిస్తుంది. అయితే, కొన్నిరకాల భూములపై అటవీశాఖ అభ్యంతరాలు చెబుతుండటం, దానిపై రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం వల్ల వచ్చే రూ.కోట్ల ఆదాయానికి గండి పడుతోంది. ఇలా.. ప్రస్తుతం రాష్ట్రంలో ఆదాయం తెచ్చిపెట్టే 100 మైనింగ్ లీజులు నిలిచిపోయాయి. దీంతో రెవెన్యూ శాఖ తీరు మారదంటే మారదు అనే వ్యాఖ్య ఆ శాఖ వర్గాల్లోనే వినిపిస్తోంది.



లాస్ ఏంజెలెస్‌లో దగ్ధమవుతున్న కారు ఎదుట అమెరికా జాతీయ జెండాతో ఓ యువతి

నిప్పురవ్వ.. పెను జ్వాలై..

- అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్ దాడులతో రణరంగంగా మారిన లాస్ ఏంజెలెస్
- భారీగా సైన్యం, మెరైన్ల మోహరింపు
- ట్రంప్ నిర్ణయంపై కాలిఫోర్నియా గవర్నర్ అభ్యంతరం.. రాజ్యాంగ విరుద్ధమని వెల్లడి
- ఇతర నగరాలకూ విస్తరిస్తున్న నిరసనలు

2

కాకాణి 'టోల్' పాపం బద్దలు!



కృష్ణపట్నం పోర్టులో రూ.40 కోట్ల వసూళ్ల దందా

- లారీల అసోసియేషన్‌ను డమ్మీచేసి సొంతగా లాజిస్టిక్స్ కంపెనీ
- భారీగా ముందే అద్దె వసూలు.. పోర్టు బయట ఏకంగా ప్రైవేటు టోల్‌గేటు
- వాహనదారుల నుంచి కమీషన్లు.. ఆ తర్వాత బాడుగలో 4% బాదుడు
- ఈ భారం భరించలేక చెన్నై పోర్టుకు తరలిపోయిన కంపెనీలు
- ఈ నెల 6న వాహనదారు ఫిర్యాదు.. కాకాణి, 10 మందిపై కేసు

14

'టోల్‌గేట్' బద్దలైంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన అనుచరగణం సాగించిన అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. పోర్టును ఆదాయ వనరుగా మార్చుకుని బహిరంగ వసూళ్లకు దిగిన విషయం బయటపడింది. వాహనాల రవాణాను చేజిక్కించుకుని.. అనధికార టోల్‌గేట్‌తో ఐదేళ్లలో రూ.40 కోట్ల వరకు పిండుకున్నట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. కాకాణి, ఆయన అనుచరుల నిర్వాకాలతో ఎగుమతి-దిగుమతుల కంపెనీలు చెన్నై పోర్టుకు తరలిపోయాయి. దీంతో కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం కంటైనర్ టెర్మినల్‌ను ఎత్తివేసింది.


విదేశాల నుంచి తిరిగొచ్చిన అఖిల పక్ష బృందాలతో ప్రధాని మోదీ

ఉగ్రవాద నిర్మూలనకు.. భారత్ నిబద్ధతను ప్రపంచానికి చాటాం

» అఖిలపక్ష బృందాల పనితీరుకు గర్విస్తున్నా: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 10: ఉగ్రవాదాన్ని నిర్మూలించడం.. శాంతి స్థాపనలో భారత్ నిబద్ధతను ప్రపంచానికి చాటామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై ఐరోపా సమాఖ్య, 33 దేశాలకు వివరించేందుకు సిటింగ్ ఎంపీల నేతృత్వంలో ఏడు అఖిలపక్ష బృందాలు పర్యటించిన విషయం తెలిసిందే.! భారత్ తిరిగి వచ్చిన ఈ బృందాలతో ప్రధాని మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత గొంతుకను ప్రపంచ దేశాలకు చాటిన బృందాల పనితీరుకు గర్విస్తున్నానని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ వైఖరిని తెలియజేయడంలో ఈ బృందాల ప్రయత్నాలను ప్రశంసించారు. అంతకు ముందు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అఖిలపక్ష పార్లమెంటరీ బృందాల ప్రతినిధులను కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ.. తమ పర్యటనలో మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఇదిలా ఉండగా, గత 11 ఏళ్లలో దేశంలో రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 12రెట్లు పెరిగాయని మోదీ తెలిపారు. 2014-15లో రూ.1,930 కోట్లుగా ఉన్న భారత రక్షణ ఎగుమతుల విలువ 2024-25నాటికి రూ.23,622 కోట్లకు చేరిందన్నారు.

11 ఏళ్ల పాలనపై బీజేపీ భారీ ఉత్సవాలు

» నేడు తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో వేడుకలు

న్యూఢిల్లీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భారీ ఎత్తున ఉత్సవాలను జరుపుకోవాలని బీజేపీ నిర్ణయించింది. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, మార్పుల గురించి బీజేపీ ఇప్పటికే ఒక గీతాన్ని విడుదల చేసింది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని పార్టీ ప్రధాన కార్యాలయాల్లో కేంద్ర మంత్రులు, పార్టీ అగ్రనేతలు మీడియా సమావేశాలు నిర్వహించి ఎన్డీఏ ప్రభుత్వ విజయాలను వివరించారు. బుధవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో జిల్లా స్థాయిలో వేడుకలను నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. సీఎం రేవంత్ 46 సార్లు ఢిల్లీకి వచ్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం దగ్గర తాకట్టు పెట్టారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు.

ఆరోపణలు సరే.. ఫిర్యాదేదీ?

» ఓడినప్పుడల్లా మాపై పడతారా?.. రాహుల్‌కు ఈసీ ప్రశ్న

న్యూఢిల్లీ, జూన్ 10: ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎన్నికల సంఘం(ఈసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఆరోపణలు సరే.. ఇప్పటి వరకు అధికారికంగా ఫిర్యాదు ఎందుకు చేయలేదు?. సంబంధిత నివేదికలు ఇవ్వాలని మమ్మల్ని ఎందుకు కోరలేదు? పోనీ.. మాతో భేటీ కావడానికి ఎందుకు ప్రయత్నించలేదు?" అని ఈసీ ప్రశ్నించింది. "ఏ రాజకీయ పార్టీ అయినా.. ఎన్నికల ఫలితాలను ముందుగానే ఊహించుకుని ఉంటే.. దానిని రాజకీయాలకు మాత్రమే పరిమితం చేసుకోవాలి. రిఫరీతో యుద్ధం చేయొద్దు" అని స్పష్టం చేసింది. "దేశంలో ఓటర్లు అత్యంత తెలివైన వారు. వారికి అన్నీ తెలుసు. ఓడిపోయిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ రిఫరీపై యుద్ధం చేస్తుండడాన్ని కూడా వారు అర్థం చేసుకుంటారు" అని వ్యాఖ్యానించింది.

2023 నుంచి నియమితులైన సీఎస్‌లందరిపైనా ధిక్కార కేసు నమోదు

» మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామక వ్యవహారంలో గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు పాటించకపోవడం పట్ల మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 2023 సెప్టెంబరు నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పని చేసిన అధికారులందరిపైనా కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. "కోర్టు ఆదేశాలు అమలు చేయని, ధిక్కారంతో వ్యవహరించే అధికారులకు మేం స్పష్టమైన సందేశం ఇవ్వదలిచాం" అని న్యాయమూర్తి కటువుగా వ్యాఖ్యానించారు. కారుణ్య నియామకానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. తమిళనాడు సివిల్ సర్వీస్ (కారుణ్య నియామకాలు) నిబంధనలు-2023ను సవరించేందుకు అవసరమైన సిఫారసులు చేయడానికి, వాటి సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకునేందుకు మూడు నెలల్లోపు కమిటీని నియమించి, నివేదికను పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని 2023 సెప్టెంబరులో హైకోర్టు ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలు కాలేదు.

జాతీయ భద్రత సలహా మండలి.. సభ్యుడిగా జి.సతీశ్‌రెడ్డి



న్యూఢిల్లీ, జూన్ 10: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్‌డీవో ఛైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

నిప్పురవ్వ.. పెను జ్వాలై..

అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులతో మొదలై రణరంగంగా మారిన లాస్ ఏంజెలెస్


నిరసనకారులను చెదరగొడుతున్న నేషనల్ గార్డ్స్, భాష్పవాయు గోళాన్ని దూరంగా తన్నేస్తున్న నిరసనకారుడు

లాస్ ఏంజెలెస్.. అంటే దేవతల నగరం అని అర్థం! తళుకుబెళుకు తారలకు నిలయమైన హాలీవుడ్ కొలువుదీరిన నగరం!! ఈ నగరం.. కిందటి శుక్రవారం(జూన్ 6) నుంచి రణరంగంగా మారింది! ఒకవైపు పోలీసులు, దేశ సైన్యంలోని రిజర్వ్ దళాలు, దళాలు, మెరైన్లు.. మరోవైపు బాష్పవాయు ప్రయోగాలకు, రబ్బర్ బుల్లెట్లు, ఫ్లాష్ గ్రెనేడ్లకూ అదరక బెదరక నిరసన తెలుపుతున్న సాధారణ పౌరులు!! క్షణ క్షణం ఉద్రిక్తం.. ఇదీ అక్కడి పరిస్థితి! అక్రమ వలసదారులను డీపోర్ట్ చేయడమే లక్ష్యంగా అమెరికా ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు చేపట్టిన తనిఖీలు, చేసిన అరెస్టులతో చిన్న నిప్పురవ్వలా మొదలైన ప్రజాగ్రహం.. వారిని అణచివేయడానికి ట్రంప్ సర్కారు ఏకంగా నేషనల్ గార్డ్స్‌ను రంగంలోకి దించడంతో పెను జ్వాలగా మారింది.

అసలేమైందంటే..

అక్రమ వలసదారుల ఏరివేతలో భాగంగా జూన్ 6వ తేదీ ఉదయాన్నే ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులు లాస్ ఏంజెలెస్ వెస్ట్‌లేక్‌లోని హోమ్ డిపో సహా రోజువారీ కార్మికులంతా పనికోసం వచ్చే ఏడు కేంద్రాలపై ఒకే సమయంలో దాడులకు దిగారు. వారిని ప్రశ్నించినందుకు.. క్యాలిఫోర్నియాలోనే అతి పెద్ద కార్మిక యూనియన్ చీఫ్ అయిన డేవిడ్ హ్యుయెర్టాను అరెస్ట్ చేశారు. లాస్‌ఏంజెలెస్ డౌన్‌టౌన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు ఆయన్ను తరలించారు. ఆయనతోపాటు.. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న పలువురిని పట్టుకుని అక్కడికి తరలించారు. ఈ విషయం తెలియడంతో ఆ రోజు మధ్యాహ్నానికి పలువురు నిరసనకారులు డిటెన్షన్ సెంటర్ వద్దకు చేరుకుని శాంతియుతంగా నిరసన తెలపడం మొదలుపెట్టారు. సాయంత్రం 7 గంటల సమయంలో.. లాస్ ఏంజెలెస్ పోలీసులు నిరసనకారులను అక్కణ్నుంచీ చెదరగొట్టడానికి బాష్పవాయు ప్రయోగం చేశారు. మర్నాడు(జూన్ 7న) ఐసీఈ అధికారులు సరిహద్దు గస్తీ ఏజెంట్లను రంగంలోకి దింపి మరోసారి అక్రమ వలసదారులను పట్టుకునేందుకు తనిఖీలు చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ కావడంతో వందలాది మంది.. తనిఖీలు జరుగుతున్న పారామౌంట్ బిజినెస్ సెంటర్ వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. సాయంత్రానికి నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆరోజు రాత్రి 7 గంటల సమయంలో.. లాస్ ఏంజెలెస్‌లో జరుగుతున్న నిరసనలను అమెరికా ప్రభుత్వంపై తిరుగుబాటుగా పేర్కొన్న ట్రంప్ యంత్రాంగం.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు నేషనల్ గార్డ్ దళాలను రంగంలోకి దింపనున్నట్టు ప్రకటించింది. అంతేకాదు.. కాలిఫోర్నియాలోని క్యాంప్ పెండిల్టన్‌లో ఉన్న 500 మంది మెరైన్లను హై అలర్ట్‌లో ఉంచనున్నట్టు అమెరికా రక్షణ మంతి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ట్రంప్ సర్కారు నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. వెంటనే నేషనల్ గార్డ్స్ మోహరింపును ఉపసంహరించుకోవాలని సూచించారు(ఎందుకంటే.. ఒక రాష్ట్ర గవర్నర్ విజ్ఞప్తి చేయకుండా ఫెడరల్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించడం సంప్రదాయం కాదు). ఇక, జూన్ 8వ తేదీన.. సాయంత్రం 6గంటల నుంచి ఉదయం ఆరు గంటల దాకా లాస్ ఏంజెలెస్ కౌంటీవ్యాప్తంగా కర్ఫ్యూ విధిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట మధ్య.. వేలాది నిరసనకారులు డిటెన్షన్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. డీపోర్టేషన్ ప్రక్రియపై తీవ్ర నిరసన వెలిబుచ్చారు. పోలీసులు అక్కణ్నుంచీ వెళ్లిపోవాలని హెచ్చరించారు. రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. పలువురిని అరెస్టు చేశారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు. దీంతో ట్రంప్ సర్కారు శనివారం నియోగించిన 2100 మంది నేషనల్ గార్డ్ సిబ్బందికి అదనంగా సోమవారం మరో 2000 మందిని, 700మంది మెరైన్లను రంగంలోకి దించింది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం అడగకుండా సైన్యాన్ని రంగంలోకి దించడం అమెరికా రాజ్యాంగానికి విరుద్ధమని కాలిఫోర్నియా గవర్నర్ మండిపడుతున్నారు.

కాలిఫోర్నియాలో ఎందుకిన్ని దాడులు?

అమెరికాను అవకాశాల గడ్డగా భావించి ప్రపంచం నలుమూలల నుంచీ చాలా మంది అక్రమంగా వలస వస్తుంటారు. అలా వచ్చేవారు ఎక్కువగా ఉండేది ప్రపంచవ్యాప్తంగా పేరొందిన దిగ్గజ టెక్ కంపెనీలున్న కాలిఫోర్నియాలనే. ఆ రాష్ట్ర జనాభాలో 22 శాతం విదేశీ సంతతికి చెందినవారే. ప్యూరిసెర్చ్ గణాంకాల ప్రకారం 2022 నాటికి కాలిఫోర్నియా జనాభాలో 18 లక్షల మంది వలసదారులున్నారు. అందుకే ట్రంప్ గతంలో ఒకసారి.. 'లాస్ ఏంజెలెస్‌పైకి అక్రమ వలసదారులు, నేరగాళ్లు దండెత్తారు' అని సోషల్ మీడియాలో పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే ఐసీఈ అధికారులు కాలిఫోర్నియాపై.. ముఖ్యంగా లాస్ ఏంజెలెస్ నగరంపై దృష్టి సారించి వరుస దాడులు చేశారు.

-సెంట్రల్ డెస్క్

హార్వర్డ్‌కు వీసాల జారీ పునఃప్రారంభం

ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి విద్యార్థి (స్టూడెంట్/ ఎక్స్చేంజ్ విజిటర్) వీసాలు తిరిగి జారీ చేయాలని అమెరికా ఆదేశించింది. ఈ వీసాల ప్రాసెసింగ్‌ను పునఃప్రారంభించాలంటూ అన్ని దేశాల్లోని రాయబార కార్యాలయాలకు విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశాలను రద్దు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై తాత్కాలిక నిషేధం విధిస్తూ బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు చెప్పిన తీర్పునకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. అమెరికాలోని అతిపెద్ద విద్యాసంస్థల్లో ఒకటైన హార్వర్డ్‌లో ప్రవేశం కోసం కలలు కనే భారతీయ విద్యార్థులకు కోర్టు తీర్పుతో భారీ ఉపశమనం లభించింది.

ఇతర నగరాలకూ పాకుతున్న ఘర్షణలు

ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులతో లాస్ ఏంజెలెస్‌లో మొదలైన నిరసనల పర్వం.. క్రమంగా కార్చిచ్చుగా మారి అమెరికాలోని ఇతర ప్రధాన నగరాలకూ పాకుతోంది. న్యూయార్క్, షికాగో, డాలస్, అట్లాంటా తదితర నగరాల్లో వేలాది మంది నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో సోమవారం పెద్ద సంఖ్యలో నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. శాన్‌హోసేలోని సిటీహాల్ వద్ద వందల మంది గుమిగూడి నిరసన తెలుపగా.. శాన్‌డియోగోలో రెండుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే.. లాస్ వెగాస్, పోర్ట్‌లాండ్, సియాటిల్, న్యూయార్క్ నగరాల్లోనూ ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేపట్టారు. న్యూయార్క్‌లో ట్రంప్ టవర్ వద్ద నిరసనకు దిగినవారిలో తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డాలస్‌లోనూ పోలీసులు ఒక నిరసనకారుణ్ని అరెస్ట్ చేశారు. అటు.. టెక్సస్ కాపిటోల్ వద్ద 500 మంది, శాన్ ఆంటోనియోలో కొన్ని వందల మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అట్లాంటా, డెట్రాయిట్, ఒక్లహామా నగరాల్లో కూడా పలువురు ర్యాలీలు చేపట్టారు.

లోకం తీరు



చిన్నారులకు ట్రంప్ ఖాతాలు

» ఒక్కో ఖాతాలో 1000 డాలర్ల ఫండ్

వాషింగ్టన్ డీసీ, జూన్ 10: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. 2024 డిసెంబర్ 31 నుంచి 2029 జనవరి ఒకటో తేదీ వరకూ దేశంలో జన్మించిన బాలల కోసం ఉచితంగా ప్రారంభించిన ఇన్వెస్ట్‌మెంట్ ఖాతాల్లో 1000 డాలర్లు జమ చేయనున్నట్లు ప్రతిపాదించారు. స్టాక్ మార్కెట్‌తో అనుసంధానించే ఈ ఖాతాలను పిల్లల తల్లిదండ్రులు నిర్వహిస్తారు. ఈ ఖాతాలో ప్రతియేటా పిల్లల తల్లిదండ్రులు, బంధు మిత్రులు కూడా 5000 డాలర్ల వరకూ జమ చేయొచ్చు. పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు ఈ మొత్తంపై వడ్డీ జమ చేస్తారు. 30 ఏళ్ల తర్వాత మొత్తం విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, ఈ నిర్ణయం వల్ల అమెరికా ద్రవ్యలోటు పెరిగే ప్రమాదం ఉందని డెమోక్రాట్లతో పాటు రిపబ్లికన్లు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల మందిని ఆరోగ్య బీమా పథకం నుంచి తొలగిస్తారన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అమెరికాలోకి అక్రమంగా వచ్చేవారిని ఉపేక్షించం!

» భారత్‌లోని అమెరికా ఎంబసీ స్పష్టీకరణ

వాషింగ్టన్, జూన్ 10: తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారిని ఉపేక్షించబోమని అమెరికా స్పష్టం చేసింది. 'చట్టబద్ధంగా వచ్చే వారిని అమెరికా ఎల్లప్పుడూ స్వాగతిస్తుంది. కానీ, వీసాలను అక్రమంగా పొంది, అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తూ వచ్చే వారిని ఎంతమాత్రమూ సహించం' అని పేర్కొంది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టింది. న్యూజెర్సీలోని విమానాశ్రయంలో ఓ భారతీయ యువకుడిని స్థానిక అధికారులు చేతులు వెనక్కి కట్టి, సంకెళ్లు వేసి, నేల మీద అదిమిపెట్టిన వీడియో, ఫొటోలు వైరల్ అయిన నేపథ్యంలోనే, అమెరికా ఎంబసీ ఈ ప్రకటన విడుదల చేసింది.

మాల్దీవులకు 'గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్'గా కత్రినా కైఫ్



జూన్ 10: బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ దేశ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. నటిగా, వ్యాపారవేత్తగా ఆమెకున్న గుర్తింపు తమ దేశ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయంగా ప్రోత్సహించడంలో కలిసొస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. మాల్దీవుల 'సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్' ప్రచార కర్తగా ఎంపిక కావడం పట్ల కత్రినా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునే ప్రయత్నంలో భాగంగానే మాల్దీవుల ప్రభుత్వం కత్రినాను ప్రచారకర్తగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మోదీ వచ్చే నెలలో ఆ దేశానికి పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో కత్రినాను గ్లోబల్ అంబాసిడర్‌గా నియమించడం విశేషం.

ఆస్ట్రియా బడిలో కాల్పులు.. నిందితుడు సహా 10 మంది మృతి

వియన్నా, జూన్ 10: ఆస్ట్రియాలోని ఓ స్కూల్‌లో మాజీ విద్యార్థి జరిపిన కాల్పుల్లో 9 మంది మృతిచెందారు. దుండగుడు కూడా చనిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. దక్షిణ ఆస్ట్రియాలోని గ్రాజ్ నగర మేయర్ ఎల్కే కహార్ కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో 22 ఏళ్ల మాజీ విద్యార్థి స్కూల్‌లోకి వచ్చి, పిస్టల్, షాట్‌గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటనతో ఏడుగురు విద్యార్థులు అక్కడికక్కడే చనిపోయారు. 30 మందికి పైగా గాయపడ్డారు. మరో ఇద్దరు విద్యార్థులు చికిత్స పొందుతూ మృతిచెందారు. దుండగుడు కూడా స్కూల్ టాయ్‌లెట్‌లోకి వెళ్లి, తనను తాను కాల్చుకుని చనిపోయినట్లు మేయర్ తెలిపారు. కాగా.. ఫ్రాన్స్‌లోని ఓ మిడిల్ స్కూల్‌లో విద్యార్థుల బ్యాగులను ఆయమ్మ తనిఖీ చేస్తుండగా.. 15 ఏళ్ల ఓ విద్యార్థి ఆమెపై కత్తితో దాడిచేసి చంపేశాడు.

దేశంలో పడిపోతున్న జననాల రేటు

(మొదటిపేజీ తరువాయి)



ఉందని, అంటే జనాభా సంఖ్యను కొనసాగించడానికి కావాల్సిన జననాల రేటులో దేశం లేదని స్పష్టం చేసింది. జననాల రేటు మందగించినా.. యువత జనాభా మాత్రం దేశంలో గణనీయంగానే ఉందని తెలిపింది. 0-14 ఏళ్ల వారు 24 శాతం, 10-19 ఏళ్ల వారు 17 శాతం, 10-24 ఏళ్ల వారు 26 శాతం ఉన్నారని వెల్లడించింది. పని చేసే వయసు (15-64)లో ఉన్న వారు 68 శాతం ఉన్నారని వెల్లడించింది. ఇక 65 ఏళ్లు దాటిన వృద్ధులు మొత్తం జనాభాలో 7 శాతంగా ఉన్నారి, ఆయుర్దాయం అంచనా పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధుల సంఖ్య వచ్చే కాలంలో మరింత పెరుగుతుందని అంచనా వేసింది.

యూఎన్ నివేదికలో ముఖ్యాంశాలు..

- 2025లో ఆయుర్దాయం పురుషులకు 71 ఏళ్లు, మహిళలకు 74 ఏళ్లుగా అంచనా వేశారు.
- ప్రస్తుతం దేశ జనాభా 146.39 కోట్లు. వచ్చే 40 ఏళ్లలో అది 170కోట్లకు చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరోగమనం ప్రారంభమవుతుంది.
- 1960లో భారత జనాభా 43.6 కోట్లు. అప్పుడు మహిళలు సగటున ఆరుగురు పిల్లలకు జన్మనిచ్చేవారు. ఇప్పుడు సగటున ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనిస్తున్నారు.
- సంతానోత్పత్తికి ఎందుకు వెనకాడుతున్నారో తెలుసుకోవడానికి 14 దేశాల్లో 14 వేల మంది (భారత్ నుంచి 1,048) నుంచి ఐరాస అభిప్రాయాలు సేకరించింది. 38% భారతీయులు ఆర్థిక ఇబ్బందుల వల్ల కోరుకున్నంత మంది పిల్లలకు జన్మనివ్వలేకపోతున్నామని చెప్పారు. అలాగే, ఉద్యోగ భద్రత లేదని 21% మంది, ఇల్లు ఇబ్బంది ఉందని 22% మంది, పిల్లల సంరక్షణకు తగిన సౌకర్యాలు లేవని 18% మంది పేర్కొన్నారు. ఇక అనారోగ్యం కారణంగా 15%, సంతాన సాఫల్యత సమస్యల వల్ల 13%, గర్భిణులకు సంరక్షణ లేమి కారణంగా 14% సంతానోత్పత్తికి దూరంగా ఉన్నారు. భాగస్వామి లేదా కుటుంబం ఒత్తిడి వల్ల అనుకున్నంతమందికి జన్మనివ్వలేకపోతున్నామని 19 మంది చెప్పారు. భవిష్యత్‌పై భయంతో కూడా చాలా మంది పిల్లలకు దూరమవుతున్నారని నివేదిక వెల్లడించింది.

మహిళల్లో మార్పు వల్లే..

నివేదిక విడుదల సందర్భంగా యూఎన్ఎఫ్‌పీఏ భారత ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నర్ మాట్లాడుతూ.. "జననాల రేటు తగ్గించడంలో భారత్ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించింది. సగటున ఒక్కో మహిళ 1970లో ఐదుగురు పిల్లలకు జన్మనివ్వగా, ఇప్పుడు ఇద్దరికే జన్మనిస్తున్నారు. మహిళల్లో విద్య, ఆరోగ్య సంరక్షణ పెరగడం దీనికి కారణం. మాతృమరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇప్పటికి రాష్ట్రాల మధ్య, కులాల్లో, ఆదాయ వర్గాల్లో అసమానతలు అలాగే ఉన్నాయి. ప్రతిఒక్కరికి స్వేచ్ఛ, పునరుత్పత్తిలో సొంత నిర్ణయం ఉన్నప్పుడు జనాభాతో వచ్చే లాభాలు నిజంగా అందుతాయి. పునరుత్పత్తి హక్కులు, ఆర్థిక శ్రేయస్సు కలసి ముందుకెళ్లడాన్ని ప్రదర్శించే సదవకాశం భారత్ ముందు ఉంది" అని పేర్కొన్నారు.

- బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లో జననాల రేటు ఎక్కువగా ఉండగా, ఢిల్లీ, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భర్తీ రేటు కంటే తక్కువగా ఉంది. దీనికి ఆర్థిక అసమానతలు కారణమని నివేదిక పేర్కొంది.
- వేగవంతంగా జనాభా మార్పునకు లోనవుతున్న మధ్య ఆదాయ దేశాల జాబితాలో భారత్‌ను ఐరాస ఉంచింది. జనాభా రెట్టింపు అయ్యే సమయాన్ని 79 ఏళ్లుగా అంచనా వేసింది.

విజయోత్సవాల నిర్ణయం ఎవరిది?

తొక్కిసలాటపై కర్ణాటక సర్కారుకు హైకోర్టు ప్రశ్నల వర్షం

» ఆర్సీబీ మేనేజర్‌కు బెయిల్ నిరాకరణ

బెంగళూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరు తొక్కిసలాట ఘటనకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర విమర్శలు చేసింది. కార్యక్రమానికి అనుమతులు, రద్దీ నిర్వహణపై కీలకమైన తొమ్మిది ప్రశ్నలను ప్రభుత్వానికి సంధించింది. సీల్డ్ కవర్‌లో జవాబులు అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈనెల 5న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ క్రికెట్ జట్టు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా, 50 మందికిపైగా గాయాలపాలైన విషయం తెలిసిందే. ఘటనను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. మంగళవారం విచారణ జరిపింది. తొక్కిసలాట ఘటన తర్వాత ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలు తీసుకుందని, దర్యాప్తు సాగుతోందని ఏజీ కోర్టుకు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్‌తోపాటు ఐదుగురు అధికారులను సస్పెండ్ చేశారని, ఆర్‌సీబీ, డీఎన్ఏ ప్రతినిధుల బెయిల్ పిటిషన్లు హైకోర్టులో విచారణ దశలో ఉన్నాయని వివరించారు. అయితే, ఆర్‌సీబీ మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ సొసలెకు మధ్యంతరంగా ఏ విధమైన వెసులుబాటూ కల్పించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. నిఖిల్ భార్య మాళవిక దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. మరోవైపు, తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్ర సీఎస్‌పై వేటుకు కసరత్తు జరుపుతున్నట్టు తెలుస్తోంది.

ఆర్సీబీ విజయోత్సవాల నిర్ణయం సీఎందే: రాజ్‌భవన్

ఆర్సీబీ క్రికెట్ జట్టు విజయోత్సవాలు నిర్వహించాలనే నిర్ణయం కర్ణాటక సీఎం సిద్దరామయ్యదేనని, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను ఆహ్వానించింది కూడా ఆయనేనని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. 'ఆర్సీబీ ఆటగాళ్లను రాజ్‌భవన్‌కు పిలిచి సన్మానించాలని గవర్నర్ నిర్ణయించారు. అయితే, విధానసౌధ వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ఆయనకు తెలిపింది. ఆ కార్యక్రమంలో పాల్గొనాలని సీఎం అధికారికంగా గవర్నర్‌ను ఆహ్వానించారు' అని రాజ్‌భవన్ వర్గాలు ఒక ఆంగ్ల మ్యాగజైన్‌కు తెలిపాయి.

'చినాబ్ రైల్వే బ్రిడ్జి' ఘనత నా ఒక్కదానిదే కాదు

» ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత



న్యూఢిల్లీ, జూన్ 10: భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన చినాబ్ రైలు బ్రిడ్జి నిర్మాణంలో తన పాత్ర పరిమితమైనదని, నిర్మాణ ఘనత అంతా రైల్వే, అఫ్కాన్స్ సంస్థలదేనని ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత వినమ్రంగా తెలిపారు. ఈ వంతెన సివిల్ ఇంజనీరింగ్ అద్భుతమని, దీని నిర్మాణ ఘనత భారతీయ రైల్వేలకే దక్కుతుందని పేర్కొన్నారు. అత్యద్భుతమైన ఈ వంతెన నిర్మాణంలో వివిధ రూపాల్లో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. ప్రతిష్ఠాత్మక బ్రిడ్జి నిర్మాణంలో పాలుపంచుకొన్న తెరవెనక హీరోలు ఎంతో మంది ఉన్నారని, వారికి సెల్యూట్ చేస్తున్నానని వెల్లడించారు. అఫ్కాన్స్ సంస్థకు తాను జియో టెక్నికల్ కన్సల్టెంట్‌గా మాత్రమే ఉన్నానని.. ఏటవాలు ప్రాంతాల్లో పునాదులు, నిర్మాణాల డిజైన్ల అభివృద్ధిలో సాయం చేయడమే తన పని అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తనను అనవసరంగా తనను ప్రముఖురాలిని చేయొద్దని విజ్ఞప్తి చేశారు. తన గోప్యతకు భంగం కలిగించవద్దని కోరారు.

ప్రపంచంలో పెద్ద మతం క్రైస్తవం

» వేగంగా పెరుగుతున్న ఇస్లాం.. స్థిరంగా హిందూ మతం

న్యూఢిల్లీ, జూన్ 10: ప్రపంచంలో ప్రధాన మతాలను అనుసరించే వారి సంఖ్య ఓ వైపున పెరుగుతుంటే.. మరోవైపు తమకు ఎలాంటి మతమూ లేదని చెప్పేవారు కూడా గణనీయంగానే ఉన్నారు. క్రైస్తవం ఇప్పటికీ అతి పెద్ద మతంగా కొనసాగుతున్నప్పటికీ, మతం వద్దనుకొనే వారి సంఖ్య కూడా దాంట్లోనే అధికంగా ఉంది. అందువల్ల శాతాల్లో లెక్కిస్తే క్రైస్తవుల సంఖ్య తగ్గుతోంది. ఇంకోవైపు ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా పెరుగుతూ ఈ శతాబ్దం మధ్యభాగం నాటికి క్రైస్తవంతో సమానం కానుంది. హిందువుల జనాభా స్థిరంగా ఉండగా, బౌద్ధుల సంఖ్య పడిపోతోంది. ప్యూ రీసెర్చ్ సెంటర్ జరిపిన అధ్యయనంలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. 2010-2020 కాలానికి చెందిన 2,700 జనాభా లెక్కలు, సర్వేలను అధ్యయనం చేసిన ప్యూ సెంటర్ మతాల వారీగా జనాభా పెరుగుదలలో మార్పులను గుర్తించింది. ఈ పదేళ్ల కాలంలో క్రైస్తవుల జనాభా 218 కోట్ల నుంచి 230 కోట్లకు పెరిగింది. అయితే ప్రపంచ జనాభాలో క్రైస్తవుల వాటా తగ్గింది. 2010లో 30.6 శాతం ఉండగా, అది 28.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ముస్లిం జనాభా 34.70 కోట్ల మేర అధికమయింది. మొత్తం జనాభా సుమారు 200 కోట్ల వరకు ఉంది. 1.8 పాయింట్ల వృద్ధి శాతంతో ప్రపంచ జనాభాలో 25.6 శాతం వాటా పొందింది. ఏ మతమూ లేదని చెప్పే వారి సంఖ్య ప్రపంచ జనాభాలో 24.2 శాతం వరకు ఉంది. హిందూమతం, జుడాయిజం జనాభా స్థిరంగా ఉంది. గత పదేళ్లలో బౌద్ధుల జనాభా తగ్గింది. ఐరోపా దేశాల్లో క్రైస్తవుల సంఖ్య తగ్గుతుండగా సబ్ సహారన్ ఆఫ్రికాలో పెరుగుతోంది. ఎలాంటి మతం లేదని చెప్పేవారి సంఖ్య అమెరికా, చైనా, జపాన్‌ల్లో అధికంగా ఉంది. లౌకికవాద భావజాలం పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా సమాజం, పరిపాలనలో మార్పులు వస్తాయని ఈ అధ్యయనం చేసిన నిపుణులు అభిప్రాయపడ్డారు.

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

- రేపటి నుంచే అమలుకు చర్యలు
- ఏడాదికి 95,509 టన్నులు అవసరం
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన బియ్యం
- పక్కదారి పట్టకుండా ప్రతి సంచిపై క్యూఆర్ కోడ్
- నాణ్యతపై ప్రధానోపాధ్యాయుల అభిప్రాయ సేకరణ

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ప్రస్తుతం రేషన్ బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలుచేస్తుండగా, ఇకపై సన్న బియ్యంతో పథకం అమలుచేయాలని నిర్ణయించింది. మధ్యాహ్న భోజన విభాగం దీనిపై చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే సన్న బియ్యం సంచులు పాఠశాలలకు చేరాయి. గురువారం నుంచి బడులు ప్రారంభమవుతున్న క్రమంలో మొదటి రోజు నుంచే ఈ సన్న బియ్యంతో వండిన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాసియా విద్యాలయాలు, హాస్టళ్లల్లో ఈ మేరకు మార్పు అమల్లోకి రానుంది. ఇందుకోసం ఏడాదికి 95,509 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయని అంచనా వేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో 1-5 విద్యార్థులకు రోజుకు వంద గ్రాములు, 6-10 విద్యార్థులకు రోజుకు 150 గ్రాములు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 200 గ్రాముల చొప్పున బియ్యం అవసరం. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే 32,65,635 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. అందుకోసం ఏడాదికి 75,400 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. కేజీబీవీల్లో ఒక్కో విద్యార్థినికి రోజుకు 500 గ్రాముల బియ్యం అవసరం. కేజీబీవీల్లో 119560 మంది విద్యార్థినులు ఉండగా, ఏడాదికి 19,727 మెట్రిక్ టన్నులు కావాలి. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాసియా విద్యాలయాలు, హాస్టళ్లలో ఒక్కో విద్యార్థికి నెలకు 15 కిలోలు అవసరం. వీటిలో ఉన్న 2,095 మంది విద్యార్థులకు 382 మెట్రిక్ టన్నులు కావాలి. పాఠశాలలకు 25 కిలోల సంచుల రూపంలో బియ్యం సరఫరా చేస్తారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆటోమేటిక్‌గా ఇండెంట్ జనరేట్ అవుతుంది. గతంలో రేషన్ షాపుల నుంచి పాఠశాలలకు బియ్యం సరఫరా చేసేవారు. ఇప్పుడు పౌరసరఫరాల శాఖ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం పంపుతారు. ఈ బియ్యాన్ని పక్కదారి పట్టించకుండా ప్రతి సంచిపై క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియ్యాన్ని తీసుకున్నప్పుడు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. అలాగే సన్నబియ్యం నాణ్యతపై హెచ్ఎంలు అభిప్రాయాలు సేకరించాలని, నాణ్యతపై రేటింగ్ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది.

తొలి విడతగా 8 జిల్లాలకు రాగులు: మంత్రి నాదెండ్ల



తెనాలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు ఉన్న పేదలకు బియ్యంతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని అందించే లక్ష్యంతో, తొలివిడతగా వచ్చే నెల నుంచి రాయలసీమలోని ఎనిమిది జిల్లాలకు రాగులు సరఫరా చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో వీటి సాగు తక్కువగా ఉండటంతో ప్రస్తుతం ఒడిశా నుంచి 16,500 మెట్రిక్ టన్నుల రాగులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలో మంగళవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి చౌక డిపోల నుంచే బియ్యం సరఫరా చేయడం వల్ల సత్ఫలితాలు సాధించామని, ఎక్కడో ఒకటి రెండు చోట్ల మినహా పూర్తి శాతం బియ్యం నల్లబజార్లకు పోకుండా పేదల ఇంటికి చేరుతున్నాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో కోటీ 46 లక్షల రేషన్ కార్డులు ఉంటే మంగళవారం నాటికి 76 శాతం కార్డుదారులకు బియ్యం సరఫరా జరిగిందన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, ప్రత్యేక అవసరాలు గల 15.74 లక్షల మందిని గుర్తించి, ఇప్పటి వరకు 12.03 లక్షల మందికి నేరుగా ఇంటి దగ్గరకే పంపించామన్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు సన్నబియ్యం అందించే కార్యక్రమాన్ని మొదలు పెట్టామని తెలిపారు. వీటి సరఫరాలోనూ పారదర్శకత కోసం ప్రతి 25 కిలోల బ్యాగ్‌పై క్యూఆర్ కోడ్ ఉన్న ట్యాగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

విజయవాడ, విశాఖలో క్లీన్ ఎయిర్ జోన్లు

- పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

విజయవాడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నంలో త్వరలో క్లీన్ ఎయిర్ జోన్లు ఏర్పాటు చేస్తున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య తెలిపారు. విజయవాడలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో వర్క్‌షాపు నిర్వహించారు. విజయవాడలో రమేష్ ఆసుపత్రి, సిద్ధార్థ కళాశాల కూడలి, విశాఖలో కేజీహెచ్ ఆసుపత్రి ప్రాంతాలను క్లీన్ ఎయిర్ జోన్ పథకానికి ఎంపిక చేశామని వెల్లడించారు. ఈ పథకంలో స్వచ్ఛమైన గాలిని ప్రజలకు అందజేస్తామన్నారు. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థ ఇండియా ఈ ప్రాజెక్టును నిర్వహిస్తుందన్నారు. దీనికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని లండన్‌కు చెందిన టీఎఫ్ఎల్, ఢిల్లీకి చెందిన టీఈఆర్ఐ సంస్థలు అందజేస్తాయన్నారు. క్లీన్ ఎయిర్ జోన్లు విజయవంతంగా అమలైతే నగరాల్లో కాలుష్య మోతాదులు తగ్గుతాయని కృష్ణయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జోన్లలో పర్యావరణహిత ఫుట్‌పాత్ ఏర్పాటు చేయడంతోపాటు ఖాళీ స్థలాల్లో మియావాకి అడవులను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.



చెక్కును అందజేస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి

మాట నిలుపుకొన్న డిప్యూటీ సీఎం పవన్

- కొణిదెల గ్రామాభివృద్ధికి రూ.50 లక్షల వ్యక్తిగత నిధులు అందజేత

నంద్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి ఇచ్చిన మాటను ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. తన ఇంటి పేరుతో ఉన్న ఆ గ్రామానికి రూ.50 లక్షల చెక్కు అందజేశారు. భవిష్యత్‌లో మరింత అండగా ఉంటానని ప్రకటించారు. గత నెలలో కర్నూలు జిల్లా పూడిచెర్ల గ్రామంలో జరిగిన ఫారంపాండ్స్ నిర్మాణ ప్రారంభోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తన నియోజకవర్గ పరిధిలోని కొణిదెల గ్రామం గురించి ఆయనకు తెలియజేశారు. 'మీ ఇంటి పేరు కలిగిన కొణిదెల గ్రామం ఉంది.. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధికి సహకరించండి' అంటూ పవన్ కల్యాణ్‌ను అభ్యర్థించారు. దీంతో వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం తన ఇంటి పేరుతో ఉన్న గ్రామాభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కొణిదెల గ్రామాభివృద్ధికి తన వ్యక్తిగత నిధుల నుంచి రూ.50 లక్షల చెక్కు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారికి పంపగా పవన్ కల్యాణ్ పంపిన చెక్కును డీఆర్వో రాము నాయక్, ఏఓ రవికుమార్, సూపరిటెండెంట్ నరసింహారావుకు అందజేశారు. పవన్ కల్యాణ్ తమ గ్రామంపై చూపిన ఆదరాభిమానాలకు కొణిదెల గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజైన మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

'యోగాంధ్ర' కీలకం!

రికార్డు కోసం విశాఖ వైపు ప్రపంచం చూపు

- పట్టుదలతో కార్యక్రమం నిర్వహించాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్
- రాజకీయాలకతీతంగా పాల్గొనాలని పిలుపు

విశాఖపట్నం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'యోగాంధ్ర' అత్యంత కీలకమైనదని, మనం సాధించబోయే రికార్డు కోసం ప్రపంచమంతా విశాఖ వైపు చూస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విశాఖలో ఈ నెల 21న నిర్వహించనున్న 'యోగా డే' ఏర్పాట్లపై మంగళవారం బీచ్‌రోడ్డులోని సాగరిక కన్వెన్షన్ హాల్‌లో లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒకే ప్రాంతంలో ఐదు లక్షల మందితో నిర్వహించే ఈ కార్యక్రమం ప్రపంచంలోనే అతి పెద్దదిగా చరిత్ర సృష్టించబోతోందన్నారు. ప్రధాని మోదీ దీనికి హాజరు కానున్నారని, అధికారులంతా అంకితభావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పక్షాలూ దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా వల్ల ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని ప్రధాని చెబుతున్నారని, దీనిపై ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. 21వ తేదీ ఉదయం 6.30 గంటలకు ప్రధాని ఆర్కే బీచ్‌రోడ్డులో కాళీ మాత గుడి వద్ద ఏర్పాటు చేసే ప్రధాన ప్రాంగణానికి చేరుకుంటారని, ఆయన రావడానికి గంట ముందే ప్రజలంతా ఆయా కంపార్టుమెంట్లకు చేరేలా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రజల్ని 600 మీటర్లకు మించి నడిపించవద్దని, ఆ మేరకు వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశానికి ముందు ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న యోగా శిక్షణను లోకేశ్ తిలకించారు. సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అనిత, శ్రీబాలవీరాంజనేయస్వామి, సత్యప్రసాద్, సంధ్యారాణి



యోగా శిక్షణను పరిశీలిస్తున్న లోకేశ్, రామ్మోహన్‌నాయుడు, వంగలపూడి అనిత

యోగాంధ్రపై అవగాహన, శిక్షణ

- మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం

యోగాంధ్ర కార్యక్రమాలపై విస్తృత అవగాహన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో రెండు సాంకేతిక సంస్థలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. బీచ్‌రోడ్డులోని ఏయూ సాగరిక హాల్‌లో మంగళవారం మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రుల సమక్షంలో సంబంధిత సంస్థలకు చెందిన అధికారులు, ఆయుష్ విభాగం రాష్ట్ర స్థాయి అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఒప్పందం చేసుకున్న సంస్థల్లో కర్నూలులోని ట్రిపుల్ ఐటీ డీఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్) సాంకేతిక విద్యా సంస్థ, మహారాష్ట్రకు చెందిన సాంకేతిక సంస్థ హాబిల్డ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. ఐఐఐటీ డీఎం కర్నూలుకు చెందిన ఆచార్యులు కృష్ణనాయక్, ఎం.నరేష్‌బాబు, హాబిల్డ్ సాంకేతిక సంస్థ ప్రతినిధి అన్షుల్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ ఆయుష్ విభాగం డైరెక్టర్ దినేష్‌కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐఐటీ డీఎం-కర్నూలు సంస్థ యోగాపై శిక్షణ ఇచ్చేందుకు కృత్రిమ మేధ ఆధారంగా యాప్ రూపొందించింది.

నాది కాలేజీ జీవితం.. మీది జైలు జీవితం!

- నాకు క్లాస్‌మేట్స్ ఉంటే.. మీకు జైల్‌మేట్స్ మిగిలారు
- అర్థమైందా రాజా..!: ఎక్స్‌లో లోకేశ్

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'జగన్ గారూ.. ముసుగు తీసేయండి. మీ హయాంలో, మీ పర్యవేక్షణలో జరిగిన నేరాలకు మమ్మల్ని నిందించడానికి ప్రయత్నించవద్దు. మీ కపటత్వాన్ని చూసి నవ్వుకోవడం తప్ప నేనేమీ చేయలేను' అని మంత్రి లోకేశ్ అన్నారు. మంగళవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'నాకు కాలేజీ జీవితం ఉండేది. మీకు జైలు జీవితం ఉండేది. నాకు క్లాస్‌మేట్స్ ఉంటే.. మీకు జైల్ మేట్స్ ఉన్నారు. అర్థం అయిందా రాజా? నేను మహిళలను గౌరవించే వాతావరణంలో పెరిగాను. మీరు మీ సొంత తల్లి, చెల్లిని బయటకు వెళ్లగొట్టారు. వారిని కోర్టుకు లాగారు. మీ మీడియా, సోషల్ మీడియాలో ప్రతిరోజూ వారి వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా మీ ఐదేళ్ల పాలన ఓ చీకటి అధ్యాయం. ప్రతీకార రాజకీయాలకు, దళితులు, మహిళలపై దారుణాలకు, మీ మీడియాలో వండివార్చిన అబద్ధాలకు నిలయంగా రాష్ట్రాన్ని మార్చేశారు. మీ పాలనపై గళం విప్పిన వారిని నకిలీ కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆంధ్రప్రదేశ్‌ను పోలీసు రాష్ట్రంగా మార్చేశారు' అని లోకేశ్ ఆరోపించారు.

ఏడాదిలో రూ.9.2 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి లక్ష్యం
- పరిశ్రమలకు నీటి చార్జీలు తగ్గించే ప్రయత్నం
- ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి టీజీ భరత్



విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత 2014-2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌కు రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే, 2024-25 ఒక్క ఏడాదిలోనే రూ.9.2 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. విశాఖపట్నంలో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) మంగళవారం నిర్వహించిన ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2025 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలకు చేదు అనుభవాలు ఎదురయ్యాయని, తిరిగి వారిలో విశ్వాసం నింపి, పెట్టుబడులు రప్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణం 2028 నాటికి పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మంత్రి లోకేశ్ కేవలం 30 నిమిషాల జూమ్ మీటింగ్ ద్వారా ఉత్తరాంధ్రాకు ఆర్సెలర్ మిట్టల్ కంపెనీ వచ్చేలా చేశారన్నారు. గత ప్రభుత్వం టెక్స్‌టైల్స్ రంగానికి పాలసీని విడుదల చేసి మార్గదర్శకాలు ఇవ్వలేదని, దీనివల్ల ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తాము పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చామని, ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు నీటి చార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఫ్యాప్సీ అవార్డులు వీరికే..

అగ్రి, ఆక్వా ఆధారిత పరిశ్రమల్లో నెక్కంటి సీఫుడ్స్, ఎంఎస్ఎంఈ, ఎగుమతుల విభాగంలో ఆనంద ఎంటర్‌ప్రైజెస్, ప్రొడక్షన్ ఇన్నోవేషన్‌లో ఎఫెట్రానిక్స్ సిస్టమ్స్‌కు, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా లేఖ్య ఎంటర్‌ప్రైజెస్ (సునీత), ఉత్తమ స్టార్టప్‌గా స్టీలాన్ కాల్ సర్వీసెస్, సీఎస్ఆర్ విభాగంలో దివీస్ లేబరేటరీ, ఉద్యోగుల సంక్షేమ విధానాల్లో ఐటీసీ అగ్రి డివిజన్‌కు, ఆల్‌రౌండర్ అవార్డు సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా, గ్రీన్ ఎనర్జీలో దాల్మియా సిమెంట్స్, రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో అరవింద్ ఇండస్ట్రీస్, భారీ, మధ్య తరహా పరిశ్రమల ఎగుమతుల్లో శారదా మెటల్స్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డులను మంత్రి భరత్, విశాఖ ఎంపీ శ్రీభరత్ అందించారు. ఫ్యాప్సీ అధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎ.సత్యనారాయణ, కరుణేంద్ర పాల్గొన్నారు.

15 వేల మందికి ర్యాంకులు కేటాయించలేదు

- ఏపీఈఏపీ సెట్ కన్వీనర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో అర్హత సాధించిన 15 వేల మంది విద్యార్థుల 10+2 మార్కులు అందుబాటులో లేని కారణంగా వారికి ర్యాంకులు కేటాయించలేదని..విద్యార్థులు, తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఇంటర్ ఉత్తీర్ణులైన ఏపీ, తెలంగాణ బోర్డులకు చెందిన రెగ్యులర్ విద్యార్థులు వారి ఇంటర్ మార్కులను అప్‌లోడ్ చేయాల్సిన అవసరంలేదన్నారు. ఆ విద్యార్థులకు ర్యాంకులు కేటాయించకపోతే ఏపీ ఈఏపీసెట్‌లో తమ ఇంటర్ హాల్‌టికెట్ నంబరు సరిచూసుకుని హెల్ప్‌లైన్ సెంటరును 0884- 2359599, 2342499 నంబర్లలో గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా గానీ సంప్రదించాలన్నారు. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, ఏపీఓఎస్ఎస్, ఎన్ఐఓఎస్, డిప్లొమా,ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు ఇంటర్ మార్కులను బుధవారం నుంచి ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

జనం దూసుకొస్తారని భయపడ్డాం

- గోదావత్ ఏవియేషన్ అనుమతితో టేకాఫ్ చేశాం
- విండ్ షీల్డ్ కాదు.. ఫ్లెక్స్ విండో పేన్‌లో చీలిక
- అది పెద్దదైతే జగన్‌కు ఇబ్బంది వస్తుందని భావించాం
- అందుకే ఆయన్ను వదిలేసి వెళ్లిపోయాం
- కుంటిమద్ది హెలీప్యాడ్ ఘటనపై పైలెట్ వివరణ
- రామగిరి సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరు



పోలీస్ కార్యాలయంలోకి వెళుతున్న పైలెట్ అనిల్ కుమార్


చెన్నేకొత్తపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది హెలీప్యాడ్ ఘటనలో హెలికాప్టర్ ప్రధాన పైలెట్ అనిల్ కుమార్ ఎట్టకేలకు పోలీసుల విచారణకు హాజరయ్యారు. రామగిరి సీఐ శ్రీధర్ నేతృత్వంలో మంగళవారం ఉదయం 11-20 గంటల నుంచి మధ్యాహ్నం 2-20 గంటల వరకు ఆయనను విచారించారు. తెలిసిన వివరాల మేరకు.. హెలికాప్టర్ ఫ్లెక్స్ విండో పేన్ (సైడ్ మిర్రర్) క్రాక్ ఇవ్వడంతో అక్కడి నుంచి జగన్‌ను తీసుకెళ్లకుండా వెళ్లిపోయామని పైలెట్ చెప్పారు. హెలికాప్టర్ వద్దకు జనం దూసుకురావడం, చుట్టుముట్టేయడంతో సైడ్ మిర్రర్ దెబ్బతిందని, వీవీఐపీ పర్యటనను ముగించుకుని వచ్చేసరికి మళ్లీ హెలీప్యాడ్‌లోకి జనం ఎక్కడ దూసుకువస్తారోనని భయపడ్డామని తెలిపారు. ఈ విషయాన్ని గోదావత్ ఏవియేషన్ సంస్థ యాజమాన్యానికి తెలిపి, వారి అనుమతితోనే హెలికాప్టర్‌ను టేకాఫ్ చేశామని చెప్పారు. హెలికాప్టర్ గాలిలోకి ఎగిరినప్పుడు మిర్రర్ చీలిక మరింత పెద్దదైతే జగన్‌కు ఇబ్బంది వస్తుందనే ఆందోళనతో ఆయన్ను తిరిగి తీసుకువెళ్లకుండా వెళ్లిపోయామని చెప్పారు. అలా వెళ్లేందుకు తమకున్న అధికారాన్ని వినియోగించామని, తాము కంఫర్ట్ జోన్‌లో ఉంటాము కాబట్టే టేకాఫ్ చేశామని వివరించారు. కాగా, మూడు సార్లు డుమ్మా కొట్టిన పైలెట్.. నాలుగో నోటీసు ఇచ్చాక తన న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. 'హెలికాప్టర్ వద్దకు జనంఎలా దూసుకువచ్చారు? జగన్‌ను వదిలేసి ఎందుకు వెళ్లారు? ఫ్లెక్స్ విండో పేన్ క్రాక్ ఇస్తే హెలికాప్టర్‌ను ఎలా టేకాఫ్ చేశారు? ఎవరి అనుమతి తీసుకుని వెళ్లారు?' అని పైలెట్‌ను పోలీసులు ప్రశ్నించారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఏప్రిల్ 8న జగన్ హెలికాప్టర్‌లో ఇక్కడకు వచ్చిన విషయం తెలిసిందే. హెలీప్యాడ్‌లో ఆయన దిగిన వెంటనే వైసీపీ శ్రేణులు దూసుకువెళ్లాయి. ఈ సమయంలో విండ్ షీల్డ్ దెబ్బతినడంతో జగన్‌ను తిరిగి తీసుకువెళ్లకుండానే హెలికాప్టర్ వెళ్లిపోవడం వివాదాస్పదమైంది. దీని వెనుక కుట్ర ఉందని వైసీపీ ఆరోపించడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సహా పలువురిని ఇప్పటికే విచారించారు.

వైసీపీ నేతల సూచనలు తీసుకొని...?

ఇప్పటికే విచారణకు హాజరైన కో పైలెట్ శ్రేయస్‌జైన్, పైలట్ అనిల్ చెప్పిన అంశాలు అంత నమ్మశక్యంగా లేవని పోలీసులు భావిస్తున్నారు. విచారణకు వచ్చేముందు వైసీపీ నేతల సూచనలు తీసుకుని, అందుకు అనుగుణంగా సమాధానాలు చెప్పి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ కేసులో కుట్ర కోణం గురించి సేకరించిన ప్రాథమిక ఆధారాలు, ప్రధాన నిందితుడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ప్రమేయం ఉందనేందుకు సాక్ష్యాలను పైలెట్‌కు చూపించి ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో వైసీపీకి చెందిన 85 మందిని విచారించామని, మరో 10 నుంచి 15 మందిని విచారించాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

మందం తెలియని మంద బుద్ధులు వారివి!

- డయాఫ్రం వాల్ మందంపై సాక్షి కథనాలపై నిమ్మల మండిపాటు
- 0.9 కాదు.. 1.5 మీటర్లు అంటూ కొలతలతో నిరూపణ



డయాఫ్రమ్ వాల్‌ను 1.5 మీటర్ల మందంతో నిర్మిస్తున్నట్టు కొలిచి చూపిస్తున్న బావర్ కంపెనీ ప్రతినిధులు

ఏలూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రం వాల్ మందాన్ని 1.5 మీటర్ల నుంచి 0.9 మీటర్లకు తగ్గించేస్తున్నారని అబద్ధాలు, అవినీతికి జన్మించిన సాక్షి పత్రిక చేస్తున్న విష ప్రచారాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా ఖండించారు. కనీస అవగాహన లేకుండా ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానం తెలియకుండా నోటికొచ్చిన అబద్ధాలు అచ్చేసి పోలవరం ప్రాజెక్టు పనుల వేగంపై నీళ్లు చల్లాలనుకోవడం వైసీపీ అవివేకమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పనులను మంగళవారం మంత్రి పరిశీలించి, కాంట్రాక్టు ఏజెన్సీ, ఇంజనీర్లతో సమీక్షించారు. డయాఫ్రం వాల్ ప్యానల్ మందాన్ని బావర్ కంపెనీ ప్రతినిధులతో కొలిపించి 1.5 మీటర్లు ఉన్న విషయాన్ని మీడియాతోపాటు అక్కడున్నవారికి చూపించారు. ఈ మందాన్ని 0.9 మీటర్లకు కుదించారంటూ సాక్షి పత్రిక చేస్తున్న విష ప్రచారం తప్పని తేల్చేశారు. గతంలో కూడా పోలవరం డ్యామ్ ఎత్తును తగ్గించేస్తున్నామంటూ ప్రచారం చేసి.. వాస్తవాలు బయటపడిన తర్వాత వైసీపీ నేతలు మొఖం చాటేశారని మంత్రి రామానాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం అభివృద్ధి నిరోధక వైసీపీకి ఇష్టంలేదని విరుచుకుపడ్డారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కెనడాకు మోదీ!

ఐదురోజుల్లో ఆరంభంకాబోతున్న జీ7సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనబోతున్నారు. ఇందుకోసం పదేళ్ళ తరువాత కెనడాలో అడుగుపెట్టబోతున్నారు. కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో ఉండగా ఇరుదేశాల సంబంధాలను ఉప్పూనిప్పూగా మార్చివేసిన విషయం తెలిసిందే. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య ఘటనతో ఏడాదిన్నర కాలంగా రెండుదేశాల మధ్య పూడ్చలేనంత అగాధం ఏర్పడింది. ట్రూడో హద్దులు దాటిన వ్యాఖ్యలతో, నిరాధారమైన ఆరోపణలతో దౌత్యసంబంధాలను దెబ్బతీశారు. ఇరుదేశాలు వాగ్బాణాలు విసురుకున్నాయి, దౌత్యసిబ్బందిని బహిష్కరించుకున్నాయి, వాణిజ్యచర్చలను సైతం నిలిపివేశాయి. ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ భారత ప్రధానికి ఫోన్‌చేసి జీ7 సదస్సుకు ఆహ్వానించడం ద్వారా ఆ ప్రతిష్ఠంభనను తొలగించారు. అయితే, ఇందుకు ఆయన స్వదేశంలో విమర్శలు ఎదుర్కోవాల్సివచ్చింది, వివరణలూ ఇచ్చుకోవాల్సివచ్చింది. జనసంఖ్యలో తొలిస్థానంలోనూ, ఆర్థికవ్యవస్థలో ఐదోస్థానంలోనూ ఉంటూ, ప్రపంచ సరఫరావ్యవస్థల్లో ముఖ్యభూమిక నిర్వహిస్తున్న భారత్‌ను ఆహ్వానించకుండా ఎలా ఉంటాం? అని ఆయన ఎదురుప్రశ్న వేశారు. భౌగోళికార్థిక, రాజకీయ ప్రాధాన్యతలరీత్యా పిలిచారే తప్ప, మనమీద గౌరవంతో కాదని కొందరు చేస్తున్న వ్యంగ్య వ్యాఖ్యలను అటుంచితే, భారత్‌ను కాదనగలిగే స్థితిలో ఆ అగ్రరాజ్య కూటమి లేదన్నది వాస్తవం. కెనడాకు ఇది రాజీకావచ్చు. భారతదేశానికి మాత్రం గౌరవమే.

అయితే, మేనెల తొలివారంలోనే ఆహ్వాన ప్రక్రియను పూర్తిచేయాల్సిన కెనడా ఆ మేరకు మనల్ని వెనక్కునెట్టి, కాసింత కక్షతీర్చుకున్నట్టే కనిపిస్తోంది. ప్రత్యేకాహ్వానితులకు సైతం నెలక్రితమే పిలుపులు వచ్చి, వస్తున్నామన్న వారి సందేశాలు కూడా వెనక్కు చేరిపోయినా, మనలను మాత్రం వారం ముందువరకూ పిలవకుండా ఊరుకోవడం విచిత్రమే. ఈ పేరంటానికి ఎంతకూ పిలుపురాకపోవడం గురించి జాతీయమీడియా తెగచర్చోపచర్చలు చేసింది. రమ్మని అనకపోతే మనకు పోయేదేమీ లేదని కొందరు విశ్లేషకులు సాధారణజనానికి ముందే సర్దిచెప్పారు. ఇప్పుడు కేవలం ఓ వారంముందు ఫోన్‌చేసి రమ్మంటే వెళ్ళిపోవడం ఏమి బాగుంటుందని కొందరి అనుమానం. వెళ్ళకపోతే అలిగామనో, అవమానపడ్డామనో అనుకుంటారు కనుక, వారిది పైచేయి కాకుండా వెళ్ళడమే మంచిదని మన నాయకులకు అనిపించివుండవచ్చు. ప్రపంచస్థాయి సదస్సులు నరేంద్రమోదీకి కొత్తేమీ కాదు కానీ, పదకొండేళ్ళ పాలన పూర్తిచేసుకున్న వారంలోనే ఆయన కెనడాలో కాలూని, ఏడుగురు దేశాధినేతలతో ముచ్చటించబోతున్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో, ఉగ్రవాదంపై పోరు విషయంలో భారత్ వీసమెత్తురాజీపడబోదని మిగతా ప్రపంచానికి మరోమారు చాటిచెప్పేందుకు ఈ సదస్సు ఉపకరిస్తుంది. పహల్గాంలో పర్యాటకుల ఊచకోత, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పాత్ర, భారత్ ఆత్మరక్షణ హక్కు ఇత్యాది అంశాలను ఆయన వివరించవచ్చు. వాణిజ్యాన్ని ఆయుధంగా వాడి యుద్ధం నేనే ఆపానని చెప్పుకున్న అమెరికా అధ్యక్షుడితో నేరుగా సంభాషించగలిగే సందర్భం కూడా ఇదే.

ఈ సదస్సుకు మోదీని ఆహ్వానించడం ఖలిస్తానీ శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఎంత ఒత్తిడితెచ్చినా కెనడా ప్రధాని ముందడుగువేశారని ప్రశంసిస్తున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న భారత్‌కు సహజవాయువు అమ్ముకోవచ్చు, అణువిద్యుత్ కర్మాగారాలు నిర్మించవచ్చు, మరెన్నో ప్రాజెక్టులు నిర్మించి మనమూ బాగుపడవచ్చునంటూ కెనడా ప్రధాని నిర్ణయాన్ని అక్కడి విపక్షనాయకుడు సైతం సమర్థించుకొచ్చారు. భారత వ్యతిరేక చర్యలకు కెనడాను వేదికగా వాడుకుంటున్న ఖలిస్థానీ వేర్పాటువాద శక్తుల పట్ల కెనడా ప్రధాని కఠినంగా వ్యవహరించినప్పుడే ఉభయదేశాల సంబంధాలు పూర్తిస్థాయిలో తిరిగిపట్టాలు ఎక్కుతాయి. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రెండుదేశాలు పూర్తిగా సహకరించుకుంటాయని గట్టిగా చెబుతున్న కెనడా ప్రధాని, తమదేశంలో ఖలిస్తానీల బలం, బలగంతో నిమిత్తం లేకుండా భారతదేశం ఆందోళనలకు, అనుమానాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌తోనూ, అక్కడి ఉగ్రవాద సంస్థలతోనూ వైరం హెచ్చి, రాబోయే రోజుల్లో భారత్ మరింత పోరాడాల్సిన తరుణంలో, ఈ శక్తులకు కెనడానుంచి ఎటువంటి మద్దతూ లభించకుండా చూడాలి. మోదీని ఆహ్వానించడం వెనుక కెనడా స్వప్రయోజనాల పరిరక్షణ ఉన్నట్టే, భారతీయులు గణనీయంగా ఉన్న కెనడాతో నెయ్యం సాధించడం భారత్‌కూ ప్రయోజనకరమే.

భారత రాష్ట్ర సమితి రాజకీయ అనిశ్చిత పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా యోజనాల దూరంలోని అమెరికాలో అట్టహాసంగా జరిపిన తెలంగాణ అవతరణ దినోత్సవ సభ ద్వారా భారాస లేదా కేటీఆర్ బృందం ఏ రకమైన సందేశం ఎవరికి ఇవ్వదలుచుకున్నది?

కేటీఆర్ కేంద్రంగా అమెరికాలోనూ హడావుడి!


భారత రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఇటీవల అమెరికాలో తెలంగాణ అవతరణ దినోత్సవాలు విజయవంతంగా జరిగాయి. మాతృభూమిలోని రాజకీయాలకు ప్రత్యేకించి భారాస రాజకీయ కార్యాచరణకు ఈ వేడుకలు పరోక్షంగా ఒక దిశ, దశను నిర్దేశించాయని చెప్పవచ్చు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతూ తొలుత 2014లో న్యూయార్క్‌లో, పిదప 2019లో టెక్సాస్‌లో నిర్వహించిన సభల స్థాయిలో తెలంగాణ రాష్ట్ర అవతరణోత్సవ సభను భారాస నిర్వహించిందని చెప్పవచ్చు. ప్రధాని మోదీ సభలు విజయవంతం కావడానికి అప్పట్లో రాంమాధవ్ కృషి ఒక ప్రధాన కారణం. అయితే భారత రాష్ట్ర సమితికి అమెరికాలో ఆ స్థాయి నాయకత్వ శ్రేణులు లేవు.

గల్ఫ్ లేఖ

అయినప్పటికీ అమెరికాలో తెలంగాణ ప్రవాసులు ఇప్పటి వరకు నిర్వహించిన రాజకీయ సభలలో ఇటీవలి భారాస సభ విజయకేతనంగా నిలిచిందనడంలో సందేహం లేదు.

తెలంగాణ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సభ కేటీఆర్ కేంద్రంగా జరిగింది! ఈ భారీ సభలో కేటీఆర్ మాత్రమే భవిష్యత్తులో భారాసకు అధినాయకుడని స్పష్టమైన సంకేతాలు వెల్లడయ్యాయి. ఆంధ్రప్రదేశ్ వైపు తెలంగాణ ఆరంభంలో ఉండే సూర్యాపేటకు చెందిన జగదీశ్ రెడ్డి మొదలు మహారాష్ట్రకు సమీపంలో ఉండే చెన్నూరు ప్రాంతీయుడు బాల్క సుమన్ వరకు దాదాపు భారాస నాయకగణం అంతా తరలివచ్చిన అమెరికా సభ ఒక విధంగా కేటీఆర్ పట్టాభిషేక ఉత్సవమని కూడ అంతరంగికుల అభిప్రాయం. కేసీఆర్ దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయంటూ కవిత ఆక్షేపించిన నేపథ్యంలో ఈ సభకు భారాస నాయకులు పలువురు ప్రత్యేకంగా వచ్చి పాల్గొనడం సహజంగానే ఆసక్తి కలిగించింది. తమ రాజకీయ అస్తిత్వ ప్రదర్శన అయిన ఎల్కతుర్తి సభకు వరంగల్ జిల్లా భారాస కార్యకర్తలు ఎంత వరకు పని చేసారో తెలియదు



కానీ అమెరికా సభ విజయవంతం కావడానికి మాత్రం వరంగల్ జిల్లా నాయకులందరు కలిసికట్టుగా కృషి చేశారు. అందునా అమెరికా ప్రవాసురాలు ఒకరు కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది ఈ సభా విజయానికి చురుకైన పాత్ర వహించడం విశేషం.

అసలు అమెరికాలో భారాస కంటే కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి ప్రాబల్యం ఎక్కువ. విదేశాలలో తెలంగాణవాదానికి బతుకమ్మ అనేది ఒక సాంస్కృతిక ప్రతీక. బతుకమ్మ స్ఫూర్తిని అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా సకల దేశాలలో వ్యాపింపజేయడంలో కవిత కీలకపాత్ర వహించారు. ఈ రీత్యా అమెరికాలో తెలంగాణ జాగృతి ఒక ఊపు మీద ఉండాలి. పైగా కేటీఆర్ స్వాగత సన్నాహక ఏర్పాట్లు జరుగుతున్న సందర్భంలో కవిత అమెరికాలోనే ఉన్నారు. కవిత లేదా తెలంగాణ జాగృతి ఎక్కడ కూడ ఈ సన్నాహక ఏర్పాట్ల దరిదాపులలో కూడ కనిపించలేదు. భారాస నాయకగణం అమెరికాలో ఉన్నా ఎవరూ కూడా అమెతో ప్రత్యేకంగా భేటీ అయినట్లుగా కూడ సమాచారం లేదు. అమెరికా నుంచి తిరిగి వెళ్ళిన తర్వాత కవిత తన వ్యాఖ్యల ద్వారా ప్రకంపనలు సృష్టించారు.

అమెరికాలో భారాసకు తన్నీరు మహేశ్ రావు ఒక ప్రధాన దిక్కు. అందరితో సౌమ్యంగా ఉంటూ కలుపుకుపోయే స్వభావం ఆయన సొంతం. భారాస అగ్ర నాయకుడు హరీశ్ రావుకు మహేశ్ స్వయాన సోదరుడు. ఈ సభ నిర్వహణలో మహేశ్ రావుతో ఇతరులు కీలక పాత్ర వహించారు. విభిన్న సామాజిక వర్గాల నేపథ్యం ఉన్న ఈ ఇతరులు ఇక్కడ ఒక ప్రధాన ఆకర్షణ. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీల నేతల, సామాజిక వర్గాలకు చెందిన బంధుమిత్ర గణం విదేశాలలో పార్టీ కార్యకలాపాలలో ముందంజలో ఉంటారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు కూడ ఇదే పరిస్థితి. అయితే ఈసారి కేటీఆర్ సభ నిర్వహణలో విభిన్న సామాజిక వర్గాలకు చెందిన ప్రవాసులకు కూడా పాత్ర కల్పించారు.

అధికారంలో లేకున్నా కేటీఆర్ అమెరికాకు వస్తూ లండన్‌లోనూ, ఆ తర్వాత అమెరికాలో విశ్వవిద్యాలయాల విద్యార్థులు, వ్యాపార ప్రముఖులతో జరిపిన సమావేశాల ద్వారా సామాజిక మాధ్యమాలలో సముచిత ప్రాచుర్యం కల్పించారు. అమెరికాలో అడుగుపెట్టినప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు కేటీఆర్ వేసిన ప్రతి అడుగు గురించి వివరించిన తీరు విలక్షణంగా ఉన్నది. దాని లక్ష్యం ఎవరు? అమెరికాలో ఉన్నవారా లేదా తెలంగాణలో ఉన్న వారా అనేది తెలియదు. రాజకీయ అస్తిత్వం కొరకు తెలంగాణలో పోరాడవల్సిన సమయంలో అమెరికాలో సభ ఎందుకు అంటూ కవిత సంధించిన ప్రశ్నను కూడ తోసిపుచ్చడానికి వీలు లేదు.

భారత రాష్ట్ర సమితి రాజకీయ అనిశ్చిత పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా యోజనాల దూరంలోని అమెరికాలో అట్టహాసంగా జరిపిన తెలంగాణ అవతరణ దినోత్సవ సభ ద్వారా భారాస లేదా కేటీఆర్ బృందం ఏ రకమైన సందేశం ఎవరికి ఇవ్వదలుచుకున్నది?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

జాతిని నడిపిస్తున్న ఆలోచనే మోదీ



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఆయన పాలనను పర్యాలోచన చేస్తే భారత రాజకీయాల్లో మోదీ రంగప్రవేశం తర్వాత కొత్త శకం మొదలైందని అనిపిస్తుంది. పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయిన తర్వాత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఒక ఆర్థిక వ్యవస్థగా దేశం రూపురేఖలు మారినట్లే, మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఒక రాజకీయ, సామాజిక వ్యవస్థగా దేశం తీరుతెన్నులు మారాయన్న అభిప్రాయం కలుగుతుంది. పీవీ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల ప్రభావం ప్రతి రంగంలోనూ ఇప్పుడు కనపడుతోంది. మనుషుల జీవన ప్రమాణాలు మాత్రమే కాదు, మానవ సంబంధాలు కూడా మారిపోయాయి. మార్కెట్ శక్తులు మనిషి ఆలోచనలను పసిగట్టి తమకు అనుకూలంగా మార్చుకునే పరిస్థితి ఏర్పడింది. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు పెరిగిపోయాయి.

నరేంద్ర మోదీ ఈ పరిస్థితుల్లో దేశ రాజకీయాల్లోకి ప్రవేశించారు. మార్పుకు చోదకశక్తిగా తనను తాను ప్రకటించుకున్నారు. మోదీ మార్కెట్‌ను సృష్టించలేదు. మార్కెట్‌కు అనువుగా తనను తాను తీర్చిదిద్దుకున్నారు. దేశంలో పెరుగుతున్న యువ జనాభా, టెక్నాలజీ, ముఖ్యంగా సోషల్ మీడియా విప్లవం, పట్టణీకరణ దేశ రాజకీయ క్రీడ స్వరూప స్వభావాలను మార్చి వేశాయి. ఈ క్రీడలో మోదీ నిష్ణాతుడుగా నిరూపించుకున్నారు. పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను కొనసాగిస్తూనే రాజకీయ, సామాజిక వ్యవస్థలపై పట్టు బిగించడం ప్రారంభించారు. క్రమంగా దేశ రాజకీయాలన్నీ తన చుట్టూ తిరిగేలా చేసుకున్నారు. మోదీ ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలా అన్న మీమాంసలో ప్రతి రాజకీయ పార్టీ పడే పరిస్థితి ఏర్పడింది. సామాజిక వ్యవస్థలపై, సామూహిక చేతనపై ఒక బలమైన భావజాలం ప్రభావం చూపేందుకు మోదీ కారణమయ్యారు. ఇద్దరు వ్యక్తులు ఈ దేశం గురించి మాట్లాడుకుంటే నరేంద్రమోదీ అన్న వ్యక్తి పేరు దొర్లక తప్పని పరిస్థితిని ఆయన కల్పించారు. మోదీ దుర్మార్గుడని తీర్మానిస్తూ బలంగా ద్వేషించే వారు ఒక వర్గం అయితే, మోదీ అంతటి దేశభక్తుడు, జాతీయవాది మరొకరు లేరని బలంగా ఆరాధించేవారు మరో వర్గంగా చీలిపోయారు. తనను విమర్శించినా విస్మరించలేని పరిస్థితిని మోదీ కల్పించుకున్నారు.

'బలమైన నాయకులు సాధారణంగా జాతీయవాదాన్ని తమ రాజకీయంగా ప్రకటిస్తూ తమ చుట్టూ ఒక వ్యక్తిగతమైన ఆకర్షణను సృష్టించుకుంటారు. ఈ దేశ సమస్యల్ని పరిష్కరించగల సామర్థ్యం తమకే ఉన్నదని, తామేది చేసినా దేశం కోసమే చేశామనే అభిప్రాయాల్ని కల్పించే ప్రయత్నిస్తారు. ప్రజాస్వామ్యం పట్ల అవిశ్వాసం ఉన్నా, తాము ప్రజాస్వామికంగానే వ్యవహరిస్తున్నామని జనం భావించేలా చేస్తారు..' అని ప్రముఖ బ్రిటిష్ జర్నలిస్టు గిడియన్ రాక్‌మన్ అన్నారు. నిజానికి ఈ విశ్లేషణ మోదీకి మాత్రమే కాదు, దేశంలో అనేకమంది నేతలకు కూడా వర్తిస్తుంది. అయితే మోదీ ప్రభావం ఇప్పటి వరకూ మన దేశం చూసిన నేతల కంటే విస్తృతమైనదే కాదు, భిన్నమైనది కూడా. తాను అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలైనా తన ఆమోదయోగ్యత, ప్రభావం తగ్గలేదని మోదీ నిరూపించుకున్నారు. అలా తగ్గలేదని నిరూపించుకునేందుకు ఆయన మొత్తం పార్టీ వ్యవస్థనూ, ప్రభుత్వ యంత్రాంగాన్నీ మాత్రమే కాదు, అనేక సంస్థల్నీ, వ్యక్తుల్నీ, మీడియాను ఉపయోగించుకుంటుండవచ్చు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ రాకపోయినా ఇవాళ పార్టీ మొత్తం తన చుట్టూ కేంద్రీకృతం కావడమే కాదు. తన మిత్రపక్షాలుగా భావిస్తున్న వారిని కూడా తన చుట్టూ దృష్టి సారించేలా చేసుకోగలిగారు. అంతే కాదు. దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఆత్మరక్షణలో పడిపోయి తనను నిత్యం విమర్శించకుండా ఉండలేని పరిస్థితిని కల్పించుకున్నారు. అయిష్టంగానైనా కొన్ని పార్టీలు భజన చేసే పరిస్థితి కల్పించుకున్నారు. అలా చేసుకోగలగడమే ఆయన బలమైన నాయకత్వ లక్షణానికి నిదర్శనం.

బలమైన చర్యలు తీసుకోని వారు బలమైన నాయకులు కాలేరు. ఒక్కోసారి ఆ బలమైన చర్యలు బెడిసికొట్టవచ్చు, కాని ఆ పరిస్థితులను కూడా తనకు అనుకూలంగా తిప్పుకుని వ్యతిరేకతా పవనాలకు ఎదురొడ్డి పైకి లేవగల శక్తి తనకున్నదని మోదీ రుజువు చేసుకున్నారు. గత 11 సంవత్సరాలలో మోదీ ఎంతో ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. రెట్టింపు కంటే ఎక్కువ ధరలకు రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేశారన్న విమర్శల్ని ఎదుర్కొన్నారు. వేలాది రైతులు సాగు చట్టాలకు వ్యతిరేకంగా నెలల తరబడి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. భూసేకరణ చట్టాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సమాచార హక్కు చట్టాన్నీ నీరుకార్చారన్న విమర్శలూ ఎదుర్కొన్నారు. జీఎస్టీ విధించిన తీరు కూడా వివాదాస్పదమయింది. పెగాసస్ నిఘా సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రతిపక్షాల కదలికల్ని పసికట్టారన్న ఆరోపణలూ ఎదురయ్యాయి. భయంకరమైన కరోనా అగ్నిపరీక్షగా మారింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పడిపోయినా సరే పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గకపోవడం, రూపాయి విలువ దారుణంగా పడిపోవడం, ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరుకోవడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులను చర్చలు లేకుండా ఆమోదించడం, పార్లమెంట్ నూతన భవన ప్రారంభాన్ని, అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను తానే నిర్వహించడం కూడా చరిత్ర పుటల్లో నమోదయ్యాయి. ఇక వ్యవస్థలపై పట్టు సాధించేందుకు చేసిన ప్రయత్నాలూ, ప్రతిపక్ష నేతలకు వ్యతిరేకంగా ఈడీ, సీబీఐ వంటి సంస్థల్ని ప్రయోగించడం కూడా జనం చర్చల్లో రాకమానలేదు. ఎన్నికల బాండ్ల పేరుతో అధికార పార్టీ పారదర్శకత లేకుండా భారీ ఎత్తున నిధులు సేకరించడాన్ని సుప్రీంకోర్టే తప్పు పట్టింది. చివరకు పాకిస్థాన్‌పై యుద్ధం ప్రారంభించి నాలుగు రోజుల్లో కాల్పుల విరమణ ప్రకటించడం మోదీ హయాంలో ఇప్పటివరకూ తీసుకున్న నిర్ణయాలకంటే ఎక్కువగా అంతటా చర్చనీయాంశమైంది.

వాజపేయి కంటే భిన్నమైన నేత నరేంద్ర మోదీ. ఆయన తనకు అనుకూలంగా జరిగిన ప్రచారాన్ని మాత్రమే కాదు, ఈ దేశ సమస్యలకన్నిటికీ నెహ్రూ–గాంధీ కుటుంబమే కారణమని ప్రతిభావంతంగా జనం విశ్వసించేలా చేయగలిగారు. కార్పొరేట్లకు అనుకూలమైన ప్రధానిగా ప్రతిపక్షాలు విమర్శించినా, తనను తాను ఓబీసీ నేతగా, చాయ్‌వాలాగా, తన తల్లి అంట్లు తోమిన పేదరాలిగా గద్గద స్వరంతో మాట్లాడి ఆకట్టుకోగలిగిన శక్తి మోదీకి ఉన్నది. తన విజయాలను తనకు అనుకూలంగా మార్చుకుని తన వైఫల్యాలకు ప్రతిపక్షాల గత నిర్ణయాలే కారణమని చెప్పడంలో మోదీని మించిన దిట్ట ఎవరూ లేరు. అన్నిటికంటే మించి మెజారిటీ హిందువులను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు అన్ని రకాల వ్యూహాలను అవలంబించిన భారతీయ జనతా పార్టీ నేత మరొకరు లేరు. ఈ విషయంలో అద్వానీ, వాజపేయిలను కూడా మోదీ ఎంతో అధిగమించారు. సమాజాన్ని చీల్చారన్న విమర్శ ఎదుర్కొన్నా అదే ఆయన బలంగా మారింది.



నరేంద్ర మోదీ ఇవాళ ఒక వ్యక్తి కాదు ఒక శక్తి, ఒక సమిష్టి ఆలోచనా విధానంగా మారిపోయిన మహాశక్తి. ప్రధానమంత్రిగా విఫలమైనా, విజయవంతమైనా ఆయన ఆలోచనా విధానం ప్రజల మనసుల్లోంచి తొలగిపోవడం అంత సులభం కాదు. ఆయన ప్రధానిగా ఎన్నాళ్లుంటారన్నది ప్రశ్న కాదు. ఆయన ఆలోచనా విధానం కంటే బలమైన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడే ప్రతిపక్షం విజయం సాధించగలదు.

మోదీ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో ప్రతిపక్షాలు చేయని ప్రయత్నం అంటూ లేదు. కాని ఆ ప్రయత్నాలన్నీ వీగిపోయాయి. 'చౌకీదార్ చోర్ హై' అన్న నినాదం జనంలోకి వెళ్లలేదు. అదానీ, అంబానీలను మితిమీరి ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలూ ప్రభావం చూపలేదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక అసమానతల గురించి ఎంత తీవ్రంగా మాట్లాడినా అరణ్య రోదనలే అయ్యాయి. సామాజిక న్యాయాన్ని ఎజెండాగా చేపట్టినా జనంలో కదలికలు కనపడ్డ దాఖలాలు లేవు. గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కయిందని తాజాగా రాహుల్ గాంధీ ఆరోపించారు. లక్షలాది నకిలీ ఓటర్లను జాబితాలో చేర్చారని, రెండు గంటల్లో 65 లక్షల ఓట్లు పోలయ్యాయని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. మహారాష్ట్ర మాదిరే బిహార్‌లో కూడా బీజేపీ అక్రమంగా గెలిచే ప్రయత్నం తప్పక చేస్తుందని రాహుల్ ఘంటాపథంగా సూచిస్తున్నారు. అయినా రాహుల్, కాంగ్రెస్ నేతల ఆరోపణలు జనం నమ్ముతున్నారని చెప్పేందుకు దాఖలాలు ఏమీ లేవు. అసలు కాంగ్రెస్ మాదిరి మిగతా రాజకీయ పార్టీలు కూడా బీజేపీ అక్రమాల ద్వారా గెలుస్తోందని నమ్ముతున్నాయా, బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా విషయంలో జరిగినట్లు అన్ని పార్టీలు ఎన్నికలను బహిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాయా, అంతకు మించి బంగ్లాలో లాగా ప్రజా వెల్లువ కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీలకు అనుకూలంగా మారగలదా అన్న ప్రశ్నలకు జవాబు రానంతవరకూ రాహుల్ ఎన్ని ఆరోపణలు చేసినా వాటికి ప్రామాణికత ఏర్పడదు. అంతే కాదు, ప్రజాభిప్రాయాన్ని తమకు పూర్తిగా అనుకూలంగా మళ్లించుకునేందుకు, ప్రజలు తమ వెంట నడిచేందుకు తగిన వాతావరణాన్ని సృష్టించుకోవడంలో, తమ విశ్వసనీయతను పెంచుకోవడంలో ఈ దేశంలో ప్రతిపక్ష పార్టీలు ఎంతవరకు విజయం సాధించాయన్నదే ప్రశ్నార్థకం. అసలు మోదీపై తాము ఎక్కుపెట్టిన విమర్శలన్నీ ఎందుకు వీగిపోతున్నాయో ప్రతిపక్షాలకూ క్లూ అందడం లేదు!

నరేంద్రమోదీ త్వరలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఆయన 11 సంవత్సరాల పాలనపై బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు ఎంతో ప్రాధాన్యమున్నది. భగవంతుడు ఒక లక్ష్యంతోనే భూమ్మీద తనను ప్రవేశపెట్టాడని భావిస్తున్న నరేంద్ర మోదీ ఇవాళ ఒక వ్యక్తి కాదు ఒక శక్తి, ఒక సమిష్టి ఆలోచనా విధానంగా మారిపోయిన మహాశక్తి. ప్రధానమంత్రిగా విఫలమైనా, విజయవంతమైనా ఆయన ఆలోచనా విధానం ప్రజల మనసుల్లోంచి తొలగిపోవడం అంత సులభం కాదు. ఆయన ప్రధానిగా ఎన్నాళ్లుంటారన్నది ప్రశ్న కాదు. ఆయన ఆలోచనా విధానం కంటే బలమైన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడే ప్రతిపక్షం విజయం సాధించగలదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పదకొండేళ్లుగా పరిగెడుతున్న పురోగతి

మన దేశ ఆర్థిక వ్యవస్థ 2014కి ముందు నత్తనడక నడిచేది. సరైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోయేవి. ఎక్కడ చూసినా అవినీతి, దిగజారిన శాంతిభద్రతలు, నిర్భయ వంటి ఘటనలు, నక్సల్స్ విధ్వంసం, కశ్మీర్‌లో రాళ్ల దాడులు, తెలుగు రాష్ట్రాల్లో విభజన చిచ్చుతో మంటలు.

2025 నాటికి– మన దేశం ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. ఆరోగ్య, సాంకేతిక విద్యలో ప్రపంచస్థాయి ఇన్‌స్టిట్యూట్స్ వెలిశాయి. పరిశ్రమలు, పెట్టుబడులు వెల్లువలా వచ్చిపడ్డాయి. అవినీతి తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా అద్భుతమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి జరిగింది. కశ్మీర్ సమస్య, అయోధ్య సమస్యలు పరిష్కారమయ్యాయి. నక్సల్ ఉద్యమం చివరి దశకు చేరింది. విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తున్నది.

ఆశల్లేని స్థితి నుంచి జీవం పోసి పరుగులు పెట్టించే శక్తి వల్లనే గత పదకొండేళ్ళలో ఈ మార్పు సాధ్యమైంది. ఆ శక్తి ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ). దేశంలో ఎన్డీఏ పాలనకు 11 ఏళ్లు పూర్తవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో 2014–18 మధ్య ఎన్డీఏ పాలనలో పోలవరం ప్రాజెక్టు ఊహించని పురోగతి సాధించింది. 2019 నాటికి పోలవరం పనులు 72 శాతం పూర్తయ్యాయి. దీనికి కారణం డబుల్ ఇంజిన్ సర్కార్. తర్వాత ఐదేళ్ళ వైసీపీ పాలనలో జరిగిన పనులు 3.84శాతం మాత్రమే. ఇప్పుడు గత ఏడాదిలో డబుల్ ఇంజిన్ పాలనలో జరిగిన పనులు 5.93శాతం. ఐదేళ్లలో జరిగిన పనుల కన్నా ఏడాదిలో జరిగింది చాలా ఎక్కువ. ఒక్క పోలవరం మాత్రమే కాదు, డబుల్ ఇంజిన్ పాలనలో అమరావతి నిర్మాణం పరుగులు పెట్టింది. మళ్లీ ఇప్పుడు ఆ వేగం కనిపిస్తోంది.



పదకొండేళ్ల మోదీ పాలనలో భారత పురోగతి అంకెల్లో చెప్పుకుంటే ఇంత పురోగమించామా అని మనం ఆశ్చర్యపోతాం. 2014లో భారతదేశ నామినల్ జీడీపీ సుమారు 2.1 ట్రిలియన్ యూఎస్ డాలర్లు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నామినల్ జీడీపీ సుమారు 4.3 ట్రిలియన్ యూఎస్ డాలర్లు. పదకొండేళ్లలో జీడీపీ రెట్టింపు అయింది.

పదకొండేళ్ల మోదీ పాలనలో భారత పురోగతి అంకెల్లో చెప్పుకుంటే ఇంత పురోగమించామా అని మనం ఆశ్చర్యపోతాం. 2014లో భారతదేశ నామినల్ జీడీపీ సుమారు 2.1 ట్రిలియన్ యూఎస్ డాలర్లు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నామినల్ జీడీపీ సుమారు 4.3 ట్రిలియన్ యూఎస్ డాలర్లు. పదకొండేళ్లలో జీడీపీ రెట్టింపు అయింది. జపాన్‌ను అధిగమించి భారతదేశం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. 'పర్చేసింగ్ పవర్ పారిటీ' (PPP) ఆధారంగా, భారతదేశం ప్రపంచంలో చైనా, అమెరికాల తర్వాత మూడవ స్థానంలో ఉంది. అదే పదకొండేళ్ల కిందట భారత్ స్థానం 20! భారత్ విదేశాంగ విధానం ఎంత బలంగా ఉందో పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ నిరూపించింది. పాకిస్థాన్‌కు చైనా, టర్కీ మద్దతు తెలిపాయి. అంతమాత్రానికే ఆ దేశానికి ప్రపంచమంతా అండగా ఉందని మన దేశంలో ఉంటూ మన దేశానికే వ్యతిరేకంగా మాట్లాడేవారు చెబుతూ ఉంటారు. కానీ భారత్ సూపర్ పవర్‌గా ఎదిగితే తమ ఆధిపత్యానికి భంగం కలుగుతుందని భయపడే దేశాలు, మతమౌఢ్యం ఎక్కువగా గల దేశాలు మాత్రమే పాకిస్థాన్‌కు మద్దతు పలికాయి. మిగతా ప్రపంచం అంతా పహల్గాం దాడిని ఖండించింది. ఆపరేషన్ సిందూర్‌ను అభినందించింది.

అంతర్జాతీయంగా భారత్ ఇమేజ్ పెరగడానికి ముఖ్య కారణం అంతర్గత అభివృద్ధి. అన్ని రాష్ట్రాలు కలిస్తేనే భారతదేశమనే స్ఫూర్తిని టీమ్ ఇండియాగా భావించిన ప్రధానమంత్రి మోదీ అన్ని రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందేలా పదకొండేళ్లుగా సమర్థవంతమైన పాలన అందిస్తున్నారు. ఈ పదకొండేళ్ల కాలంలో దేశంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాయి. భారత్‌మాల పరియోజన ద్వారా సుమారు 50వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 550 జిల్లా కేంద్రాలను నాలుగు-లేన్ హైవేల ద్వారా అనుసంధానించారు. భారతదేశ తీర ప్రాంత మౌలిక సదుపాయాల ఆధునీకరణ, కొత్త ఓడరేవుల నిర్మాణం, తీర ఆర్థిక మండళ్ల అభివృద్ధి కోసం లక్షల కోట్లు ఖర్చు చేశారు. 1,386కి.మీ పొడవైన ఢిల్లీ, ముంబై ఎక్స్‌ప్రెస్ హైవేను లక్ష కోట్లతో పూర్తి చేస్తున్నారు. ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్, చినాబ్ బ్రిడ్జి వంటి ఇంజనీరింగ్ అద్భుతాలు ఇందులో ఉన్నాయి.

దేశం పురోగతికి అభివృద్ధి ఎంత ముఖ్యమో ప్రజా సంక్షేమం కూడా అంతే ముఖ్యం. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2025 నాటికి 3 కోట్ల అదనపు ఇళ్లను నిర్మిస్తోంది. 25 కోట్ల మంది పేదలకు గృహభద్రతను అందిస్తుంది. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా 2024 నాటికి దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా గృహాలకు టాయిలెట్లు నిర్మించారు. ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా 2024 నాటికి 10 కోట్లకు పైగా కుటుంబాలు లబ్ధి పొందాయి. ఆరోగ్య ప్రమాణాలు పెంచుకున్నాయి. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా 2024 నాటికి 10 కోట్లకు పైగా ఎల్పీజీ కనెక్షన్‌లు అందించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 2024 నాటికి 12 కోట్లకు పైగా రైతులకు రూ.2.5లక్షల కోట్లకు పైగా నేరుగా బదిలీ చేశారు. 'నేషన్ ఫస్ట్' నినాదంతో దేశాన్ని ప్రపంచం స్థాయి శక్తిగా మార్చే లక్ష్యంతో పాలన సాగిస్తే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో ఈ పదకొండేళ్ల ప్రధాని మోదీ పాలనలో ఋజువైంది. ఇదే వేగంతో, దార్శనికతతో ముందుకు సాగితే వచ్చే దశాబ్దంలో భారత్ ప్రపంచాన్ని శాసిస్తుంది.

● ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి
బీజేపీ ఉపాధ్యక్షుడు, ఏపీ

ఏడాదిలోనే ఎనలేని అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే లక్షల కోట్ల పెట్టుబడులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మరోవైపు సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తోంది. అమరావతితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన అభివృద్ధికి అగ్రపీఠం వేసి కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ ఎనర్జీతో ముందుకెళ్తుంది.

విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దనున్నారు. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపదను ఈ రీజియన్ నుంచి సృష్టించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యం. అలాగే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి, మన్యం ఇలా మొత్తం 8 జిల్లాల పరిధిలో ఆర్థిక వ్యవహారాల్ని పెంచే ప్రాజెక్టులు నెలకొల్పనున్నారు. వీటి అవసరాలకు ఇక్కడ లక్ష ఎకరాలు సేకరించనున్నారు.




రాయలసీమలో ఎలక్ట్రానిక్ ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల్ని నెలకొల్పుతున్నారు. బనకచర్ల రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తలమానికంగా నిలవనుంది. చంద్రబాబు కార్యదీక్షతో 78 ప్రాజెక్టుల్లో రూ.9.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించారు. దీంతో 5.70 లక్షల ఉద్యోగావకాశాలు రానున్నాయి. అనకాపల్లి జిల్లాలో రూ.1.85 లక్షల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు, శ్రీసిటీలో రూ.5000 కోట్లతో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ, రూ.65వేల కోట్లతో రిలయెన్స్ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ తీసుకొచ్చారు. వీటితో మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోని ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. దీనిలో భాగంగా రూ.72వేల కోట్లతో హైవే ప్రాజెక్టులు, రూ.70వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టులకు మంజూరు తీసుకొచ్చారు. 77 కిలోమీటర్ల మేర నిర్మించనున్న వైజాగ్ మెట్రో ప్రాజెక్టు 2028 – 30 నాటికి పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులను సిద్ధం చేశారు.

కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోంది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న నిరుద్యోగుల కలలు నెరవేరుస్తూ 6,100 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసి పరీక్షలు నిర్వహించారు. 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ప్రకటన విడుదల చేసి ఈ నెలాఖరికి మొత్తం పరీక్షలు పూర్తి చేయనున్నారు. ఇంకా రాష్ట్రంలో కొత్తగా కొన్ని విశ్వవిద్యాలయాలు నెలకొల్పనున్నారు. ఇవి కాకుండా ప్రపంచ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ యూనివర్శిటీ, మరికొన్ని టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్లు తీసుకొస్తున్నారు.

ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తునే మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నికల హామీలను ఏడాదిలో అరవై శాతానికి పైగా పూర్తి చేశారు. వృద్ధాప్యపు పింఛన్ల పెంచి, నెలకు 64 లక్షల మందికి ఈ ఏడాదిలో రూ.34 వేల కోట్లు పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 55,57,525 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. దీని కోసం పాత బకాయిలతో సహా రూ.15,258 కోట్లు చెల్లించింది. దీపం–2 పథకం కింద ఇప్పటికే కోటి సిలిండర్లు లబ్ధిదారుల ఇళ్ళకు చేర్చారు. దీనికి రూ. 2,684 కోట్లు ఖర్చు చేశారు. రహదారుల మరమ్మతులకు రూ.1200 కోట్లు ఖర్చు చేశారు. పంచాయితీల అభివృద్ధికి రూ.990 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల్ని ఈ నెల నుంచే అమలు చేయనున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం... ఇంకా మరెన్నో సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో నిర్వహిస్తూ స్వర్ణాంధ్ర సాధన దిశగా దూసుకుపోతుంది.

– దాసరి శ్యామ్‌చంద్రశేషు
తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి



గ్రాండ్‌గా..

పర్యాటక రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చొరవచూపుతోంది. భవానీ ద్వీపానికే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఐకానిక్ టవర్‌ను ఆధునీకరించడానికి నడుం బిగించింది. ఐల్యాండ్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రూ.2.65 కోట్లు కేటాయించింది. దీంతో రంగంలోకి దిగిన భవానీ ఐల్యాండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. పర్యాటకుల మనస్సు దోచుకునేలా తీర్చిదిద్దనుంది.

భవానీ ద్వీపం ఐకానిక్ టవర్ ఆధునీకరణ!

పాత టవర్‌తోనే దీపానికి గుర్తింపు

- వరదల వల్ల అందుబాటులోకి రాని కొత్త టవర్
- ద్వీపం రూపు రేఖలు మార్చటానికి ప్రభుత్వం చొరవ

ఐల్యాండ్ ఆధునీకరణకు రూ.2.65 కోట్లు కేటాయింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భవానీ ద్వీపం అనగానే ముందుగా గుర్తొచ్చేది ఐకానిక్ టవర్. కృష్ణానదిలో సహజసిద్ధంగా ఏర్పడిన భవానీ ద్వీపానికి ఒక గుర్తింపును తీసుకువచ్చింది ఈ టవరేనని చెప్పాలి. చిన్నారులను అమితంగా ఆకట్టుకున్న ఈ టవర్ కారణంగానే భవానీ ద్వీపం సందర్శకులతో కళకళలాడేది. రానురాను భవానీ ద్వీపంలో ఇతర ఆకర్షణలు ఏర్పాటు చేయడం, తరచూ వచ్చే వరదలు టవర్‌కు వెళ్లే మార్గం లేకుండా చేయటంతో కొంత కాలంగా సందర్శకులకు దూరంగా ఉంటుంది. కృష్ణానదిలో బోట్ల మీద ద్వీపానికి వచ్చే వారికి ఈ టవర్ కనువిందు చేస్తున్నా.. అక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

స్వల్ప మార్పులు..

ఐకానిక్ టవర్‌కు భారీ వర్షాలు కురిసినా కూడా రంగు వెలసిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఐకానిక్ టవర్‌లో స్వల్ప మార్పులు చేర్పులు చేయాలని భావిస్తున్నారు. టవర్‌లో కొన్ని భాగాలను తొలగించి అదనపు హంగులను కల్పించనున్నారు. భవానీ ద్వీపం ఐకానిక్ టవర్‌ను ద్వీపానికే ప్రత్యేక ఆకర్షణగా నిలపాలని భావిస్తున్నారు. ఐకానిక్ టవర్‌తో ప్రారంభించే మార్పులు ఆ తర్వాత క్రమేణా భవానీ ద్వీపం రూపు రేఖలను మార్చేసేలా అధికారులు డిజైన్లు కూడా తయారు చేయించారు. దశల వారీగా పైచిత్రంలో మాదిరిగా భవానీ ద్వీపం కొత్త రూపాన్ని సంతరించుకోనుంది.

రూ.2.65 కోట్లతో మెరుగులు

రాష్ట్ర ప్రభుత్వం భవానీ ఐల్యాండ్‌ను రెన్నోవేషన్ చేయటానికి రూ.2.65 కోట్లు కేటాయించిన నేపథ్యంలో భవానీ ద్వీపం ఐకానిక్ టవర్‌పై భవానీ ఐల్యాండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (బీఐటీసీ) దృష్టి సారించింది. చాలాకాలం నుంచి పర్యాటకులు ఐకానిక్ టవర్ దగ్గరకు రాలేకపోతుండటంతో దీనిని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. భారీ వరదలకు భవానీ ద్వీపం కోతకు గురి కాకుండా ఉండటానికి రూ.1.25 కోట్ల వ్యయంతో ముందుగా వరద తాకే ప్రాంతంలో స్టీల్ షీట్ ఫైలింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ పనుల కోసం ఇప్పటికే టెండర్లు పిలిచారు. టెండర్లను కూడా ఖరారు మిగతా 6లో..

జెడ్పీ విభజన సంగతేంటి..?

పదిహేను నెలల్లో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం

3 జిల్లాల్లో చేరిన ఉమ్మడి కృష్ణాలోని 49 మండలాలు

- కృష్ణాకు 25, ఎన్టీఆర్‌కు 16, ఏలూరుకు 8 మండలాలు కేటాయింపు
- ఆయా జిల్లాలకు ఉద్యోగులు, అధికారుల సర్దుబాటు తప్పనిసరి
- కార్యాలయాలు, ఇతర భవనాల ఏర్పాటుపై ఏది ప్రణాళిక!
- ఎన్టీఆర్ జిల్లాకు ప్రత్యేకంగా జిల్లాపరిషత్‌ను నిర్మించాల్సిందే!
- ఇప్పుడు మొదలుపెడితేనే అప్పటికి పూర్తవుతుందంటున్న ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 49 మండలాలు ఉన్నాయి. జిల్లాల విభజన తర్వాత 25 మండలాలు కృష్ణాజిల్లాలోకి, 16 మండలాలు ఎన్టీఆర్ జిల్లాలోకి, ఎనిమిది మండలాలు ఏలూరు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. అయినప్పటికీ జిల్లా పరిషత్ పాలకవర్గం నేటికీ ఉమ్మడి జిల్లాగానే పరిగణిస్తున్నారు. మచిలీపట్నంలోని జెడ్పీ కార్యాలయం నుంచే పరిపాలనను కొనసాగిస్తున్నారు. జెడ్పీ పాఠశాలలతో పాటు, మండల పరిషత్ కార్యాలయాలకు సంబంధించిన పాలన యావత్తు మచిలీపట్నంలోని జెడ్పీ కార్యాలయం కేంద్రంగానే సాగుతోంది. జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అన్ని విభాగాల అధికారులు హాజరవుతున్నారు. అయితే జెడ్పీ పాలకవర్గం పదవీకాలం మరో 15 నెలల వ్యవధిలో ముగియనుంది. అత్యంత కీలకమైన జెడ్పీలోని పరిపాలనా విభాగాలను విడగొట్టేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నం జరగలేదనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచింది. ఈ ఏడాది కాలంలో నాలుగు విడతల్లో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శాసన సభ్యులు హాజరుకాలేదు. కలెక్టర్, జేసీ స్థాయి అధికారులు ఒకటీ, రెండు సార్లు మాత్రమే హాజరయ్యారు. జెడ్పీ విభజన జరిగితే జెడ్పీలో పనిచేసే అధికారులు కృష్ణాజిల్లాకు 50శాతం మంది, ఎన్టీఆర్ జిల్లాకు 30 శాతం, ఏలూరు జిల్లాకు 20శాతం మందిని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది.

ఉన్న భవనాలను కూలగొట్టి..

ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో విజయవాడలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్ వద్ద జెడ్పీకి సంబంధించిన గెస్ట్‌హౌస్ ఉండేది. ఈ గెస్ట్‌హౌస్‌ను గతంలో పనిచేసిన జెడ్పీ చైర్మన్‌లు క్యాంప్ కార్యాలయంగా వాడుకునేవారు. దీంతో పాటు జిల్లా పంచాయతీ అధికారి క్యాంప్ కార్యాలయం, పంచాయతీరాజ్ విభాగం డీఈ మిగతా 6లో..

మహిళాగ్రహం



రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు వ్యాఖ్యలను నిరసిస్తూ, జగన్ మీడియా తీరును తప్పుపడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల యువజన, విద్యార్థి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని పంజా సెంటర్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. 6

చెట్ల కింద చల్లగా..



సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యుయల్‌గా మంగళవారం రాత్రి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. నలుమూలల నుంచి ఉదయమే జిల్లా కేంద్రానికి చేరుకున్న ఉపాధ్యాయులు చెట్ల కింద ఇలా చల్లగా సేదతీరారు. 6

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో కదలిక!

మూడేళ్ల నిరీక్షణకు తెర పడింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విజయవాడ - నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేలో కీలకమైన ప్యాకేజీ-3 పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 14 గ్రామాల్లో 30 కిలోమీటర్ల మేర నాలుగు వరసలుగా విస్తరణ చేయనున్న ఈ రోడ్డు పనులకు కాంట్రాక్టు సంస్థ మేఘా తాజాగా శ్రీకారం చుట్టింది. జి.కొండూరు మండలంలో మునగపాడు, గడ్డమణుగులో భూమి చదును పనులు చేస్తోంది.

ప్యాకేజీ-3లో బెజవాడ - ఖమ్మం సెక్షన్‌లో పనులు ప్రారంభం

విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో అంతర్భాగం

- 14 గ్రామాల్లో 30 కిలోమీటర్ల మేర నాలుగు వరసలుగా విస్తరణ
- 270 ఎకరాలకు 243 ఎకరాల్లో భూ సేకరణ పూర్తి!
- త్వరలో మిగిలిన భూముల సేకరణకు అధికారులు చర్యలు



విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా జీ.కొండూరులో పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-3 పనుల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ రూరల్, జి.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని మొత్తం 14 గ్రామాల్లో 30 కిలోమీటర్ల మేర నాలుగు వరసల జాతీయ రహదారి పనులను చేపడుతున్నారు. విజయవాడ రూరల్ మండలంలో జక్కంపూడి, రాయనపాడు, పైడూరుపాడు, జి.కొండూరు మండలంలో పెట్రంపాడు, గంగినేని, తెల్లదేవరపాడు, సున్నంపాడు, మునగపాడు, చెరువు మాధవరం, గడ్డమణుగు, కొండూరు, పినపాక, కవులూరు, గంపలగూడెం మండలంలో తునికిపాడు నుంచి ఖమ్మం జిల్లాలో రెమెడిచర్ల వరకు ఈ పనులు చేయనున్నారు. మూడేళ్ల కిందట చేపట్టిన ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు పట్టాలు ఎక్కింది.

243 ఎకరాల్లో భూ సేకరణ పూర్తి

ఎన్టీఆర్ జిల్లాలోని 14 గ్రామాల పరిధిలో మొత్తం 270 ఎకరాల భూములను సేకరించాల్సి మిగతా 6లో..



గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ సరిహద్దుల దగ్గర ప్రొక్లెయిన్‌తో చేస్తున్న పనులు



ఆనందరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) ఆనందరావు(ఫైల్)

కొడుకుతో కలిసి భర్తను హతమార్చిన భార్య

- తాగొచ్చి హింసించడంతో విసిగిన కుటుంబం
- చెక్క, ఇనుపరాడ్‌తో దాడి.. చాగంటిపాడులో ఘటన

తోట్లవల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై నిత్యం హింసిస్తున్న భర్తను కొడుకుతో కలిసి భార్య హతమార్చిన ఘటన తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు దళితవాడలో సోమవారం రాత్రి జరిగింది. చాగంటిపాడు దళితవాడలో నిమ్మకూరి ఆనందరావు వ్యవసాయ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. భార్య సుపాద స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు వాసంత్ కానూరులోని ఓ ప్రైవేటు వస్త్ర దుకాణంలో పనిచేస్తుండగా, రెండవ కుమారుడు భార్గవ్ విజయవాడలో డిగ్రీ చదువుతున్నాడు. కొడుకులిద్దరు మిగతా 6లో..

ఆయుష్షు తీసిన అతివేగం

ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు

ఇద్దరు కారు మెకానిక్‌లు అక్కడికక్కడే మృతి

- గాయాలతో ఆస్పత్రిపాలైన కారు యజమాని
- మృతుల్లో ఒకరిది విజయవాడ, మరొకరిది ఉత్తరప్రదేశ్
- చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆత్కూరు వద్ద ఘటన
- రిపేరుకు వచ్చిన కారు బాగు చేసి యజమాని ఇంటికి తీసుకెళ్తుండగా ప్రమాదం

ఉంగుటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆత్కూరు ఫ్లైఓవర్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కారు మెకానిక్‌లు అక్కడి కక్కడే మృతి చెందారు. కారు యజమాని గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఆత్కూరు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌కు చెందిన లారీ యజమాని దాసరి ఫణి విక్రమ్ తన కారును రిపేరు చేయించడానికి సోమవారం సాయంత్రం విజయవాడ ఆంధ్ర హాస్పటల్ సమీపంలోని నూతక్కి శ్రీనివాస్(37) అనే మెకానిక్ వద్దకు తీసుకెళ్లాడు. స్నేహితుడైన ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన సర్ఫరాజ్(30) అనే మరో మెకానిక్‌తో కలిసి శ్రీనివాస్ అర్ధరాత్రి వరకు కారు రిపేర్ చేశారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ముగ్గురు కలిసి అదే కారులో విజయవాడ నుంచి హనుమాన్‌జంక్షన్‌లోని కారు యజమాని ఇంటికి బయలుదేరారు. ఆత్కూరు ఫ్లైఓవర్ మీదకు వచ్చేసరికి సిమెంట్ లోడ్‌తో ముందు వెళ్తున్న లారీని అదుపు తప్పి కారు వేగంగా ఢీకొట్టింది. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహమ్మద్ సర్ఫరాజ్, వెనుక సీట్లో కూర్చున్న నూతక్కి శ్రీనివాస్‌ల తలకు బలమైన గాయాలు అవడంతో ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. కారు ముందు సీట్లో ఎడమవైపు కూర్చున్న కారు యజమాని ఫణి విక్రమ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం మిగతా 6లో..



కారులో ఇరుక్కుపోయిన కారు యజమాని ఫణి విక్రమ్, పక్కన, వెనుక సీట్లో విగతజీవులుగా మెకానికల్‌లు సర్ఫరాజ్, శ్రీనివాస్



సర్ఫరాజ్(ఫైల్)



శ్రీనివాస్ (ఫైల్)

వెన్ననపూడి చేపల చెరువు వద్ద రేకుల షెడ్డులో మృతదేహం



కాపలాకొచ్చి కాలిపోయారు

- చేపల చెరువు షెడ్డు వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు మృతి
- బతుకుదెరువు కోసం అసోం నుంచి వచ్చిన కూలీలు

నందివాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల వద్ద కాపలా కోసం ఇచ్చిన ఇద్దరు అసోం వాసులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన నందివాడ మండలం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం... అసోంకు చెందిన జహలాల్ ధోమ్ మరి (36), బీషల్ బాస్ మత్రి (23) నందివాడ మండలం వెన్ననపూడి పంచాయతీ పరిధిలో కిరణ్ రాజు అనే వ్యక్తి చేపల చెరువు మిగతా 6లో..

కృష్ణా తరంగాలపై ప్రపంచ రికార్డు

- 200 వాటర్ క్రాఫ్ట్స్‌పై వెయ్యిమందితో ఫ్లోటింగ్ యోగాకు ఏర్పాట్లు
- ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలి: కలెక్టర్ లక్ష్మీశ

8



యోగా పోటీలకు విశేష స్పందన

6

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఆరుగురు ఎంపిక

త్వరగా భవనాల ఇంటీరియర్ పనులు

- కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఆదేశాలు

6

దేవదాయ శాఖలో బదిలీలు

6

జలక్రీడలకు విశేష ఆదరణ

- శాప్ చైర్మన్ రవినాయుడు

దేవదాయశాఖలో బదిలీలు

వన్‌టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం కాకినాడ జోన్ (జోన్-2) పరిధిలోని పలు దేవాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-1 ఈవోలను బదిలీచేశారు. ఇబ్రహీంపట్నం గుంటుపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయ ఈవో పీవీకే సీతారావమ్మను విజయవాడలోని గుంటూరు సీతారామయ్య అన్నసత్రం ట్రస్ట్‌కు బదిలీ చేశారు. ఎస్.అరుణను మచిలీపట్నం మండలం బోగిరెడ్డిపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయం (ధనుర్మాసం), అదే ఆలయంలో స్పెసిఫిక్ కళ్యాణంకు బదిలీ చేశారు. కంచర్ల సురేష్‌ను విజయవాడలోని బ్రహ్మచారి బావాజీ మఠానికి బదిలీ చేశారు. ఈయనకే నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయం బాధ్యతలను అదనంగా అప్పగించారు. కె.సుపద్మాదేవిని విజయవాడ సత్యనారాయణపురంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి పెనమలూరు మండలం తాడిగడపలో కాళహస్తీశ్వర ఆలయానికి బదిలీ చేశారు. జి.హరిగోపీనాథ్ బాబును నందిగామ మండలం అంబారుపేటలోని సత్యమ్మ ఆలయానికి బదిలీ చేశారు. ఇక గ్రేడ్ -2 ఈవోలకు సంబంధించి మంటాడలోని అలివేలుమంగ పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పనిచేస్తున్న ఆర్.మాధవీలతను మచిలీపట్నం కొజ్జిల్లిపేటలో గల నాగేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావుకు మంటాడలో అలివేలుమంగ పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయ అదనపు బాధ్యతలను అప్పగించారు. జీవీకృష్ణారావును విజయవాడలోని ప్రత్యేక శనైశ్చరస్వామి ఆలయంనుంచి మచిలీపట్నం బచ్చుపేటలో గల వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. ఆయన శనైశ్చరస్వామి ఆలయం బాధ్యతలనూ నిర్వర్తిస్తారు. ఎస్.ఆంజనేయస్వామి బచ్చుపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మచిలీపట్నం రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి బదిలీచేశారు. గూడూరు మండలం, పొట్లేలుగుటపేటలోని మదనగోపాలస్వామి ఆలయం బాధ్యతలను కూడా నిర్వర్తిస్తారు. బి.గంగాధర్‌రావును నందిగామలోని చెన్నకేశవస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల నుంచి విజయవాడ సత్యనారాయణపురంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. వి.డి.డి.ప్రసాద్ విస్సన్నపేట మండలం పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఉయ్యూరులోని గ్రూప్ ఆలయాలకు బదిలీ చేశారు. ఎస్.సన్యాసిరావును విజయవాడ బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోనే కొనసాగిస్తారు. పి.వి.వి. మోహనరావును పుట్టిలుగుపేట మదనగోపాలస్వామి ఆలయం నుంచి రొయ్యూరు గ్రూప్ ఆలయాలకు బదిలీ చేశారు. ఎం.తేజ మైలవరం బొర్రగూడెంలోని తిరుపతమ్మ, గోపయ్య వార్ల దేవస్థానం నుంచి గన్నవరం గ్రూప్ ఆలయాలకు బదిలీ చేశారు. బొర్రగూడెంలోని ఆలయ బాధ్యతలను కూడా కొనసాగిస్తారు. పి.లక్ష్మి ఇబ్రహీంపట్నం గ్రూప్ ఆలయం, గుంటుపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బాధ్యతలను అప్పగించారు.

వ్యవసాయశాఖలో..

మచిలీపట్నం : కృష్ణాజిల్లా వ్యవసాయ, అనుబంధశాఖల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీచేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా ఆత్మ పీడీగా పనిచేస్తున్న విజయకుమారి ఎన్టీఆర్ జిల్లా డీఏవోగా బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.విజయలక్ష్మి గుంటూరుజిల్లా ఉద్యాన, సెరీకల్చర్ అధికారిగా బదిలీ అయ్యారు.

మార్కెటింగ్ శాఖలో..


దివాకర్ రావు, పాపారావు

గొల్లపూడి : ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో డిప్యూటీ డైరెక్టర్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీల బదిలీలు జరిగాయి. విజయవాడ అగ్రికల్చర్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.దివాకర్‌రావును గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖపట్నం నుంచి పి.పాపారావును బదిలీచేశారు. ఏలూరులో పనిచేస్తున్న ఎ.శారదా రాణిని విజయవాడకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం, కరప, కొవ్వూరు, కడప, పెనుగొండ, తణుకు, విశాఖపట్నంలలోని మార్కెటింగ్ కమిటీలకు డిప్యూటీ డైరెక్టర్‌లను సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీలుగా డిప్యూటేషన్‌లపై బదిలీలు చేశారు. దుగ్గిరాల, మచిలీపట్నం, ఏలూరు, నెల్లూరు, గుడివాడ, ఆకువీడు, అనపర్తి, పొన్నూరు, కావలి, కర్నూలు, తెనాలి, చిలుకూరిపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీల కేడర్‌లలో బదిలీలు జరిగాయి.

ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ ద్వారా మంగళవారం రాత్రి బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. జిల్లాలో 2110 సెకండరీ గ్రేడ్ టీచర్ల ఖాళీలున్నాయి. 2953 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8 ఏళ్ల ఒకేసారి సర్వీసు చేసిన ఉపాధ్యాయులు 1432 మంది ఉండగా, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ చేసుకున్న ఉపాధ్యాయులు 1521 మంది ఉన్నారు. కాగా విద్యార్థులు తక్కువగా ఉండటం వల్ల ఇతర పాఠశాలలకు వెళ్లిన వారు 420 మంది ఉన్నారు. ఎస్జీల పదోన్నతుల వల్ల ఏర్పడిన ఖాళీలను కూడా ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు. డీఈవో రామారావు ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంపై ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బాబూరాజేంద్రప్రసాద్, ఏపీటీఎఫ్ హర్షం వ్యక్తం చేశారు.

మాపై చర్యలు తీసుకోకుండా ఆపండి!

- నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంపై హైకోర్టులో పేర్ని కృష్ణమూర్తి పిటిషన్

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోలీసు అధికారులు తమపై చర్యలు తీసుకోకుండా నిలువరించాలని, ఆ మేరకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ నేత పేర్ని నాని తనయుడు పేర్ని కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికల సందర్భంగా కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారంటూ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తమపై కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సరైన విచారణ లేకుండా, వాదన చెప్పుకొనేందుకు అవకాశం ఇవ్వకుండా తమపై అక్రమ కేసులు పెట్టే ప్రయత్నం సాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులను నిలువరించాలని వ్యాజ్యంలో కోరారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, కృష్ణా జిల్లా ఎస్పీ, కలెక్టర్, మచిలీపట్నం డీఎస్పీ, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, తహసీల్దార్లను ప్రతివాదులుగా చేర్చారు.

అనుచిత వ్యాఖ్యలు.. ఆరని మంటలు!

- రాజధాని మహిళలను కించపరిచిన జగన్ మీడియాను ప్రభుత్వం రద్దు చేయాలి
- పలుచోట్ల పత్రికా ప్రతుల దహనం
- మహిళా సంఘాలు, కూటమి నేతల నిరసనల హోరు



మచిలీపట్నం టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరిచేలా కథనాలు ప్రచురించిన జగన్ మీడియాను ప్రభుత్వం రద్దు చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం నియోజకవర్గ తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ, ఎస్.వసంతకుమారి, నారగాని వాణి, వేమూరి


మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లో జగన్ పత్రికలను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

శ్రీదేవి, ముక్కు రంగమణి, నడకుదిటి మహాలక్ష్మి, పెదశింగు కోమలి, బలగం కృష్ణకుమారి, వల్లభు లక్ష్మి, వాలిశెట్టి హైమావతి, పడవల నాగలక్ష్మి, లతీపున్నీసా, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ మాట్లాడుతూ.. అమరావతి రాజధానిపై చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు.

జగన్, భారతిలు క్షమాపణ చెప్పాలి

\- ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్ సింగ్‌నగర్ : రాజధాని మహిళలకు జగన్, భారతీ రెడ్డిలు బహిరంగ క్షమాపణలు చెప్పాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ పార్టీ కార్యాలయం


అజిత్‌సింగ్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు

నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు కొవ్వొత్తుల ర్యాలీ మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, అమరావతి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జగన్ చానెల్‌లో జుగుప్సాకరంగా మాట్లాడారని మండిపడ్డారు. సాటి మహిళగా వైఎస్.భారతి నిస్సిగ్గుగా తన చానెల్‌లో మహిళలను కించపరిచే ప్రసారానికి అనుమతివ్వడం సిగ్గుచేటన్నారు. అనంతరం జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ టీడీపీ మహిళా నేతలు దాసరి ఉదయశ్రీ, లబ్బా దుర్గ, పైడి తులసి, సత్య, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిపై నిరంతరం కుట్రలు..

నందిగామ : అమరావతి రాజధానిపై నిరంతరం కుట్రలు చేస్తున్న జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు లేకుండా ప్రవర్తిస్తున్నాడని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులతో పాటు వారిని వెనుక ఉండి నడిపిస్తున్న జగన్, భారతీ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిల దిష్టిబొమ్మలను మంగళవారం స్థానిక గాంధీ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజధానిపై విధ్వంసానికి పాల్పడుతున్న జగన్ కొత్తగా మహిళలను అవమానించే కుట్రకు తెరలేపాడన్నారు. మహిళల పట్ల


నందిగామలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

గౌరవం లేని జగన్ బృందాన్ని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యలగాని నూకానమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

వన్‌టౌన్ : జగన్ రెడ్డి, భారతి రెడ్డి మెప్పుకోసం అమరావతి రాజధాని నిర్మాణ పనులు అడ్డుకునేందుకు, విషం చిమ్మే కుట్రలో భాగంగా జగన్ మీడియాలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని టీడీపీ నేతలు హెచ్చరించారు. మంగళవారం కొత్తపేట గణపతిరావు రోడ్డులోని వెస్ట్ టీడీపీ కార్యాలయం నుంచి చిట్టినగర్ సెంటర్ వరకు పశ్చిమ నియోజకవర్గం మహిళా, యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ,


చిట్టినగర్‌లో నిరసన ర్యాలీ

అమరావతి మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, భారతిరెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిట్టినగర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి ఉషారాణి, షేక్ ఆషా, రావి సౌజన్య, కర్రి నాగలక్ష్మి, సుకాసి సరిత, ఆర్.మాధవ్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రతిష్టకే అవమానం

పెనమలూరు : రాజధాని మహిళలపై చేస్తున్న విషప్రచారాలు రాష్ట్ర ప్రతిష్టకే అవమానమని టీడీపీ కూటమి మహిళా నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయం నుంచి పోరంకి ప్రధాన కూడలి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, మేడసాని రత్నకుమారి, మల్లంపాటి విజయలక్ష్మిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జగన్ మీడియా నుంచి రాష్ట్ర మహిళలను కాపాడాలని, ఆ మీడియాను రద్దుచేసి రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి మహిళానేతలు పాల్గొన్నారు.


పోరంకిలో మహిళల ర్యాలీ..

గన్నవరంలో..

గన్నవరం : రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలను ఖండిస్తూ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి మహిళా నేతలు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాజకీయ, మీడియా ముసుగులో వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి


గన్నవరంలో జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న మహిళా నేతలు

మాట్లాడుతూ, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్ (సూర్యం), గూడవల్లి నరసింహారావు (నరసయ్య), పొదిలి లలిత, మేడేపల్లి రమ, కంభంపాటి లక్ష్మీ నరసమ్మ, నెక్కంటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోండి

కంకిపాడు : రాజధాని మహిళలను దుర్భాషలాడుతూ మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించాలని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. రాజధాని మహిళపై జగన్ మీడియాలో వచ్చిన కథనాలు సిగ్గు చేటన్నారు. కొమ్మినేని, కృష్ణరాజులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో కదలిక!

(5వ పేజీ తరువాయి)

ఉండగా 243 ఎకరాల వరకు సేకరించినట్టు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. మరో 30 ఎకరాలు జి.కొండూరు మండలంలో ప్రైవేటు భూములు సేకరించాల్సి ఉందని పేర్కొన్నాయి. ఇప్పటి వరకు సేకరించిన భూముల ప్రకారం 70 శాతం మేర భూ యజమానులకు చెల్లింపులు కూడా పూర్తి చేసినట్టు సమాచారం. ఎన్టీఆర్ జిల్లాకు గత ఆరు నెలలుగా జాయింట్ కలెక్టర్ లేరు. గతంలో పనిచేసిన నిధి మీనా మెటర్నిటీ లీవ్‌పై వెళ్లటంతో రెవెన్యూలో అనేక పనులు పెండింగ్ పడ్డాయి. ప్రస్తుతం కొత్త జేసీగా ఇలక్కియాను ప్రభుత్వం నియమించటంతో ఇప్పుడిప్పుడే పెండింగ్ పనులన్నీ కొలిక్కి వస్తున్నాయి. మరో నెల రోజుల్లో విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి పెండింగ్ భూముల సేకరణ ప్రక్రియ కూడా పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులకు 86 శాతం మేర భూములను అప్పగించటం జరిగింది. మరో 14 శాతం భూములు కూడా అప్పగిస్తే. పనులు ఒక క్రమపద్ధతిలో జరిగే అవకాశం ఉంటుంది.

జీ కొండూరు మండలంలో పనులు చేపట్టిన 'మేఘా'

జాతీయ రహదారికి జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసిన భూముల్లో జి.కొండూరులో మునగపాడు, గడ్డమణుగు ప్రాంతాల్లో కాంట్రాక్టు సంస్థ మేఘా రంగంలోకి దిగింది. ఈ ప్రాంతాల్లోని భూములను చదును చేయటంతో పాటు, రెండు వైపులా కందకాల పనులను చేపట్టింది. జి.కొండూరు నుంచి జక్కంపూడి వరకు ఒక వైపు, తునికిపాడు వరకు రెండో వైపున సమాంతరంగా భూమి పనులు చేయనుంది.

విజయవాడ - నాగ్‌పూర్ ఎకనమిక్ కారిడార్‌లో అంతర్భాగం

దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆర్థిక కారిడార్లలో విజయవాడ - నాగ్‌పూర్ కారిడార్ ఒకటి. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఈ కారిడార్ కలుపుతుంది. మహారాష్ట్రలో నాగ్‌పూర్‌లో ప్రారంభమై తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో జక్కంపూడి దగ్గర ముగుస్తుంది. మొత్తం 405 కిలోమీటర్ల పొడవున ఈ కారిడార్ ఉంటుంది. సరకు రవాణా కోసం ఈ ప్రత్యేక ఎకనమిక్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఈ కారిడార్‌ను రూ.14,666 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. నాలుగు లేన్లతో ఈ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. 2027 నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం లక్ష్యం.

జెడ్పీ విభజన సంగతేంటి..?

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం, విజిలెన్స్ విభాగం డీఈ కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన ఈఈ కార్యాలయం ఇక్కడ కొనసాగేవి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి ఈ కార్యాలయంలో కొంత భాగాన్ని తన కార్యాలయంగా వాడుకున్నారు. మూడేళ్ల క్రితం ఈ భవనాన్ని బహుళ అంతస్తుల భవనంగా నిర్మాణం చేసే పేరుతో కూలగొట్టేశారు. ఆ తర్వాత ఈ భవనం స్థలాన్ని ఒక పారిశ్రామికవేత్తకు లీజుకు ఇచ్చేశారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందనే అంశంపై గుసగుసలు వినిపించాయి. అయితే కూలగొట్టిన భవనం స్థానంలో ఇప్పటివరకు ఎలాంటి కట్టడాలను ప్రారంభించలేదు.

ఇప్పటికైనా భవనాల నిర్మాణంపై దృష్టి సారిస్తారా!

జెడ్పీ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది సెప్టెంబరుతో ముగియ నుంది. ఈ నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు అధికారులు, ఉద్యోగులను సర్దుబాటు చేయాల్సి ఉంది. కార్యాలయాల భవనాలు, సమావేశపు మందిరాలు, అధికారులకు సంబంధించిన గృహాలు, గెస్ట్‌హౌస్‌లు నిర్మాణం చేయాల్సి ఉంది. కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నంలో జెడ్పీ ప్రాంగణంలో పాత సమావేశపు హాలు, కార్యాలయ భవనాలు ఉన్నాయి. జెడ్పీ సీఈవో భవనాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి కేటాయించారు. ఏలూరు జిల్లాలోని ఎనిమిది మండలాలు ఆ జిల్లాకు వెళ్లిపోతాయి. జెడ్పీ విడిపోతే ఎన్టీఆర్ జిల్లాలో సమాశపుహాలు, కార్యాలయం నిర్వహణ కోసం భవనాలు సమకూర్చుకోవాల్సి ఉంది.

కొడుకుతో కలిసి భర్తను హతమార్చిన భార్య

(5వ పేజీ తరువాయి)

దూరాన ఉండటంతో తండ్రి ఆనందరావు మద్యం తాగివచ్చి భార్య సుపాదను హింసిస్తుండేవాడు. అలాగే భార్యపై అనుమానం వ్యక్తం చేస్తు కొడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆనందరావు సోమవారం విపరీతంగా మద్యం తాగి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి డ్యూటీలో ఉన్న భార్యను అసభ్యపదజాలంతో దూషించి రభస సృష్టించాడు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా భార్యను హింసించాడు. దీంతో భర్త పెట్టే హింసను భరించలేక విజయవాడలో ఉన్న కొడుకులిద్దరికి విషయం చెప్పింది. కొడుకులిద్దరు వెంటనే సోమవారం రాత్రి 11 గంటలకు విజయవాడ నుంచి చాగంటిపాడు ఇంటికి వచ్చారు. ఆ సమయంలో తండ్రి ఆనందరావు మత్తులో నిద్రిస్తుండగా కొడుకులు లేపి తల్లిని ఎందుకు హింసిస్తున్నావని ప్రశ్నించారు. దీంతో ఆనందరావు కోపంతో ఓ ఇనుపరాడ్‌ను తీసుకుని పెద్ద కొడుకు చేతిపై కొట్టాడు. గాయం కావటంతో రెచ్చిపోయిన కొడుకు వాసంత్ ఇంటి పాత గుమ్మం చెక్క తీసుకుని తండ్రిపై దాడి చేయగా తలకు బలంగా దెబ్బ తగిలి పడిపోయాడు. దాంతో తండ్రి చేతిలోని ఇనుపరాడ్ కిందపడగా ఆ రాడ్ తీసుకుని తండ్రి తలపై విచక్షణారహితంగా కొట్టటంతో తీవ్ర రక్తస్రావంతో ఇంటి ఆవరణలోనే కుప్పకూలి చనిపోయాడు. భర్తను కొట్టేందుకు భార్య సుపాద కూడా సహకరించింది.

కొడుకును కాపాడే ప్రయత్నం విఫలం

హత్యానంతరం పెద్ద కొడుకు వాసంత్ ఒంటిపై రక్తపు మరకలైన చొక్కాను విప్పి బక్కెట్లో జాడించి వేరే చొక్కా వేసుకుని ఏమి తెలియనట్టు నటించాడు. తర్వాత గ్రామంలోని ఓ వ్యక్తి 112కి కాల్‌చేసి ఆనందరావు హత్య విషయాన్ని తెలియజేయగా మంగళవారం ఉదయం సీఐ వై చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ చాగంటిపాడు వచ్చి ఆనందరావు మృతదేహాన్ని పరిశీలించారు. విజయవాడ నుంచి క్లూస్‌టీంను కూడా రప్పించారు. తన భర్త మద్యం తాగి హింసిస్తుంటే చెక్కతో తలపై కొట్టి తానే చంపానని భార్య సుపాద సీఐకి చెప్పింది. తలపై లోతైన గాయాలను పరిశీలించిన సీఐ ఇంత పెద్దగాయాలు అయ్యే విధంగా కొట్టటం మహిళ వల్ల కాదని గ్రహించి ప్రశ్నించటంతో పెద్ద కొడుకు వాసంత్ కొట్టి చంపినట్టు బయటపెట్టింది. హతుని తల్లి వెంకటేశ్వరమ్మ నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. హతుని భార్య సుపాద, పెద్ద కొడుకు వాసంత్‌పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, సీఐ చిట్టిబాబుతో కలిసి చాగంటిపాడు ఆనందరావు హత్యకు గురైన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

గ్రాండ్‌గా..

(5వ పేజీ తరువాయి)

ఒక ప్లాట్‌ఫామ్‌లాగా చేస్తారు. ఇలా ప్లాట్‌ఫామ్ చేయటం వల్ల సందర్శకులు గతంలో మాదిరిగా టవర్ దగ్గర తిరుగాడటానికి అవకాశం కలుగుతుంది. కాంక్రీట్‌తో ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసిన తర్వాత ఐకాన్ టవర్ చుట్టూ పర్యాటకులను ఆకర్షించేలా ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయనున్నారు.

● ఐకానిక్ టవర్‌కు భారీ వర్షాలు కురిసినా కూడా రంగు వెలసిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. భవానీ ద్వీపం ఐకానిక్ టవర్‌ను ద్వీపానికే ప్రత్యేక ఆకర్షణగా నిలపాలని భావిస్తున్నారు. దశలవారీగా పైచిత్రంలో మాదిరిగా భవానీ ద్వీపం కొత్త రూపాన్ని సంతరించుకోనుంది.

కాపలాకొచ్చి..

(5వ పేజీ తరువాయి)

వద్ద కొన్నాళ్లుగా కాపలా ఉంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున వీరు ఉండే రేకుల షెడ్డులో నుంచి పొగ రావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా, ఒకరు పూర్తిగా, మరో వ్యక్తి సగం వరకు కాలిపోయినట్టు గుర్తించారు. మృతుల్లో ఒకరికి బీడీ కాల్చే అలవాటు ఉండటంతో బీడీ కాల్చి ఆర్పకుండా ఆ గదిలో పడవేయటంతో అది చేపల మందులకు అంటుకుని అగ్నిప్రమాదం జరిగి ఉంటుందా లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి ఉంటుందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతులకు భార్య, పిల్లలు ఉన్నారు.

ఆయుష్షు తీసిన అతివేగం

(5వ పేజీ తరువాయి)

అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కారు డోర్లు తెరచి గాయాలపాలైన ఫణి విక్రమ్‌ను బయటకు తీసి చినవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న రెండు మృతదేహాలను కూడా బయటకు తీసి గన్నవరం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా, మృతుడు శ్రీనివాస్‌కు వివాహమై భార్య, కుమారుడు ఉండగా, సర్ఫరాజ్‌కు ఇంకా వివాహం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వేంకటేశ్వర స్వామి ఆలయం, స్వయంభు వేంకటేశ్వర స్వామి

- ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం కుదప వేంకటేశ్వర స్వామి ఆలయం
- ప్రత్యేక ఆకర్షణగా 50 అడుగుల ఆంజనేయుడు
- సరస్వతీ ఆలయంలో అక్షరాలు
- ప్రతి శనివారం అన్నదానం

కోరిన కోర్కెలు తీర్చే.. కుదప వెంకన్న

(ఆంధ్రజ్యోతి, రెడ్డిగూడెం)

వందేళ్ల క్రితం స్వయంభువుగా వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం కుదప.. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా దిన దిన ప్రవర్ధమానం చెందుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతుందీ క్షేత్రం. భక్తుల విశేష ఆదరణ చూరగొంటున్న కుదపను జిల్లాయంత్రాంగం టెంపుల్ టూరిజం సర్క్యూట్ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 1957 సంవత్సరంలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి నామాలు, ఎడమ పాదం గట్టుపై వెలిశాయి. నాటినుంచి పూజలు చేస్తూండే వారని, ఆ తర్వాత కొంత కాలానికి ఐదేళ్ల బాలుడి ఒంటి మీదకు స్వామివారు వచ్చి ఇక్కడ గుడి కట్టాలని చెప్పగా గ్రామస్థులు ఒక పందిరి ఏర్పాటు చేసి పూజాది కార్యక్రమాలు మొదలు పెట్టారు. భక్తులకు నీటి ఇబ్బందిని గమనించి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి అనే భక్తుడు ఇక్కడ రాతి కట్టడంతో బావిని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్థులు దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. స్వామివారికి ఇరువైపులా గోదాదేవి, పద్మావతి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కొండపైన క్షేత్ర పాలకుడు గంగా కాత్యాయిని సమేతుడై త్రిశూలేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రికి కల్యాణం, అభిషేకాలు కార్తీక మాసం పూజలు నిర్వహిస్తారు.

50 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం కొండపైన ప్రత్యేకం. సరస్వతీ



దేవి ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కొండ దిగువన రావి చెట్టు కింద సంతాన నాగేంద్రస్వామి, వినాయకుడు, గోవర్ధన కృష్ణాలయాలను నిర్మించారు. తిరుమల తిరుపతి దేవస్థానంకు వెళ్లలేని భక్తులు ఇక్కడకు వచ్చి మొక్కులు తీర్చుకొని తలనీలాలు సమర్పించుకుంటారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, కంభంపాడు, గంపలగూడెం, రెడ్డిగూడెంలతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ప్రతి శనివారం కాలినడకన ఆలయానికి చేరుకుంటారు. కొండ కింద మండపంలో భక్తులు పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. శనివారాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

కోరిన కోర్కెలు తీర్చే స్వామి



మురళి కృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు

స్వయంభుగా వెలసిన వేంకటేశ్వరస్వామి మహిమలు అనేకం. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామికి ఎక్కడెక్కడి నుంచో భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతీఏడాది వైశాఖ పౌర్ణమి నాడు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున భక్తులకు ఉత్తర ద్వార దర్శనం చేయిస్తాం.

ప్రతి శనివారం 1,500 మందికి అన్నదానం

ఆలయ కమిటీ సభ్యులు రాయల రాంబాబు

దాతలు, గ్రామస్థుల సహకారంతో ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి శనివారం 1,500 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నాం. ఏడాది ముందే దాతలు పేర్లను ఆలయంలో నమోదు చేయించుకోవాలి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116,125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక ఉపకేంద్రం, 11కేవీ గీతానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. తారకరామా నగర్, భూపేష్ గుప్తానగర్, చలసానినగర్, రాణిగారితోట, బాలాజీనగర్, గీతానగర్ కట్ట, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సబ్‌వేల నిర్మాణంతో
ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం
ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



సీఐ నాగరాజు, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వన్‌టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారి సత్యంగారి హోటల్, నేతాజీ సుభాస్ చంద్రబోస్ బ్రిడ్జిల వద్ద సబ్‌వేల నిర్మాణం చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి కృష్ణలంక సీఐ నాగరాజుతో ఆయన చాంబర్‌లో సమావేశమై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ కృష్ణలంక ప్రజలు జాతీయ రహదారి దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీని వలన ప్రజలు చాలా భయపడుతున్నారని చెప్పారు. సత్యంగారి హోటల్, రైతు బజార్ వద్ద బారికేడ్లు మూసివేయటం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాణిగారితోట, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహంవద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ మరమ్మతులు చేసి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సత్యంగారి హోటల్ వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు డ్రమ్ములను ఏర్పాటు చేసి, వాటికి రేడియం స్టిక్కర్లను అంటించాలని సూచించారు. రైతుబజార్ వద్ద ఉన్న బారికేడ్లను రాత్రి 9 గంటలకు మూసివేసి ఉదయం 6 గంటలకు తెరిచేలా చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జి.నాగేశ్వరరావు, వి.రంగారావు, కె.భావన్నారాయణ, కె.అప్పన్న, పి.అన్నారావు, కె.కిరణ్, టి.శ్రీను, పాల్గొన్నారు.



కృష్ణలంక రైతుబజార్ వంతెన మార్గం



అమెరికన్ హాస్పటల్ వంతెన మార్గం



వైవీ రావు హాస్పటల్ చివర నిర్మించాల్సిన వంతెన ప్రాంతం



సత్యం హోటల్ సెంటర్ కూడలి

కృష్ణలంకవాసుల కష్టాలు

● అండర్‌పాస్‌లు లేక ఇబ్బందులు ● నగరంలోకి రావాలంటే ఒకటే మార్గం

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల ప్రజలు నగరంలోకి రావడానికి పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఈ ప్రాంతంలో దాదాపు 50వేల మందికి పైగా ఉన్న ప్రజలు నగరంలోకి రావా లంటే 21వ డివిజన్‌లో ఉన్న ఒకే ఒక మార్గం పాతఫైర్‌స్టేషన్ వద్ద ఉన్న అండర్‌బైపాస్ మాత్రమే. దీంతో భ్రమరాంబపురం నుంచి బాలాజీనగర్ వరకు ఉన్న నివాసితులు సుర క్షితంగా నగరంలోకి వచ్చేందుకు ఈ మార్గాన్నే వాడుతున్నారు. దీంతో విపరీతమైన వాహనాల రద్దీ ఏర్పడుతోంది. సత్యం హోటల్ వద్ద జాతీయ రహదారిపై ఇటీవల ప్రమాదాలు నిత్యకృత్యం కావడంతో అక్కడ రాకపోకలు జరగకుండా బారికేడ్లు అడ్డుపెట్టడంతో మరింత సమస్యగా మారింది.

మరిన్ని అండర్ పాస్‌లు అవసరం

కృష్ణలంక, రాణిగారితో, బాలాజీనగర్ ప్రాంత ప్రజల సమస్య తీరాలంటే మరిన్ని అండర్ పాస్‌లు అవసరం ఉంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా భ్రమరాంబపురం నుంచి బాలాజీ నగర్ వరకు ప్రస్తుతం ఉన్న వంతెనల వద్ద అండర్ పాస్‌లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం పాత ఫైర్‌స్టేషన్ వద్ద ఉన్న అండర్ పాస్ మాదిరి కృష్ణలంక రైతుబజార్ వంతెన, అమెరికన్ హాస్పటల్ వంతెన, పశువుల హాస్పటల్ వంతెన వద్ద అండర్ పాస్‌లు నిర్మిస్తే ఈ ప్రాంతవాసులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ మూడు అండర్ పాస్‌లతో పాటు ఎప్పటి నుంచో ప్రతిపాదనల వద్ద ఆగిన వైవీ రావు హాస్పటల్ రోడ్డు చివర బందరు కాల్వపై వంతెన నిర్మాణం కూడా పూర్తిచేసి అండర్ పాస్ నిర్మిస్తే న్యూబ్రిడ్జి నుంచి బస్టాండ్ వరకు ఉన్న కృష్ణలంక ప్రాంతవాసుల ఇబ్బందులు తొలగిపోతాయి.

జాతీయ రహదారి అంటేనే...

కృష్ణలంక ప్రాంత నివాసితులు జాతీయ రహదారి అంటేనే అమ్మో అంటున్నారు. తప్పని పరిస్థితుల్లో రాణిగారితోట ప్రాంతనివాసితులు వారధి నుంచి బందర్ రోడ్డు వైపు, భ్రమరాంబ పురం వాసులు బస్టాండ్, సత్యం హోటల్ సెంటర్ నుంచి, బాలాజీనగర్ వాసులు న్యూ బ్రిడ్జి నుంచి బందర్ రోడ్డు వైపు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రాణాలు పోతున్నాయి



జాతీయ రహదారిపై ప్రయాణాలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కృష్ణలంక ప్రాంతంలో అధికంగా ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలు తప్పనిసరిగా ఉద్యోగాలు, కూలి పనులు ఇతర అవసరాల కోసం నగరంలోకి వెళతారు. ప్రభుత్వం స్పందించి అండర్ పాస్‌లు వెంటనే నిర్మించాలి.
- ఎన్.హరినారాయణ, సీపీఎం నాయకుడు

సమన్వయంతో మెరుగైన సేవలు అందించాలి
జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి జూపూడి ఉషారాణి



మాట్లాడుతున్న డాక్టర్ జూపూడి ఉషారాణి

బెంజిసర్కిల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హెచ్‌ఐవీ, ఎయిడ్స్, క్షయ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. మంగళవారం బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో జిల్లాలోని హెచ్‌ఐవీ, ఎయిడ్స్, క్షయ విభాగాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాకో, ఏపీశాక్స్ ఆదేశాల మేరకు ఉద్యోగులు పని చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్, వాసవ్య మహిళా మండలి, షేర్ ఇండియా, వీహెచ్‌ఎస్, విహాన్, రైడ్స్, ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్ కౌన్సి లర్లు, డాటా మేనేజర్లు, షేర్ ఇండియా జాన్ వెస్లీ, కృష్ణమూర్తి, క్షయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో అన్న క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలి
● మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అన్న క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. మంగళవారం ఆయన పటమట అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అన్ని అన్న క్యాంటీన్లలో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. తాగునీరు, వాడుకునే నీరు అందుబాటులో ఉండేలా అవి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రెయినేజీ పూడిక పనులు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కనకదుర్గానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. మహానాడురోడ్డు, పంట కాల్వ రోడ్డులో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సత్యనారాయణ, సామ్రాజ్యం, సూర్యకుమార్ పాల్గొన్నారు.

ఇస్త్రం డానియేలుకు ఘన నివాళి



రాణిగారితోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 17వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో ఇస్త్రం డానియేలు జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 17, 18 డివిజన్ల అధ్యక్షులు రాయి రంగమ్మ, వేముల దుర్గారావు, అమీనా, పగడాల వెంకటేశ్వరరెడ్డి, సునాబి, దానియేలు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ప్రతిపాదనలపై శాఖాధిపతులతో కమిషనర్ సమీక్ష

కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రానున్న సాధారణ సర్వసభ్య సమావేశంలోని అజెండా విషయాలపై నగర కమిషనర్ ధ్యానచంద్ర శాఖాధిపతులతో చర్చించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కమిషనర్ ధ్యానచంద్ర శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రజాప్రతినిధులు పొందుపరిచిన సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండాలో క్షుణ్ణంగా పరిశీలించి, వాటిపై ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, తీసుకోవాల్సిన చర్యలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేటర్ జాస్తి సాంబశివరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

జాస్తి సాంబశివరావుకు టీడీపీ నేతల పరామర్శ

భారతీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావును మంగళవారం టీడీపీ నేతలు పరామర్శించారు. ఆయన తల్లి జాస్తి స్వరాజ్యం సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ అలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, కార్పొరేటర్లు చెన్నుపాటి గాంధీ, దేవినేని అపర్ణ, పలువురు నేతలు మంగళవారం కార్పొరేటర్ జాస్తి సాంబశివరావును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అనంతరం గాయత్రి నగర్ నుంచి నిర్వహించిన అంతిమ యాత్రలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సినీ నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు

పటమట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం పటమట ఎన్టీఆర్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ సన్నిహితుడు బొర్రా గాంధీ తనయుడు బొర్రా దినేష్ ఆధ్వర్యంలో అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు, దినేష్ యూత్ సభ్యులు భారీగా పాల్గొన్నారు. ● పటమట లైబ్రరీ సెంటర్లో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. **భారతీనగర్:** 15వ డివిజన్‌లోని పడవల రేవు సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు కుర్రా కృష్ణ కాంత్(నాని) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు.



ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న దినేష్

ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ...

వన్‌టౌన్: నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు, తెలుగు యువత విద్యార్థులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, తెలుగు యువత విద్యార్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో మూడు వేల డిజిటల్ ప్రీస్కూల్స్
● గ్రామీణ మహిళలకు ఉపాధి

గాంధీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏఐపీఎస్ఏ) అండ్ గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రీస్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్టు ఏఐపీఎస్ఏ డైరెక్టర్ ఆగస్టీన్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు కీలకమైన ప్రీ ప్రైమరీ విద్యను శాటిలైట్ ద్వారా డిజిటల్ టెక్నాలజీ సాయంతో స్థానిక మహిళలు అందిస్తారన్నారు. అందుకు అవసరమైన శిక్షణ మహిళలకు అందిస్తామన్నారు. గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సోమశేఖర్ మాట్లాడుతూ మహిళా స్వయం ఉపాధి పథకంలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రీస్కూల్స్‌ను ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రతీ స్కూల్‌కు మూడు లక్షల ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. నర్సరీ నుంచి ఒకటవ తరగతి వరకు పిల్లలకు డిజిటల్ విద్యా బోధన అందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు 70124 03800 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



సర్టిఫికెట్‌ల పంపిణీ

మొగల్రాజపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన వారికి జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ. పూర్ణిమ మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మొగల్రాజపురంలోని జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం అధికారి డి. కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా రిసోర్స్ పర్సన్ కే. ఉమామహేశ్వరరి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని ఆటో కార్మికుల వినూత్న నిరసన



నిరసనలో పాల్గొన్న ఆటో కార్మికులు

ధర్నాచౌక్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం తమకిచ్చిన హామీలను అమలు చేయాలని ఆటోకార్మికులు డిమాండ్ చేశారు. ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆటో కార్మికులు వినూత్నరీతిలో తమ నిరసన తెలిపారు. ఉరితాళ్లను మెడలో వేసుకుని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల బ్యానర్లను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గింపు హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం నేతలు సీహెచ్ పెద్దిరాజు, ముని శంకర్, శ్రీధర్‌బాబు, యాదగిరి, వలి, సూరిబాబు, అప్పారావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల కోసం పడిగాపులు

పాత ప్రభుత్వాసుపత్రిలో రక్తపరీక్ష, స్కానింగ్‌కు గంటల తరబడి నిరీక్షణ ● సిబ్బంది నిర్లక్ష్యం ● గర్భిణుల అవస్థలు



విజయవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు టెస్ట్‌ల కోసం వెళితే బిడ్డను చేతిలో పెట్టినట్టుంది ప్రభుత్వ జనరల్ ప్రసూతి ఆసుపత్రి పరిస్థితి. కడుపులో బిడ్డ ఎదుగుదల ఎలా ఉందో తెలుసుకోవడానికి స్కానింగ్, ఇతర పరీక్షలకు ప్రభుత్వాసుపత్రికి వెళుతున్న గర్భిణులకు నిరీక్షణ తప్పడం లేదు. గర్భిణులంటేనే ఎన్నో టెస్టులు, మందులు, పోషకాహారం వంటి జాగ్రత్తతో అధిక ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖర్చులు భరించలేక ఎక్కువ మంది ప్రజలు ప్రభుత్వాసుపత్రికి వస్తారు. వైద్యం, మందులు, పరీక్షల విషయంలో ఢోకా లేదు కానీ సమయం విషయానికొస్తేనే గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఓపీ నుంచి ప్రతి టెస్టుకు గంటల తరబడి వేచి ఉండాలి. సామాన్య రోగులే అంత సమయం ఉండాలంటే ఇబ్బంది పడతారు. అలాంటిది గర్భిణులు ఎక్కువ సమయం నిలబడి ఉండగలరా..? దీనికి తోడు పరీక్షలు వచ్చినప్పుడు ఎక్కువ సమయం ఆసుపత్రిలో ఉండడంతో సమయానికి భోజనం చేయక, మందులు వేసుకోలేకపోతున్నామని గర్భిణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి వారిని ఆసుపత్రుల్లోనే ఉంచితే ఎలా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గర్భిణులతో ఆసుపత్రికి వచ్చేవారి కోసం కనీసం చెప్పుల స్టాండు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వార్డుల బయటే చెప్పులు కుప్పలుగా కనిపిస్తున్నాయి. బాలింతలు, చిన్నపిల్లలుండే వార్డుల వద్ద ఇంత రోతగా ఉంటే నవజాతి శిశువులు ఇన్‌ఫెక్షన్ బారిన పడే ప్రమాదముందని బాలింతలు వాపోతున్నారు. కొన్నిసార్లు ఓపీ తొందరగా ఇచ్చినా రక్తపరీక్ష, స్కానింగ్ వద్ద గంటల తరబడి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. సహాయంగా వచ్చిన కుటుంబీకులు క్యూలో నిల్చుంటున్నారని, సమయానికి భోజనం, మందులు తీసుకోలేకపోతున్నామని చెప్పుకొచ్చారు. భోజనం కోసం మొదటి అంతస్తులో జూట వారిని కూడా కిందకి రమ్మనడంతో కిందనున్న వారు, పై నుంచి వచ్చిన వారితో భోజనం ఇచ్చే దగ్గర జనం బారులు తీరి ఉన్నారు. కిందకి పైకి తిరగడానికి ఇబ్బంది పడుతున్నామని గర్భిణులు, బాలింతల బంధువులు వాపోతున్నారు. లిఫ్టు ఉన్నా భోజనాన్ని పైకి తేవడానికి అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాలింతల బాధలు

శిశువు జన్మించాక బాలింతల పరిస్థితిని బట్టి ఆసుపత్రిలో ఎన్ని రోజులు ఉంచాలో వైద్యులే సూచిస్తారు. సాధారణ డెలివరీ అయితే ఫర్వాలేదు కానీ ఆపరేషన్ అయిన వారికి మాత్రం ఇబ్బందులు ఏర్పడతాయి. కుట్లు వికటించడం, విప్పే సమయంలో చీము పట్టడం జరుగుతుంది. అలాంటి వారు వైద్యులకు తమ సమస్యల గురించి వివరిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొంతమంది బాలింతలు ఆవేదన వ్యక్తం చేశారు.

కుట్లు ఊడిపోయాయి, మధ్యలో వదిలేశారు: ఇమేలి

90 రోజులుగా ఇక్కడే ఉన్నా. ఆపరేషన్ సమయంలో వేసిన కుట్లు ఊడిపోయాయి. రెండువైపులా చెరో రెండు కుట్లు వేశారు, మధ్యలో రెండు కుట్లు పడతాయి మళ్లీ వేస్తామని, ఇంటికెళ్లి రెండు రోజుల్లో రమ్మని చెప్పారు. వాళ్లు చెప్పినట్టు వచ్చినా ఇప్పటికీ కుట్లు వేయలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. సిబ్బందిని అడిగినా సమాధానం చెప్పడం లేదు. ప్రశ్నిస్తే కుట్లు వేస్తాం, తొందరపడితే కుదరదంటున్నారు.

సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు.. ఎస్ రవి, బాలింత భర్త

నాకు, నా భార్యకు ఎవరూ లేరు. అన్నీ నేనే చూసుకోవాలి. బయట వాళ్లను డబ్బులిచ్చి తెచ్చుకున్నా ఒకరోజే వస్తున్నారు. భోజనం, ఇతరత్రా ఆహార పదార్థాలు తీసుకెళ్లడానికి అనుమతించడం లేదు. విజిటింగ్ సమయంలో వెళ్లినా సమయం కంటేముందే పంపిచేస్తున్నారు. అదేమంటే దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కోసారి ఉడకని అన్నం ఇస్తున్నారు. కొన్నిసార్లు టిఫిన్ అందడం లేదు.

ఆర్‌పీఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

రామిశెట్టి గుండెపోటుతో మృతి



కృష్ణలంక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామిశెట్టి రమేష్‌కుమార్ (45) గుండెపోటుతో మృతిచెందారు. కృష్ణలంక ప్రాంతానికి చెందిన ఆయన సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. పార్టీ నిర్ణయం మేరకు పార్థీవదేహాన్ని కృష్ణలంక 22వ డివిజన్‌లోని సత్యంగారి దొడ్డి సమీపంలోని ఆయన నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు రామ్‌దాస్ అథవాలే ఫోన్‌లో ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆయన స్వగృహం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై బస్టాండ్ సమీపంలోని స్వర్గపురిలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

సత్యవర్ధన్ కేసులో శ్రీను బెయిల్‌పై విచారణ 13కి వాయిదా

విజయవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కేసులో 11వ నిందితుడిగా ఉన్న సీహెచ్ శ్రీను బెయిల్ పిటిషన్‌పై విచారణను 13వ తేదీకి సీబీఐ కోర్టు వాయిదా వేసింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అతడు కొద్దిరోజుల క్రితం పిటిషన్ దాఖలు చేయగా విచారణ 13వ తేదీకి వాయిదా వేసింది.

సచివాలయాల్లో నీటితీరువాను చెల్లించండి

మచిలీపట్నం: జిల్లాకు చెందిన రైతులు నీటితీరువాను గ్రామాల్లోని సచివాలయాల్లో చెల్లించవచ్చని కలెక్టర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన రైతులు నీటితీరువాను రూ.41.68కోట్ల మేర చెల్లించాల్సి ఉందన్నారు.

కృష్ణా తరంగాలపై ప్రపంచ రికార్డు

● 200 వాటర్ క్రాఫ్ట్‌పై వెయ్యిమందితో ఫ్లోటింగ్ యోగాకు ఏర్పాట్లు
● ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలి: కలెక్టర్ లక్ష్మీశ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ వారసత్వ సంపదైన యోగాను ప్రతి ఒక్కరికీ చేరువచేయాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025లో భాగంగా ఈనెల 11న బెరం పార్కు వద్ద కృష్ణమ్మ ఒడిలో ఉషోదయ వేళ యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగాతో ప్రపంచ రికార్డును సొంతం చేసుకొనేలా మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మీడియా సమావేశం నిర్వహించారు. పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు వంటి 200 వాటర్ క్రాఫ్ట్‌పై వెయ్యి మందితో కామన్ యోగా ప్రొటోకాల్‌తో యోగాసనాలు చేయడం జరుగుతుందన్నారు. వరల్డ్ రికార్డ్స్ యూనియన్ పరిశీలించి, ప్రపంచ రికార్డుగా నమోదు చేస్తారన్నారు. కనుల విందుగా జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మెగా ఈవెంట్ నిర్వహణలో జిల్లా అధికారులతో సహా ఆయుష్ శాఖ, వైద్య, ఆరోగ్యం, మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మత్స్య తదితర శాఖలతో పాటు అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ), స్విమ్మర్ల అసోసియేషన్, యోగా శిక్షణ సంస్థలు వంటివి భాగస్వాములవుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు

యోగా విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంత ముఖ్యమో ఇలాంటి మెగా ఈవెంట్ల విషయంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవడం అంతే ముఖ్యమని, గత ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, సుశిక్షితులైన బోట్ ఆపరేటర్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. బోట్లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి చొరవతో, ముఖ్యమంత్రి నెల రోజుల వ్యవధిలో 2 కోట్ల మందికి యోగాను నేర్పించే లక్ష్యంతో యోగాంధ్ర-2025ను ఆవిష్కరించారని, ఇంత మంచి కార్యక్రమాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. త్వరలో కొండపల్లి ఖిల్లాపైనా యోగాంధ్ర నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రామతల్లేహి, డీపీఆర్వో ఎస్‌వీ మోహనరావు పాల్గొన్నారు.



రైతులకు ప్లాట్ల కేటాయింపు చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

రాజధాని రైతులకు 31 ప్లాట్ల కేటాయింపు

కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయ అభివృద్ధికి, అమరావతిలోని సీడ్ యాక్సిస్ రహదారి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 31 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 23 నివాస ప్లాట్లు కాగా 8 వాణిజ్య పాట్లు. ఈ లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ చేపట్టారు. ప్లాట్లు పొందిన రైతులకు గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) బాలసుబ్రమణ్యంతో కలిసి సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్), ఎన్ఎస్‌వీటీ వసంతరాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా తమ ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ బి.సురేష్ కుమార్, సీనియర్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నగరంలో జాబ్‌మేళా

కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు గురువారం విజయవాడలోని వరుణ్ మోటార్స్ షోరూం నందు 'జాబ్‌మేళా' నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్య బ్రహ్మం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వరుణ్ బజాజ్, పద్మజ సుజుకి, వరుణ్ మారుతి, భారత్ బెంజ్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా ఉద్యోగాలకు ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 30ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైనవారికి ఆసక్తికర వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగావకాశాలున్నాయని, జూన్ 12న నిర్వహించబోయే జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి, అర్హతలున్న అభ్యర్థులు డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ లింక్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి జాబ్‌మేళాకు రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, పాన్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, వివరాలకు 9985444333, 9885797222 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



యోగాసనాలు వేస్తున్న ఉపాధి శ్రామికులు, విశ్రాంత పోలీసు అధికారులు

నిత్య యోగాతో నూతనోత్తేజం: కలెక్టర్

సత్యనారాయణపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రోగ రహిత జీవితం యోగాతోనే సాధ్యమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్ జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా మంగళవారం ఉపాధిహామీ శ్రామికులు, విశ్రాంత పోలీసు అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరికీ యోగాను చేరువ చేసేందుకు థీమ్ యోగా నిర్వహిస్తున్నామన్నారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో పాటు వివిధ అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని వాటి నుంచి రక్షణ పొందేందుకు ఆరోగ్యకరమైన జీవితం సొంతం చేసుకునేందుకు యోగాసనాలు ఉత్తమ మార్గమన్నారు. డ్వామా పీడీ రాము, అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఏఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శి పీ హరికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆయుష్ అధికారి రామ్‌తల్లేహి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇగ్నోలో టర్మ్ ఎండ్ పరీక్షలు

వన్‌టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో ఈనెల 12 నుంచి జూలై 19 వరకు టర్మ్ ఎండ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురంలో మొత్తం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో అర్హులైన అభ్యర్థులందరికీ హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉంచామని, వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తమ అధ్యయన కేంద్రాల్లో థియరీ పరీక్షల అనంతరం సంప్రదించాలన్నారు. వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గానీ, ఈ-మెయిల్‌లో గాని, లేదా 0866-2565253 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



అమరావతిలో అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

త్వరగా భవనాల ఇంటీరియర్ పనులు

● కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఆదేశాలు

వన్‌టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన భవనాల ఇంటీరియల్ పనులను త్వరగా పూర్తిచేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం సీఆర్‌డీఏ కమిషనర్ అధికారులతో కలిసి అమరావతిలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు పూర్తయిన ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహాలను పరిశీలించారు. గృహాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీల బంగ్లాలు, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు, ఈ6, ఈ12, ఎన్14 రహదారుల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి ఆ పనులు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కొరకు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వసతి సముదాయాలను, కార్మికుల పిల్లలకు కల్పిస్తున్న మౌలిక వసతులను ఆయన అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సీఆర్‌డీఏ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌ఫ్రా) సీహెచ్ ధనుంజయ, చీఫ్ ఇంజనీర్ (హౌసింగ్ అండ్ బిల్డింగ్స్) ఎన్ శ్రీనివాసులు, చీఫ్ ఇంజనీర్ హౌసింగ్ అండ్ బిల్డింగ్స్ (నిర్వహణ విభాగం) డీ శ్రీరామచంద్రమూర్తి, చీఫ్ ఇంజనీర్ (కార్యాలయాలు) పీవీకే భాస్కర్, ఎస్ఈ బిట్ర శ్రీనివాసరావు ఉన్నారు.

యోగా పోటీలకు విశేష స్పందన

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆరుగురు ఎంపిక



పోటీల్లో ఆసనాలు వేస్తున్న విద్యార్థిని

మచిలీపట్నం టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యోగ పోటీలకు మంచి స్పదన లభించింది. 4 రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో మొదటిరోజు ఉయ్యూరు, గుడివాడ, ఆకునూరు, పెనమలూరు, వేల్పూరు, విజయవాడ, వేల్పూరు, మచిలీపట్నం ప్రాంతాలకు చెందిన యోగ సాధకులు పోటీల్లో పాల్గొన్నారు. ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానంపై పోటీలు నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ పోతురాజు పోటీలను ప్రారంభించారు. ఇంటర్ వి ద్యాశాఖ జిల్లా అధికారి సాల్మన్‌రాజు, డీవైఈవో సింగ్, ఆయుష్ అధికారులు వాహిని, ప్రసన్న పాల్గొన్నారు. సీనియర్ యోగ మాస్టర్ పూర్ణచంద్రరావు, కృష్ణ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పదేళ్ల నుంచి 18ఏళ్ల వరకున్న బాలబాలికలకు, 18 నుంచి 35 ఏళ్లున్నవారికి, 35 నుంచి ఆపైన వయస్సున్న యోగ సాధకులకు పోటీలు నిర్వహించారు. కే వెంకటకృష్ణ (గోసాల), కే సింధు (గుడివాడ), ఎస్‌కే ఇంతియాజ్ (గుడివాడ), ఎం చినరాయుడు (గుడ్లవల్లేరు), కే చందు (గుడివాడ), కే లక్ష్మి (గోసాల) విజేతలుగా నిలిచారు. వీరు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన పూర్ణచంద్రరావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రోజురోజుకీ యోగకు ఆదరణ పెరుగుతోందని, కలెక్టర్ బాలాజీ స్వయంగా తన భార్యతో కలిసి యోగ శిక్షణా తరగతుల్లో పాల్గొంటూ జిల్లా ప్రజలకు స్ఫూర్తినిస్తున్నారన్నారు. గతంలో చాలా పర్యాయాలు న్యాయనిర్ణేతగా వ్యవహరించానని తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలతో న్యాయ నిర్ణేత పూర్ణచంద్రరావు

జలక్రీడలకు విశేష ఆదరణ

● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 10: మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో మచిలీపట్నం లోని మసులా బీచ్‌ఫెస్టివల్‌లో నిర్వహించిన జాతీయ జలక్రీడలకు విశేష ఆదరణ లభించిందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొనారు. శాప్ కార్యాలయంలో మంగళవారం బీచ్ ఫెస్టివల్ క్రీడాపోటీల విజేతలు, నిర్వాహకులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ అథారిటీకి మరింత గౌరవం లభించిందని, అంచనాలకు మించి 15 లక్షల మంది హాజరయ్యారని, జాతీయ పోటీలు నిర్వహించడం సరికొత్త అధ్యయమన్నారు. శాప్ అధికారులు, డీఎస్డీవోలు, కోచ్‌లు, అసోసియేషన్ల నిర్వాహకుల సమష్టి కృషి అభినందనీయమన్నారు. అసోసియేషన్ల చొరవ ప్రశంసనీయమన్నారు, క్రీడాకారులకు, కోచ్‌లకు, అసోసియేషన్లకు ఆర్థిక ప్రోత్సాహకాలను విడివిడిగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం శాప్ ఎండీ సీఎస్ గిరీషాతో కలిసి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను, శాప్ అధికారులను, సిబ్బందిని, అసోసియేషన్ల నిర్వాహకులను సత్కరించారు. పోటీల్లో పతకాలు సాధించిన విజేతలకు ఆర్థిక పోత్సహకాలను అందజేశారు. శాప్ ఏవో ఆర్.వెంకటరమణ నాయక్, టీఎస్‌వో ఎస్వీ రమణ, ఎస్‌వోలు కోటేశ్వరరావు, మహేష్, సురేంద్ర, కిషోర్, ఏడీ వేణు పాల్గొన్నారు.



ఖాళీస్థలంలో సేవా కేంద్రం ఏర్పాటు

● దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అర్జునవీధి ప్రారంభంలోని దేవస్థానానికి చెందిన ఖాళీస్థలంలో సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఏఈఈవోలు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఖాళీస్థలాన్ని పరిశీలించారు. ముందుభాగాన ఉన్న హాకర్లతో ఈ సేవా కేంద్రాన్ని ఏర్పాటు గురించి చెప్పి అందరూ ఖాళీ చేసి సహకరించాలని కోరారు. దుర్గమ్మకు విరాళాల చెల్లింపు, సమాచారం, సేవా బుకింగ్ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే భక్తులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లినట్లు ఈవో తెలిపారు. ఏఈఈవోలు బీ వెంకట రెడ్డి, పీ చంద్రశేఖర్, ఎన్ రమేష్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, సూపరింటెండెంట్లు డీవీవీ సత్యనారాయణ, వీ నగేష్, చందు శ్రీనివాస్, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా వేలం పాట

దేవస్థానానికి చెందిన షాపుల వేలం పాట ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఈవో శీనానాయక్ అధికారులను ఆదేశించారు. ఈనెల 11, 12న భక్తులకు పూజాద్రవ్యాలు, ఆట వస్తువులు విక్రయించే దుకాణాలు, మహామండపం 5వ అంతస్తులో 19 షాపుల ఏర్పాటుకు బహిరంగ వేలం పాట జరగనున్న నేపథ్యంలో మంగళవారం ఈవో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు ఈవో దిశా నిర్దేశం చేశారు. ఏఈవో రమేష్ బాబు, సూపరింటెండెంట్లు నగేష్, డీవీవీ సత్యనారాయణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అర్జునవీధి వద్ద హాకర్లతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్, అధికారులు

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 11 జూన్ 2025

ఫ్యాషన్









చుడీదార్ చూడముచ్చటగా...

అన్ని వయసుల మహిళలూ ధరించడానికి ఇష్టపడే డ్రస్.. చుడీదార్! ఇంపైన రంగులు, చూడచక్కని ప్రింట్లు, ఆకర్షణీయమైన చున్నీలు.. ఇన్ని హంగులు ఉంటాయి కాబట్టే చుడీదార్‌కు అంతటి ఆదరణ! తాజాగా ఆధునికత ఉట్టిపడే పలు రకాల చుడీదార్లు ట్రెండ్ సృష్టిస్తున్నాయి. వాటిలో ఇవి కొన్ని..

- నెక్ పెద్దదిగా ఉంటే, మెడకు అంటుకుని ఉండే చోకర్ ధరించాలి. చిన్నదిగా ఉంటే, చాంద్‌బాలీ లాంటి ఝుంకాలు పెట్టుకోవాలి
- మిక్స్ అండ్ మ్యాచ్ ప్రయత్నిస్తూ ఉండాలి. అందుకోసం కాంట్రాస్ట్ రంగుల టాప్స్, బాటమ్స్ ఎంచుకోవాలి
- రాజస్థాన్ జుత్తీలు, షోలాపూర్ చెప్పులు వినూత్నంగా కనిపిస్తాయి కాబట్టి చుడీదార్‌తో వీటిని వేసుకోవాలి.
- ప్లెయిన్ టాప్‌కు రంగురంగుల బాటమ్ జత చేయాలి. ఈ బాటమ్‌కు ఉపయోగించిన వస్త్రాన్నే టాప్ చేతులు, అంచులకు జోడించాలి. అప్పుడు చుడీదార్ సాదా సీదాగా కాకుండా మరింత ఆకర్షణీయంగా తయారవుతుంది
- కాటన్ చుడీదార్‌కు లెగ్గింగ్, జెగ్గింగ్ బదులుగా పాటియాలా ప్యాంట్ ప్రయత్నించవచ్చు. పలాజోలు నేల మీద జీరాడేలా పొడవుగా ఉండకుండా, నీ లెంగ్త్ పలాజోలు కూడా ప్రయత్నించవచ్చు
- డోరీలు, కుచ్చులు, కాలర్లు లాంటి కొత్త ప్రయోగాలు కూడా ప్రయత్నిస్తూ ఉండాలి. స్లీవ్‌లెస్ టాప్ కుట్టించుకుంటే, దాన్ని ఫ్రాక్‌లా కూడా వాడుకోవచ్చు
- నెక్ డిజైన్‌లో ప్రయోగాలను అనుసరించాలి. హై నెక్, బోట్ నెక్, కాలర్ నెక్‌లు చుడీదార్‌కు ఆధునిక అందాన్ని తెచ్చి పెడతాయి. కాబట్టి ఆ మెడ డిజైన్ కోసం బాటమ్ వస్త్రాన్నే వాడుకోవాలి



అవకాడోతో ఆరోగ్యం

కొన్నాళ్లుగా అవకాడోల వినియోగం పెరిగింది. ఈ అవకాడోల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం...

- అవకాడోలో విటమిన్ బి6, సి, ఇ, కె వంటివి పుష్కలంగా ఉంటాయి. ఈ శరీరంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపరుస్తాయి.
- అవకాడోలోని మెగ్నీషియం, పొటాషియం రక్తపోటును నియంత్రిస్తాయి.
- శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగకుండా అవకాడో నియంత్రిస్తుంది. దీని వలన గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది.
- అవకాడోలోని ఫొలేట్ మెదడు చురుగ్గా పని చేసేలా సహాయపడుతుంది.
- అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు (ఫ్యాటీ యాసిడ్స్), ఫైబర్ ఆకలిని నియంత్రించి శరీర బరువు తగ్గడంలో సహాయపడతాయి.
- ఫైబర్ అజీర్తి సమస్యలను కూడా నివారిస్తుంది. పేగు ఆరోగ్యానికి సహాయపడతుతుంది.
- అవకాడోలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు మంట, వాపులను తగ్గించడంలో ఉపయోపడతాయి.
- గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అవకాడో వల్ల ఉపయోగాలు ఉన్నాయి. అవకాడోలోని పోషకాలు ప్రెగ్నెన్సీలో సమస్యలను నివారించడంతో పాటు, ప్రసవం తర్వాత తల్లిలో పాల ఉత్పత్తిని పెంచుతుంది.

వర్షాల్లో కురుల సంరక్షణ ఇలా

వర్షాకాలం మొదలైపోయింది. వర్షం చినుకుల్లో జుట్టు తడిచిపోతుంటుంది. వర్షపు నీటిలో ఆమ్లత్వం ఉండడం వలన అనేక కేశ సమస్యలు వస్తాయి. కాబట్టి ఈ కాలంలో శిరోజాల రక్షణకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఈ కాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండడం వలన మాడు జిడ్డుగా మారడంతో పాటు కురులు గడ్డిలా మారుతాయి. దీనివలన కేశాలు బలహీనపడి రాలిపోతుంటాయి. కాబట్టి వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు తలస్నానం చేయాలి. సల్ఫేట్ లేని షాంపూలు వాడితే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.
- వర్షాకాలంలో చుండ్రు సమస్య ఎక్కువ అవుతుంది. కలబంద గుజ్జులో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు తగ్గుతుంది.
- కలబంద గుజ్జును మాడుకు బాగా పట్టించి మసాజ్ చేయాలి. అరగంట తరువాత కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.
- తడి జుట్టును దువ్వడం వలన కూడా జుట్టు రాలుతుంది. కాబట్టి జుట్టును ఆరిపోయాక మాత్రమే దువ్వాలి.



- కురులను బిగుతుగా కట్టి ఉంచేలా జడలు, పోనిటైల్స్‌ను వేసుకోకూడదు.
- వర్షాకాలంలో స్ట్రైట్‌నర్‌లు, కర్ల్ ఐరన్‌లు వంటిని వాడకపోవడం మంచిది.

నాన్న స్ఫూర్తితో పతకాల వేట

చేబోయిన ఆర్యాణి... భారత జాతీయ మహిళా స్కేటింగ్ జట్టులో అత్యంత సీనియర్ సభ్యురాలు మాత్రమే కాదు... 'వరల్డ్ స్కేట్ గేమ్స్'లో మన దేశం తొలి పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. వచ్చే నెల 'ఆసియా రోలర్ ఛాంపియన్‌షిప్' కోసం తమ్ముడితో కలిసి సన్నద్ధమవుతున్న ఆమె తన క్రీడా ప్రయాణం గురించి 'నవ్య'తో మాట్లాడింది.



"మా స్వస్థలం విజయవాడ. ప్రస్తుతం ఇక్కడే ఉంటున్నాం. మా నాన్న శివ పరమేశ్వరరావు ఎక్స్-సర్వీస్‌మన్. బాస్కెట్ బాల్ కోచ్. మా అమ్మ గృహిణి. బాల్యం నుంచి నాన్నే నా రోల్ మోడల్. ఆయన బాస్కెట్ బాల్ పోటీలకు వెళ్ళేవారు, శిక్షణ ఇచ్చేవారు. ఆయన ప్రేరణతో ఏదైనా క్రీడలో అభ్యాసం చేద్దామనే ఆలోచన ఉండేది. ఒకసారి ఏలూరులోని మా అమ్మమ్మ గారి ఇంటికి వెళ్ళాను. అక్కడ స్టేడియంలో చాలామంది పిల్లలు స్కేటింగ్ చేయడం చూశాను. ఆ క్రీడ నన్ను ఆకర్షించింది. నేర్చుకుంటే బాగుంటుందనుకున్నాను. అలా... ఆ ఏడాది వేసవి సెలవుల్లో స్కేటింగ్ శిక్షణలో చేరాను. సరదాగా ప్రారంభించినా... క్రమంగా దాని మీద ఆసక్తి కలిగింది. 'ఇంకా నేర్చుకోవాలి, ఈ క్రీడలో నైపుణ్యం సాధించాలి' అనే తపన పెరిగింది. రెండు మూడేళ్ళపాటు శిక్షణ తీసుకున్నాక... మా నాన్నగారికి ముంబయికి బదిలీ అయింది. అక్కడ కూడా స్కేటింగ్ కొనసాగించాను. అప్పుడే దీన్ని కూడా ఒక ప్రొఫెషనల్ క్రీడగా ఎంచుకోవచ్చునని అర్థమయింది. ఆ దిశగా సాధన చేయడం ప్రారంభించాను. నైపుణ్యం సాధించిన తరువాత... జిల్లా, రాష్ట్ర పోటీల్లో రాణించడంతో... 2014లో జాతీయ స్థాయిలో ఆడే అవకాశం వచ్చింది. అప్పుడు మా నాన్నగారు ఢిల్లీలో పని చేస్తూ ఉండడంతో... ఢిల్లీ జట్టులో సభ్యురాలిగా ఉన్నాను. ఆ తరువాత జాతీయ జట్టులో ఆంధ్రప్రదేశ్ తరఫున కొనసాగుతున్నాను.

మోస్ట్ వేల్యుబుల్ ప్లేయర్‌గా...

నేను 2017లో జాతీయ స్థాయిలో తొలి పతకం అందుకున్నాను. ఆస్ట్రేలియా, అమెరికాతో జరిగిన మ్యాచ్‌లలో 'మోస్ట్ వేల్యుబుల్ ప్లేయర్'గా అవార్డులు సాధించాను. జట్టులో అత్యంత సీనియర్ ప్లేయర్‌ని కావడం, 2019లో జరిగిన 'వరల్డ్ రోలర్ గేమ్స్'లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విస్తృతమైన అనుభవం ఉండడం 2019 చైనా నిర్వహించిన పోటీల్లో విజయాలకు దోహదం చేసింది. ఆ పోటీల్లో భారత జట్టు సెమీస్‌కు చేరుకొని, నాలుగో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో... భారత జట్టులో 'మోస్ట్ క్యాప్డ్ ఇంటర్నేషనల్ ప్లేయర్'గా గుర్తింపు పొందాను. బార్సిలోనాలో జరిగిన డబ్ల్యుఎస్‌డీలో పాల్గొన్నాను. 2022లో అర్జెంటీనాలో, 2023లో చైనాలో జరిగిన పోటీలకు ఎంపికయ్యాను. కిందటి ఏడాదిలో ఇటలీలో జరిగిన 'వరల్డ్ స్కేట్ గేమ్స్'లో.... రోలర్ డెర్బీ విభాగంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. అందులో మన జట్టు చైనాను ఓడించి మూడో స్థానంలో నిలిచింది. కాంస్య పతకం గెలిచింది. ఇది' వరల్డ్ స్కేట్ గేమ్స్'లో ఇప్పటివరకూ భారత్ సాధించిన తొలి పతకం. ఈ ఘనతలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మా జట్టు బంగారు పతకం సాధించాలి. అదే నా లక్ష్యం.

తమ్ముడితో కలిసి...

స్కేటింగ్‌తో పాటు బాస్కెట్‌బాల్‌లోనూ నాకు నైపుణ్యం ఉంది. సౌత్‌జోన్‌లో మా యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఎన్‌సీసీలో కూడా ఉన్నాను. ఈ ఏడాది నా బీటెక్ పూర్తవుతుంది. ఇక... నేను స్కేటింగ్ అభ్యాసం ప్రారంభించిన ఏడాదికి... నా తమ్ముడు అభిరామ్ కూడా స్కేటింగ్‌లో చేరాడు. తను కూడా బాగా రాణిస్తున్నాడు. ఇంటర్ పూర్తి చేశాడు. మ్యూజిక్ అంటే ఇష్టం. వయొలిన్‌లో డిప్లమా చేస్తున్నాడు. ఈ ఏడాది జూలైలో దక్షిణ కొరియాలో జరగబోయే 'ఏషియన్ రోలర్ ఛాంపియన్‌షిప్'లో... రోలర్ డర్బీ ఈవెంట్‌కు నేను, అభిరామ్ ఎంపికయ్యాం. దానికోసం రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాం, అన్ని విధాలుగా సన్నద్ధం అవుతున్నాం. మా నాన్నగారే మాకు కోచ్. ఆయన ఇంటర్నేషనల్ క్వాలిఫైడ్ రిఫరీ కూడా. ఫిట్‌నెస్‌లో, టెక్నిక్స్‌లో... ఇలా అన్నిట్లో ఆయనే మాకు శిక్షణ ఇస్తారు.

వారి సంకల్పంతోనే...

చిన్నప్పుడు నాకు బంధు మిత్రుల ప్రోత్సాహం లభించినా.. ఆ తరువాత "ఇంకా



ఇది అవసరమా? నేషనల్ మెడల్ వచ్చింది కదా? ఇక చాలు అన్నట్టు" కొందరు మాట్లాడారు. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ ఉండడంతో మద్దతు ఇస్తున్నారు. కానీ మా తల్లిదండ్రులు ఎల్లప్పుడూ నాకు అండగా నిలిచారు. వారిద్దరి సంకల్పమే నన్ను ఇక్కడివరకూ తీసుకువచ్చింది. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక దారుఢ్యం అభివృద్ధి చెందుతాయి. స్కేటింగ్.. జట్టుగా ఆడే క్రీడ. జట్టులోని ఇతర సభ్యులతో ఎలా కమ్యూనికేట్ చెయ్యాలో మేము నేర్చుకుంటాం. నాయకత్వ లక్షణాలు పెరగడానికి, కొత్త ప్రదేశాలకు, అక్కడి వాతావరణాలకు, సంస్కృతులకు త్వరగా అలవాటు పడడానికి క్రీడలు దోహదం చేస్తాయి. అయితే దీనిలో సవాళ్ళు కూడా ఉన్నాయి. స్కేటింగ్ గేమ్‌కు భారత ప్రభుత్వం నుంచి నిధులు రావు. ప్రతిసారీ మేమే స్పాన్సర్లను వెతుక్కోవాలి. క్రితంసారి నాకు కెనరాబ్యాంక్ ఎండి స్పాన్సర్ చేశారు. రాబోయే ఆసియా ఛాంపియన్‌షిప్‌కి నాకు, మా తమ్ముడికి కూడా కెనరా బ్యాంకే స్పాన్సర్ చేస్తోంది. అన్ని విధాలా సాయపడుతోంది. మాకు ఆర్థికంగా సహకరించాలని ప్రభుత్వాన్ని కోరాం. క్రీడామంత్రిని కూడా కలిశాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నాం."

• కృష్ణశర్మ

శుక్స్ భారతంలో అర్జునుడిలాంటి వాడు

అంతరిక్షం ప్రయోగాలను టీవీలో చూసే వారికి అవి గమ్యం ఎప్పుడు చేరతాయా అనే ఉత్కంఠ ఉంటుంది..

ఆ అంతరిక్ష నౌకలలో ప్రయాణించే వ్యోమగాముల కుటుంబ సభ్యులు ఎంతో ఉద్విగ్నతతో వారు ఎప్పుడు తిరిగి వస్తారా అని ఎదురుచూస్తూ ఉంటారు. ప్రస్తుతం భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా భార్య కామ్నా పరిస్థితీ అంతే!

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా 14 రోజుల యాత్ర కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్తున్న శుభాన్షు గురించి కామ్నా పంచుకున్న ముచ్చట్లు...



"శుక్స్ (శుభాన్షు శుక్లా ముద్దుపేరు)ను నేను తొలిసారి చూసింది మా స్కూల్లో! మేమిద్దరం మూడో క్లాసు నుంచి కలిసి చదువుకున్నాం. మేమిద్దరం చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులం కూడా! చిన్నప్పుడు శుక్స్ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాడు. ఎవరితోనైనా మాట్లాడాలంటే సిగ్గుపడేవాడే వాడు. కానీ కాలేజీకి వచ్చే సరికి అతనిలో మార్పు వచ్చింది. ఫైటర్ పైలెట్ అయిన తర్వాత ఒక ఆదర్శవంతమైన వ్యక్తిగా మారాడు. తనకు ఒక కచ్చితమైన రొటీన్ ఉంటుంది. దేనినీ అసాధ్యం అనుకోడు. 'ఫైండింగ్ నిమో' చిత్రంలో డోరి అనే పాత్ర ఉంటుంది. ఎలాంటి పరిస్థితులు ఎదురయినా- 'ఈదుతూ పో' అని చెబుతూ ఉంటుంది. శుక్స్ ఎప్పుడూ ఈ డైలాగ్‌ను చెబుతూ ఉంటాడు. సమస్యలు ఎదురయినప్పుడు పరిష్కారాలను అన్వేషించి ఒడిసిపట్టుకోవటం అతని ప్రత్యేకత! తను దేనికీ భయపడడు. రిస్క్ తీసుకోవటానికి వెనకాడడు. బహుశా అందుకే తను టెస్ట్ పైలెట్ వృత్తిని వదిలేసి అంతరిక్ష నౌకాయానానికి సిద్ధపడ్డాడు. టెస్ట్ పైలెట్స్ ఒక సెకను వ్యవధిలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యోమగాములు అంతరిక్షంలో కళ్లకు కనిపించని అతి సున్నితమైన సూక్ష్మజీవులపై పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. ఒక విధంగా చూస్తే రెండింటికీ ఎలాంటి పోలిక లేదు. కానీ ఈ మార్పును శుక్స్ చాలా సహజంగానే స్వీకరించాడు. నాకు తెలిసిన వారిలో శుక్స్ అత్యంత ధైర్యవంతుడు. తను అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యమయ్యే అంతరిక్ష ప్రయాణానికి వెళ్తున్నానని తెలిసినా తనలో ఏ మాత్రం మార్పు లేదు.

ఐదేళ్ల క్రితం...

2020లో గగన్‌యాన్ కోసం టెస్ట్ పైలెట్స్‌ను దరఖాస్తులు పెట్టుకొమ్మన్నారు. సాధారణంగా భారతీయ వాయుసేనలో టెస్ట్ పైలెట్స్ తక్కువ మందే ఉంటారు. అందువల్ల ఎవరు వ్యోమగామిగా ఎంపిక అయినా- మాకు తెలిసిన వ్యక్తే అయి ఉంటాడని చాలా ఆనందపడ్డాం. శుక్స్ కూడా దరఖాస్తు చేశాడు. ఎంపిక అయ్యాడు. ఆ రోజు మేము ఊహించుకున్నది ఇప్పుడు వాస్తవ రూపం అవుతోందంటే చాలా ఆనందంగా ఉంది. ఆ తర్వాతి కాలంలో శుక్స్‌తో పాటు వ్యోమగాములుగా శిక్షణ పొందిన ముగ్గురు కూడా మాకు మంచి స్నేహితులు అయ్యారు. అంతరిక్షంలో మైక్రోగ్రావిటీ అనుభవాలు వారందరినీ మరింత దగ్గర చేస్తాయనుకుంటున్నా! ఇక్కడ మా అబ్బాయి సిడ్‌కు.. శుక్స్‌కు మధ్య ఉన్న అనుబంధం కూడా చెప్పాలి. తను టెస్ట్ పైలెట్ అవటంవల్ల ఎక్కువ సమయం సిడ్‌తో గడపలేకపోయాడు. కానీ సమయం దొరికినప్పుడల్లా సిడ్‌తో ఉండటానికే తను ఇష్టపడతాడు. గత ఐదేళ్లుగా భారతంలో అర్జునుడిలా శుక్స్ దృష్టి అంతా తన లక్ష్యంపైనే ఉంది. అందువల్ల సిడ్‌తో ఎక్కువ గడపలేకపోయాడు. సిడ్ చాలా చిన్నవాడు. వాడికి ఏం జరుగుతోందో తెలియదు. అందరి నాన్నలు వ్యోమగాములే అనుకుంటున్నాడు. ఈ మధ్య మేము అమెరికాలో నాసా అంతరిక్షకేంద్రానికి వెళ్లాం. అక్కడ రాకెట్లు, వ్యోమగాములు వేసుకొనే సూట్లు మొదలైన వాటిని చూసి చాలా ఉత్సాహపడ్డాడు. కానీ- 'నీకు నాసాలో ఏం నచ్చింది?' అని అడిగితే- "నాసా పార్కులో జింకలు చాలా బావున్నాయి' అన్నాడు. దీని ఆధారంగా వాడి మానసిక పరిస్థితి మనం అర్థం చేసుకోవచ్చు.

> **140 కోట్ల మందికి.. ఒక అద్భుతమైన దేశానికి ప్రాతినిధ్యం వహించే అదృష్టం మీ నాన్నకు వచ్చిందని సిడ్‌కు చెబుతున్నా! వాడు పెద్దవాడైన తర్వాత నాన్నను చూసి గర్వపడతాడు.**

ఎప్పుడూ వెళ్లలేదు..

తన టెస్ట్ ఫ్లైట్ టేకాఫ్‌ను చూడటానికి నేను ఎప్పుడూ వెళ్లలేదు. నేను చూడను కాబట్టి వాటి గురించి ఆలోచించను. ఇప్పుడు యాక్సియం-4 లాంచ్ గురించి కూడా నేను ఆలోచించటం లేదు. అంతా సజావుగా సాగిపోతుందని ఆశిస్తున్నాను. రిస్క్ చేయకుండా మనకు జీవితంలో గొప్ప విజయాలు లభించవు. సాహసవంతులకే కీర్తి లభిస్తుంది.. శుక్స్ నాకు దూరంగా ఉన్న సమయంలో నా ముందు రెండే మార్గాలుండేవి. ఒకటి ఆందోళన చెంది బాధపడుతూ ఉండటం. రెండోది తన విజయాలను చూసి ఉత్సాహంగా ఉండటం. అప్పుడు నేను రెండో మార్గాన్ని ఎంచుకొనేదాన్ని. ప్రస్తుతం కూడా నేను రెండో మార్గాన్నే ఎంచుకున్నా! తను అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని వచ్చే ఉత్కంఠ క్షణాల కోసం ఎదురుచూస్తున్నా."

'స్పైడర్' ఉండాల్సిందే!

మనం ఇంట్లో అందమైన మొక్కల కుండీలను పెట్టుకుంటూ ఉంటాం. ఈ మొక్కలు ఇల్లంతా తాజాదనాన్ని వ్యాపింపజేస్తూ ఉంటాయి. ఈ కోవలో చెప్పుకోదగ్గది 'స్పైడర్ ప్లాంట్'. దీని ఆకులు సన్నగా పొడవుగా చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మొక్క గుబురుగా పెరిగినప్పుడు.... పేరుకు తగ్గట్టు సాలెపురుగును తలపిస్తుంది. దీనిని ఎక్కువగా సంరక్షించాల్సిన అవసరం లేదు. ఎండ, వాన, చలి లాంటి వాతావరణ పరిస్థితులను తట్టుకుని చక్కగా పెరుగుతుంది.

- వెడల్పాటి కుండీలో తోట మట్టిని నింపి చిన్న మొక్కను నాటితే చాలు. కొద్ది సమయంలోనే గుబురుగా పెరుగుతుంది. బాల్కనీ గోడమీద, కిటికీల దగ్గర కుండీలు అమర్చుకోవచ్చు. ఈ మొక్కకు నేరుగా ఎండ తగలకూడదు. కొద్దిగా వెలుగు సోకితే చాలు. గది ఉష్ణోగ్రత వద్ద వేగంగా పెరుగుతుంది. దీనికి నీరు ఎక్కువగా పోయకూడదు. మట్టి తేమగా ఉందో లేదో చూసుకుని రెండు రోజులకు ఒకసారి నీళ్ల చిలకరిస్తే సరిపోతుంది. క్లోరిన్ కలిపిన మంచినీరు కాకుండా బోరు నీళ్ల, బాగా శుద్ధి చేసిన నీరు లేదంటే వర్షపు నీటిని మాత్రమే కొద్దిగా చల్లాలి.
- స్పైడర్ మొక్క కుండీలను వంటగది, పడక గది, పిల్లలు చదువుకునే గదుల్లో పెట్టుకోవచ్చు. హాల్లో సోఫాకు ఇరుపక్కలా పెట్టినా అందంగా కనిపిస్తుంది.
- వంటగది నుంచి వెలువడే వేడి, ఘాటైన వాసనలను ఈ మొక్క పీల్చుకుంటుంది. ఆక్సిజన్‌తోపాటు తేమనీ విడుదల చేస్తుంది. దీనివల్ల ఇల్లంతా చల్లగా ఉన్నట్లు అనిపిస్తుంది. స్పైడర్ మొక్క ఆకులు ఇంట్లో గాలిని శుద్ధి చేస్తాయి. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గి ప్రశాంతంగా నిద్ర పడుతుంది. మెదడు చురుకుగా పనిచేయడంతోపాటు ఏకాగ్రత పెరుగుతుంది. ఏసీ ఉన్న గదిలో ఈ మొక్కను ఏర్పాటు చేసుకుంటే శ్వాసకోశ సమస్యలు రావు. ఇంట్లో స్పైడర్ మొక్కను పెంచడం వల్ల ఈగలు, దోమలు, ఇతర క్రిమి కీటకాలు లోనికి రావు.



బిజినెస్
విజయవాడ ● బుధవారం 11 జూన్ 2025

జీడీపీలో కుటుంబ రుణాల వాటా 42%

అయినా ఆందోళన చెందాల్సిన పని లేదు

తాజా రెపో తగ్గింపుతో అప్పులపై చెల్లించే వడ్డీ భారం రూ.60,000 వరకు తగ్గుదల

ఎస్‌బీఐ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: గత మూడేళ్లుగా మన దేశంలోనూ కుటుంబాల అప్పులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. 2021 జూన్ నాటికి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 36.6 శాతంగా ఉన్న ఈ అప్పుల భారం ప్రస్తుతం 42 శాతానికి చేరింది. 2023 డిసెంబరు నాటికి ఉన్న 40.2 శాతంతో పోల్చినా ఇది 1.8 శాతం ఎక్కువ. అయితే ఇదేమీ పెద్దగా ఆందోళన చెందాల్సిన విషయం కాదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికలో పేర్కొంది. ఇతర వర్ధమాన దేశాల కుటుంబాల అప్పులు ఇప్పటికే ఆయా దేశాల జీడీపీలో సగటున 49.1 శాతానికి చేరిన విషయాన్ని గుర్తు చేసింది. ఆ దేశాలతో పోలిస్తే మన దేశ కుటుంబాల అప్పుల భారం ఇప్పటికీ తక్కువేనని స్పష్టం చేసింది. ఇటీవల భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రెపో రేటు తగ్గించడంతో ఒక్కో కుటుంబం అప్పులపై చెల్లించే వడ్డీల భారం రూ.50,000 నుంచి రూ.60,000 వరకు తగ్గుతుందని అంచనా వేసింది.

ఇతర ప్రధానాంశాలు

- రుణ మొత్తాలు పెరగడం కాకుండా.. రుణాలు తీసుకునే కుటుంబాలు పెరగడం వల్లే రుణ భారం పెరుగుతోంది.
- మూడింట రెండు వంతుల రుణాల చెల్లింపులకు ఢోకా లేదు
- గృహ, వాహన వంటి ఆస్తుల రూపంలో 25 శాతం కుటుంబ రుణాలు
- కుటుంబ రుణాల్లో వ్యవసాయం, వ్యాపారం, విద్యా రుణాలు వంటి ఉత్పాదక రుణాల వాటా మూడు శాతం
- 45 శాతం రుణాలు వినియోగ సంబంధమైన రుణాలు
- రిటైల్, ఎంఎస్ఎంఈల రుణాల్లో 80 శాతం రెపో లేదా ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలు
- మరో రెండేళ్ల వరకు వడ్డీ రేట్లు కిందికే

'మారుతి'ని తాకిన మాగ్నెట్ల కొరత

- ఈ-విటారా ఉత్పత్తిలో భారీ కోత

న్యూఢిల్లీ: రేర్ ఎర్త్ మాగ్నెట్ల కొరత దేశంలో అతి పెద్ద కార్ల కంపెనీ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ)ని తాకింది. ఈ ప్రభావం కంపెనీ త్వరలో విడుదల చేసే ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారాపై పడింది. ఈ మాగ్నెట్ల కొరతతో ఈ సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో 26,512 ఈ-విటారా ఈవీలు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని కంపెనీ 8,221 కి కుదించుకుంది. కంపెనీ అధికారికంగా ఈ విషయం ధ్రువీకరించడం లేదు. అయితే రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలే ఇందుకు కారణమని తెలుస్తోంది.

టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ బైక్



ప్రారంభ ధర రూ.1,53,990

చెన్నై: టీవీఎస్ మోటార్ మార్కెట్లోకి సరికొత్త అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ బైక్‌ను విడుదల చేసింది. తాజా ఓబీడీ2బీ ఎమిషన్ నిబంధనలకు అనుగుణంగా, అధునాతన టెక్నాలజీ, భద్రతా ప్రమాణాలతో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించింది. ఈ బైక్ ప్రారంభ ధర రూ.1,53,990 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). డ్యూయల్ చానెల్ ఏబీఎస్, అర్బన్, స్పోర్ట్, రైన్ అనే మూడు రైడ్ మోడ్స్‌తో ఈ బైక్‌ను తీసుకువచ్చింది.

హైదరాబాద్‌లో దైచీ లైఫ్ జీసీసీ

క్యాప్‌జెమినీతో కలిసి ఏర్పాటు

జపాన్ వెలుపల సంస్థకిదే తొలి కేంద్రం





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. జపాన్ కేంద్రంగా పనిచేసే ప్రముఖ బీమా కంపెనీ దైచీ లైఫ్ గ్రూప్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఫ్రాన్స్‌కు చెందిన ఐటీ, కన్సల్టెన్సీ దిగ్గజం క్యాప్‌జెమినీ.. దైచీ లైఫ్ గ్రూప్ కోసం బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పద్ధతిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. దీనికి సంబంధించి రెండు సంస్థల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయంగా తన సేవల డిజిటల్ మార్పునకు ఈ జీసీసీ ఉపయోగపడుతుందని దైచీ లైఫ్ భావిస్తోంది. తన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధ (ఏఐ), డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ సేవల విస్తృతికి ఈ జీసీసీ నుంచి పనిచేసే ఐటీ, వృత్తి నిపుణులు దోహదం చేస్తారని భావిస్తున్నట్లు దైచీ లైఫ్ తెలిపింది. దైచీ లైఫ్‌కు జపాన్ వెలుపల ఇదే తొలి కేంద్రం.

క్రమంగా ఇతర దేశాలకు

ప్రారంభంలో ఈ జీసీసీ కేంద్రం సేవలు జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు మాత్రమే పరిమితం. మార్కెట్ అవకాశాలు, డిమాండ్‌ను బట్టి హైదరాబాద్ జీసీసీ సేవలను ఇతర దేశాలకు విస్తరిస్తామని దైచీ లైఫ్ తెలిపింది. జీసీసీల ద్వారా భిన్నమైన అంతర్గత సామర్థ్యాలు పెంచుకోవాలన్న లక్ష్యానికి క్యాప్‌జెమినీతో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం దోహదం చేస్తుందని దైచీ లైఫ్ గ్రూప్ సీఈఓ, ప్రెసిడెంట్ టెట్సుయ కికుట ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నాలజీ, నవకల్పనల మేళవింపు ద్వారా ఖాతాదారులు ఆశించిన దానికంటే ఎక్కువ సంతృప్తిని ఈ జీసీసీ ద్వారా అందిస్తామని క్యాప్‌జెమినీ సీఈఓ ఐమాన్ ఇజ్జత్ తెలిపారు.

ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.55% వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) సెల్స్ మాడ్యూల్స్ తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.55 శాతం వాటాను జీఈఎఫ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ రూ.2,629 కోట్లకు విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ డేటా ప్రకారం.. అమెరికాకు చెందిన జీఈఎఫ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ తన అనుబంధ విభాగమైన సౌత్ ఏషియా గ్రోత్ ఫండ్-2 హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ ద్వారా ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.5 శాతం వాటాకు సమానమైన 2.5 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ సగటున రూ.1,051.60కి విక్రయించింది. ఈ లావాదేవీ అనంతరం ప్రీమియర్ ఎనర్జీస్‌లో సౌత్ ఏషియా గ్రోత్ వాటా 11.10 శాతం నుంచి 5.55 శాతానికి తగ్గింది. మంగళవారం ఎన్ఎస్ఈలో ప్రీమియర్ ఎనర్జీస్ షేరు ధర 1.94 శాతం పెరిగి రూ.1,082.80 వద్ద ముగిసింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. మదుపరులు బ్యాంకింగ్, ఇంధన రంగ షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో ప్రామాణిక సూచీలు మిశ్రమంగా ముగిశాయి. మంగళవారం లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్, ఉదయం సెషన్‌లో 235 పాయింట్ల వరకు ఎగబాకింది. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. ఒక దశలో 205 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. ఐటీ షేర్లలో కొనుగోళ్లతో చివరికి 53.49 పాయింట్ల నష్టంతో 82,391.72 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం ఒక పాయింటు పెరిగి 25,104.25 వద్ద స్థిరపడింది.

13నెలల కనిష్ఠానికి ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు

గత నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 13 నెలల కనిష్ఠ స్థాయి రూ.19,013 కోట్లకు తగ్గాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి పెట్టుబడుల ప్రవాహం తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా ప్రకారం.. ఈక్విటీ ఫండ్లలోకి నిధులు తగ్గడం వరుసగా ఇది ఐదో నెల. అంతేకాదు, ఈ ఏప్రిల్‌లో వచ్చిన రూ.24,269 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే గత నెలలో 22 శాతం తగ్గుదల నమోదైంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	96	అనంతపురం	108
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,580 ▼	89,450 ▼	1,19,000 ▲
విజయవాడ	99,500 ▲	93,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	99,510 ▲	89,450 ▼	1,19,000 ▲
రాజమండ్రి	97,580 ▼	89,450 ▼	1,09,600 ▲
ప్రొద్దుటూరు	96,450 ▲	88,730 ▲	1,04,000 ▲
ముంబై	96,359 ▲	88 ,265 ▲	1,07,000 ▲

క్విక్ ఫుడ్ సేవల్లోకి బిగ్‌బాస్కెట్

- స్విగ్గీ, జొమాటో, జెప్టోతో పోటీకి సిద్ధం
- వచ్చే మార్చి నాటికి దేశవ్యాప్త విస్తరణ

బెంగళూరు: టాటా గ్రూప్‌నకు చెందిన ఆన్‌లైన్ కిరాణా ప్లాట్‌ఫామ్ బిగ్‌బాస్కెట్ కూడా క్విక్ కామర్స్ సేవల్లోకి పూర్తి స్థాయిలో రంగ ప్రవేశం చేసేందుకు సిద్ధమవుతోంది. నెల క్రితం బెంగళూరులో ప్రారంభించిన '10 నిమిషాల్లో ఫుడ్ డెలివరీ' సేవలను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి (2026 మార్చి) దేశవ్యాప్తంగా విస్తరించాలనుకుంటున్నట్లు బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు విపుల్ పరేఖ్ తెలిపారు. దీంతో బిగ్‌బాస్కెట్.. స్విగ్గీ స్నాక్, జొమాటో క్విక్‌కామర్స్ విభాగమైన బ్లింకిట్ బిస్ట్రో, జెప్టో కేఫ్‌కు పోటీనివ్వనుంది. క్విక్ ఫుడ్ సేవల కోసం ప్రస్తుత 700 డార్క్ స్టోర్ల (గిడ్డంగులు) సంఖ్యను ఈ ఏడాది చివరి నాటికి 1000-1200కు పెంచుకోవాలని నిర్ణయించింది.

ర్యాపిడో కూడా వచ్చేస్తోంది..

ఓలా, ఉబెర్‌కు పోటీగా బైక్, క్యాబ్ సర్వీసులందిస్తోన్న ర్యాపిడో కూడా స్విగ్గీ, జొమాటోకు సవాలు విసురుతోంది. ఓన్లీ పేరుతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలను పైలట్ ప్రోగ్రామ్ కింద తొలుత బెంగళూరులో ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో సేవలను ఆరంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. అంతేకాదు, ఆహారోత్పత్తులను రెస్టారెంట్‌లో లభించే ధరకే కస్టమర్ ఇంటి వద్దకు సరఫరా చేయనున్నట్లు ర్యాపిడో ప్రకటించింది.

ఎంఎస్ఎంఈలకు మరింత చేయూత

ఈయూతో త్వరలోనే ఎఫ్‌టీఏ : కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్



బెర్న్ (స్విట్జర్లాండ్): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) ఎగుమతులకు మరింత చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సంస్థలు ఏదైనా కొత్త దేశం లేదా కొత్త ఎగుమతిదారులకు తమ ఉత్పత్తులు ఎగుమతి చేయాలంటే అందుకు అయ్యే పూర్తి రిజిస్ట్రేషన్ చార్జీలు భరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం స్విట్జర్లాండ్ పర్యటలో ఉన్న కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి పీయూష్ గోయెల్ ఈ విషయం వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేక పథకాన్ని తీసుకువస్తామన్నారు. ఈ పథకం ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం)లో భాగంగా ఉంటుందన్నారు. ఎగుమతుల రంగంలో ఉన్న దేశీయ కంపెనీలు విలువ జోడింపు, తమ బ్రాండ్ల ప్రచారంపై దృష్టి పెట్టాలని గోయెల్ కోరారు.

ఈయూతో వాణిజ్య ఒప్పందం: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కోసం యూరోపియన్ యూనియన్ దేశాలతో జరుగుతున్న చర్చలు ఏడాది లేదా ఏడాదిన్నరలో ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని గోయెల్ తెలిపారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే భారత-ఈయూ వాణిజ్యం ఆటుపోట్లు లేకుండా స్థిరంగా వృద్ధి సాధిస్తుందన్నారు. బ్రిటన్, యూఏఈలతో కుదుర్చుకున్న తరహాలోనే ఇతర దేశాలతోనూ ఎఫ్‌టీఏలు కుదుర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. భారత్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు స్విట్జర్లాండ్ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

స్పోర్ట్స్

ఈ రాకెట్ రూ.1.34 కోట్లు పలికింది!



న్యూఢిల్లీ: స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ వాడిన ఓ రాకెట్ వేలంలో ప్రకంపనలు సృష్టించింది. 2017 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఇదే రాకెట్‌ను వాడి నడాల్ క్లే కోర్టు గ్రాండ్‌స్లామ్‌లో పదోసారి చాంపియన్‌గా నిలిచాడు. తాజాగా 'ప్రెస్టీజ్ మెమొరబిలియా' అనే సంస్థ ఆ రాకెట్‌ను వేలంలో ఉంచగా ఓ ఔత్సాహికుడు ఏకంగా కోటీ 34 లక్షల ధరకు కొనుగోలు చేశాడు. టెన్నిస్ రాకెట్‌కు ఈ స్థాయిలో ధర పలకడం ఇదే తొలిసారి. 2017 సీజన్ ఆద్యంతం నడాల్ అదే రాకెట్‌తో 24 మ్యాచ్‌లు ఆడాడు. ఇక గతంలో 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలిచిన నడాల్ రాకెట్ రూ.1.19 కోట్లు పలికింది.

పదిహేనేళ్లలో తొలిసారి..

ర్యాంకింగ్స్‌లో టాప్-50 నుంచి బోపన్న అవుట్


న్యూఢిల్లీ: భారత టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న పదిహేనేళ్లలో తొలిసారిగా ర్యాంకింగ్స్‌లో టాప్-50లో చోటు కోల్పోయాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో నిరాశాజనక ప్రదర్శన కనబర్చిన బోపన్న 20 స్థానాలు చేజార్చుకొని 53వ ర్యాంక్‌లో నిలిచాడు. గతంలో 2015 జూన్‌లో బోపన్న 52వ స్థానంలో నిలిచాడు. 45 ఏళ్ల బోపన్న నిరుడు ఏకంగా డబుల్స్‌లో వరల్డ్ నెంబర్‌వన్‌గా నిలిచి, ఈ ఘనత సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఆరు స్థానాలు ఎగబాకిన యుకీ భాంబ్రీ 35వ ర్యాంక్‌తో భారత్ తరఫున డబుల్స్‌లో నెంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు. డబుల్స్‌లో తెలుగు ఆటగాడు రిత్విక్ బొల్లిపల్లి 72, విజయ్‌సుందర్ 100వ ర్యాంక్‌లో ఉన్నారు. ఇక సింగిల్స్‌లో సుమిత్ నగాల్ ఏకంగా 63 స్థానాలు కోల్పోయి 233వ ర్యాంక్‌లో నిలిచాడు.

మూడు రోజులు రెండు ప్రపంచ రికార్డులు

కెనడా స్విమ్మర్ మెకింటోష్ సంచలనం



విక్టోరియా (కెనడా): టీనేజ్ స్విమ్మర్, ఒలింపిక్ చాంపియన్ సమ్మర్ మెకింటోష్ సంచలన ప్రదర్శన నమోదు చేసింది. మూడ్రోజుల్లోనే రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పి అదరహో అనిపించింది. 18 ఏళ్ల మెకింటోష్.. కెనడియన్ స్విమ్మింగ్ ట్రయల్స్‌లో భాగంగా శనివారం 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో 3 నిమిషాల 54.18 సెకన్లలో రేసు పూర్తి చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో గతంలో అరిర్నె టిట్మస్ (ఆస్ట్రేలియా) పేరిటనున్న 3:55.38 సెకన్ల రికార్డును తుడిచేసింది. తాజాగా సోమవారం రాత్రి జరిగిన 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌ను మెకింటోష్ 2 నిమిషాల 5.7 సెకన్లలో ఈదింది. దీంతో 2015లో కతిన్కా హోజు (హంగేరి) నెలకొల్పిన 2 నిమిషాల 6.12 సెకన్ల రికార్డు బద్దలైంది. మెకింటోష్ గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాలు, ఓ రజతం గెలిచింది.



టెస్టు 'గద' దక్కేదెవరికో?

నేటి నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్

ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా అమీతుమీ

మధ్యాహ్నం 3.00 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

లండన్: చాంపియన్స్ ట్రోఫీ.. ఆ వెంటనే ధనాధన్ ఐపీఎల్‌తో షైమరిచిన క్రికెట్ ప్రేమికుల ముందుకు మరో అద్భుత సమరం రాబోతోంది. సుదీర్ఘ ఫార్మాట్‌కు తలమానికంగా నిలిచే ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో నేటి నుంచి జరిగే అంతిమ సమరంలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా రెండోసారి ఈ తుది పోరుకు అర్హత సాధించిన కమిన్స్ సేన అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. ఈసారీ అదిరే ప్రదర్శనతో మరో డబ్ల్యూటీసీ టైటిల్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అటు ఊహించని రీతిలో తుది పోరుకు అర్హత సాధించిన సఫారీలు తొలి ఐసీసీ టైటిల్‌ను దక్కించుకునేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అలాగే రెండు దేశాలు కూడా తమ తుది జట్లను ఇదివరకే ప్రకటించాయి.

అనుభవం అండగా..: ఆసీస్ జట్టులో చాలామంది ఆటగాళ్లకు చివరి ఫైనల్లో ఆడిన అనుభవముంది. అందుకే ఒత్తిడిని తట్టుకుని చాంపియన్‌గా ఎలా నిలవాలో వారికి తెలుసు. ఓపెనర్‌గా ఖవాజాకు తోడు తొలిసారి లబుషేన్‌ను ఆడించనున్నారు. అలాగే కామెరూన్ గ్రీన్ వన్‌డౌన్‌లో సత్తా చాటాలనుకుంటున్నాడు. ఇక స్టీవ్ స్మిత్ నిలకడ, హెడ్ దూకుడు జట్టుకు బలం కానున్నాయి. అలాగే బౌలింగ్‌లో పేస్ త్రయం స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్‌లతో పాటు స్పిన్నర్ నాథన్ లియోన్‌ను అడ్డుకోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు సవాలే. ఈ నలుగురు కలిపి మొత్తం 1508 టెస్టు వికెట్లు తీయడం విశేషం. కమిన్స్ మరో ఆరుగురిని అవుట్ చేస్తే కెరీర్‌లో 300 వికెట్లు పూర్తి చేస్తాడు.

ఒత్తిడిని జయిస్తేనే..: దక్షిణాఫ్రికా జట్టులో మార్‌క్రమ్, కెప్టెన్ బవుమాలకు మాత్రమే ప్రస్తుత ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్న అనుభవముంది. కానీ స్టబ్స్, రికెల్టన్ మాత్రం ఐపీఎల్‌లో ఆసీస్ పేసర్లను ఆడారు. సఫారీల బ్యాటింగ్ భారం కూడా ఈ నలుగురిపైనే ఉంది. సీనియర్ పేసర్ రబాడ ఇటీవల డోపింగ్ వివాదంలో ఇరుక్కున్న విషయం తెలిసిందే. తాజా ఫైనల్లో అతడిపైనే అందరి దృష్టి నిలువనుంది. లార్డ్స్‌లో ఆడిన చివరి టెస్టులో అతడు ఇంగ్లండ్‌ను దెబ్బతీశాడు. అదే ఊపును ఈసారీ కొనసాగిస్తే ఆసీస్‌కు కష్టకాలమే. ఎన్‌గిడి, యాన్సెన్ ఇతర పేసర్లు కాగా.. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ప్రభావం చూపాలనుకుంటున్నాడు.

తుది జట్లు

ఆస్ట్రేలియా: ఖవాజా, లబుషేన్, గ్రీన్, స్మిత్, హెడ్, వెబ్‌స్టర్, క్యారీ, కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, రికెల్టన్, ముల్డర్, బవుమా (కెప్టెన్), స్టబ్స్, బెడింగ్‌హమ్, వెరెయిన్, యాన్సన్, కేశవ్, రబాడ, ఎన్‌గిడి.

ఎలవెనిల్ గోల్డెన్ షూట్

ప్రపంచకప్‌లో పసిడి కైవసం



మ్యూనిచ్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌ను భారత్ ఘనంగా ప్రారంభించింది. మంగళవారం ఇక్కడ మొదలైన ఈ మెగా టోర్నీలో భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ పతకం కొల్లగొట్టింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. ఫైనల్స్‌లో 25 ఏళ్ల ఎలవెనిల్ 231.2 పాయింట్లు షూట్ చేసి మూడో స్థానంతో పోడియం ఫినిష్ చేసింది. చైనా షూటర్ వాంగ్ జీఫీ (252.7) స్వర్ణం, కొరియాకు చెందిన క్వాన్ ఎన్‌జి (252.6) రజతం గెలుచుకున్నారు. ఇక, మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ క్వాలిఫికేషన్స్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ నాలుగో స్థానంలో నిలవగా.. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాల విజేత మనూ భాకర్ 12వ స్థానానికి పరిమితమైంది.

పూరన్ అనూహ్య రిటైర్మెంట్

విండీస్ స్టార్ సంచలన నిర్ణయం



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 29 ఏళ్ల వయస్సులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించాడు. టీ20ల్లో పూరన్ అత్యంత దూకుడుగా ఆడే బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2016లో అరంగేట్రం చేయగా, విండీస్ తరఫున ఎక్కువ పరుగులు (106 టీ20ల్లో 2,275) సాధించిన రికార్డు నెలకొల్పాడు. గతేడాది పొట్టి ఫార్మాట్‌లో ఎక్కువ సిక్సర్లు (170) బాదిన ఘనత కూడా అతడిదే. అలాగే ఇటీవలి ఐపీఎల్‌లోనూ లఖ్‌నవూ తరఫున 500+ రన్స్ సాధించడమే కాకుండా 40 సిక్సర్లతో టాప్‌లో నిలిచాడు. అయితే అతడి విజ్ఞప్తి మేరకు తాజా ఇంగ్లండ్, ఐర్లండ్‌లతో సిరీస్‌లకు విశ్రాంతినిచ్చారు. ఇంతలోనే అందరినీ ఆశ్చర్యపరుస్తూ వీడ్కోలు ప్రకటించాడు. 'చాలా ఆలోచించాకే క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నా' అని పూరన్ తెలిపాడు. 2022లో విండీస్ పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా పూరన్ బాధ్యతలు తీసుకున్నా.. అదే ఏడాది టీ20 మెగా టోర్నీ తొలి రౌండ్‌లోనే జట్టు నిష్క్రమించడంతో రాజీనామా చేశాడు. విండీస్ తరఫున టెస్టులు ఆడలేకపోయిన పూరన్ 61 వన్డేల్లో 1,983 పరుగులు చేశాడు.

కౌంటీల్లో రుతురాజ్



లీడ్స్ (ఇంగ్లండ్): ప్రస్తుతం భారత్-ఎ జట్టుతో కలిసి ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న టీమిండియా యువ క్రికెటర్ రుతురాజ్ గైక్వాడ్ త్వరలోనే అక్కడ కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఆడనున్నాడు. ఇంగ్లండ్ కౌంటీల్లోని యార్క్‌షైర్ జట్టుతో రుతురాజ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌తో భారత్-ఎ జట్టు ఆడిన రెండు అనధికారిక టెస్టుల్లో రుతురాజ్‌కు తుదిజట్టులో ఆడే అవకాశం దక్కలేదు. ఈనెల 13 నుంచి 16 వరకు భారత సీనియర్ జట్టుతో నాలుగురోజుల మ్యాచ్ ఆడతాడు. ఆ తర్వాత యార్క్‌షైర్ జట్టుతో చేరనున్న రుతురాజ్.. అక్కడి కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఐదు మ్యాచ్‌ల్లో పాల్గొంటాడు. ఆ తర్వాత వన్డే కప్‌లోనూ ఆడతాడు.

ఎంతో కలచివేసింది..

బెంగళూరు దుర్ఘటనపై ద్రవిడ్



న్యూఢిల్లీ: భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద ప్రమాదమైన చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట ఘటనపై టీమిండియా మాజీ చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్పందించాడు. ఐపీఎల్ విజేత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయోత్సవం సందర్భంగా జరిగిన ఈ ఘటనలో పదకొండు మంది అభిమానులు చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నాడు. 'క్రీడలను ఎంతగానో ప్రేమించే నగరం బెంగళూరు. నేను అక్కడినుంచే వచ్చాను. అక్కడి ప్రజలు క్రికెట్‌నే కాదు.. ఫుట్‌బాల్, కబడ్డీ ఇలా ఏ క్రీడకైనా మద్దతిస్తారు. అలాంటి నగరంలో ఈ దుర్ఘటన జరగడం చాలా బాధిస్తోంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నా' అని ఓ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ద్రవిడ్ తెలిపాడు.

సత్తా చాటిన ప్రియాంక



న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్ ప్రియాంక గోస్వామి ఈ సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆస్ట్రియాలోని ఇన్స్‌బ్రక్‌లో జరిగిన రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్ మహిళల 10 కిలోమీటర్ల ఈవెంట్‌లో అగ్రస్థానం సాధించింది. రేస్‌ను ప్రియాంక 47 నిమిషాల 54 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ప్రత్యేక సెట్

» జూలై 6న ఏపీఎన్‌సెట్ నిర్వహణ

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇకపై డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఏపీఎన్‌సెట్ నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది వరకూ ఎంసెట్ ర్యాంక్‌ల ఆధారంగా సీట్లు కేటాయింపు చేసేవారని, ఈ ఏడాది నుంచి ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ కోర్సుల్లో చేరాలంటే కచ్చితంగా హెల్త్ వర్సిటీ నిర్వహించే ప్రవేశపరీక్ష రాయాలని, అందులో అర్హత సాధిస్తేనే సీటు కేటాయింపులు జరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే నోటిఫికేషన్‌ను విడుదల చేశామని తెలిపారు. జూన్ 20 సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. జూలై 6న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ఇంటర్, బైపీసీ కోర్సులు చదివిన విద్యార్థులు అర్హులని, పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచనట్లు వివరించారు.

శాప్ బోర్డుకు 8మంది సభ్యుల నియామకం

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు ఎనిమిది మంది సభ్యులను నియమిస్తూ క్రీడాశాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శాప్ చైర్మన్‌గా తిరుపతికి చెందిన రవినాయుడును ప్రభుత్వం ఇప్పటికే నియమించినా, సభ్యులను నియమించలేదు. తాజాగా నియమించిన సభ్యుల జాబితాలో ఇ.రజని, ఎ.రమణరావు, ఎం.డి.రమేష్‌కుమార్, ప్రేమ రవీంద్రనాథ్, ఎస్.సంతోష్‌కుమార్, కె.జగదీశ్వరి, బి.శివ, పి.బి.వి.ఎస్.ఎన్.రాజు ఉన్నారు. వీరితో పాటు శాప్ ఎండీ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఉంటారు. బోర్డు ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్సీ గ్రూపు వివరాలివ్వండి: ఏపీపీఎస్సీ

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ జీవో విడుదల చేసిన నేపథ్యంలో వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ అభ్యర్థులు వారి గ్రూపు వివరాలను సమర్పించాలని ఏపీపీఎస్సీ సూచించింది. ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఓటీపీఆర్ ద్వారా లాగిన్ అయ్యి ఏ గ్రూపులో ఉన్నారనే వివరాలు ఇవ్వాలని కార్యదర్శి రాజాబాబు కోరారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ ఆఫీసర్ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష జూలై 15 తర్వాత నిర్వహిస్తామని తెలిపారు. ఆ పోస్టులకు సిలబస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

కార్పొరేట్‌ను ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ అవార్డులు: ఎస్ఎఫ్ఐ

టెన్త్, ఇంటర్ టాపర్లకు ఇటీవల ఇచ్చిన షైనింగ్ స్టార్స్ అవార్డులు కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించేలా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామ్మోహన్‌రావు, కె.ప్రసన్నకుమార్ విమర్శించారు. టెన్త్‌లో 4168 మందికి అవార్డులు ఇస్తే వారిలో మూడు వేల మందికిపైగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివినవారే ఉన్నారని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాధాన్యతను తగ్గించడమేనని, దీని వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఇంకా తగ్గే ప్రమాదం ఉందన్నారు. షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రభుత్వ బడులను ప్రోత్సహించేలా ఉండాలన్నారు.

మారిటైమ్ బోర్డు టెండర్ల అధ్యయనానికి కమిటీ

ఏపీ మారిటైమ్ బోర్డు కార్యాచరణ ప్రగతిలో భాగంగా పిలిచే టెండర్ల పరిశీలన, అధ్యయనం, మూల్యాంకనం చేసేందుకు వీలుగా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ మౌలిక సదుపాయాలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వు జారీ చేశారు. ఈ కమిటీలో పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరు ఇన్ చీఫ్, ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీరు, ఏపీఎంబీ చీఫ్ ఇంజనీరు, ఇన్‌క్యాప్ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్), రోడ్లు భవనాల శాఖ కమీషనర్ ఆఫ్ టెండర్స్ చీఫ్ ఇంజనీరు, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ, ఏపీఐఐసీ లీగల్ అడ్వయిజర్, ఇద్దరు ఐఐటీ (అకడమిక్) సభ్యులుగా ఉంటారు.

వీరికి బదిలీలుండవా!

» ఏళ్ల తరబడి ఎన్‌హెచ్ఎంలోనే తిష్ట

» పదేళ్లుగా ఓ మహిళా డాక్టర్ విధులు

» ఆరేళ్లు దాటినా కదలని అధికారులు

» పదోన్నతులు వచ్చినా ఇక్కడే పోస్టింగ్

» బదిలీలను పట్టించుకోని ఆరోగ్యశాఖ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపడుతుంది. ఒకచోట ఐదేళ్ల సర్వీస్ దాటిన వారిని తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. అయితే ఆరోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిస్థితి మాత్రం దీనికి భిన్నం. ఎన్‌హెచ్ఎంలో కొంత మంది డాక్టర్లు, గ్రూప్-1 అధికారులు బదిలీ కాకుండా ఏళ్ల తరబడి పాతుకుపోయారు. ఒక మహిళా డాక్టర్ అయితే దాదాపు పదేళ్ల నుంచి ఎన్‌హెచ్ఎంలోనే తిష్టవేశారు. ఒక డెంటల్ డాక్టర్‌తో పాటు మరో ముగ్గురు సీనియర్ వైద్యులు కూడా ఆరేడేళ్ల నుంచి ఎన్‌హెచ్ఎంను వీడడం లేదు. మరొక గ్రూప్-1 అధికారి ఆరేళ్లుగా ఇక్కడే పాతుకుపోయారు. సాధారణ బదిలీల సమయంలో ప్రభుత్వం ఎన్‌హెచ్ఎంను సరిగా పట్టించుకోకపోవడంతో సదరు వైద్యులు, అధికారులు ఇక్కడి నుంచి ఎటూ కదలడం లేదు. దీంతో ఎన్‌హెచ్ఎంలో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అనే పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశాఖ కమిషనర్లు, ఎండీలు మారినా వీరు మాత్రం కదలడం లేదు. పైగా కొత్త కమిషనర్‌గా, ఎండీగా ఎవరు వచ్చినా వీరు చెప్పిందే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి డాక్టర్లు కచ్చితంగా పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించాలి. కానీ.. ఎన్‌హెచ్ఎంకు వచ్చిన వైద్యులెవరూ పీహెచ్‌సీలకు, డీఎంహెచ్‌వో కార్యాలయాలకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. ఒక్కసారి ఎన్‌హెచ్ఎంకు వచ్చామంటే ఇక పదేళ్ల పాటు ఇక్కడే ఉండిపోవచ్చన్న భావన వారిలో కనిపిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌హెచ్ఎంలో విధులు నిర్వహించే వైద్యులు, అధికారులకు పదోన్నతులు వచ్చినా తిరిగి అక్కడే పోస్టింగ్ తీసుకుంటున్నారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా ఎన్‌హెచ్ఎంలో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీలు చేయడం లేదు. కొంత మందికి పదోన్నతులు కల్పించి మరీ ఎన్‌హెచ్ఎంలో కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది బదిలీల్లో ఐదేళ్ల దాటిన వారిని కచ్చితంగా బదిలీ చేస్తామని ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరి ఈ నిబంధన ఎన్‌హెచ్ఎంలో తిష్టవేసిన వారికి వర్తించవా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పుడైనా వారిని బదిలీ చేస్తారో.. లేక ఎప్పటిలాగే ఇక్కడే కొనసాగిస్తారో వేచి చూడాలి.

డీడీలు, ఏడీలనూ బదిలీలు చేయాలి...

మరోవైపు ఆరోగ్యశాఖలో డిప్యూటీ డైరెక్టర్లు (డీడీ), అసిస్టెంట్ డైరెక్టర్ల (ఏడీ)ది కీలక పాత్ర. డీఎంఈ, డీహెచ్, సెకండరీ హెల్త్‌తో పాటు మిగిలిన విభాగాల్లో ఈ కేడర్ అధికారులు కీలకంగా వ్యవహరిస్తారు. కొన్నేళ్ల నుంచి ప్రధాన కార్యాలయాల్లో విధులు నిర్వహించే డీడీ, ఏడీలు హెడ్‌క్వార్టర్ విడిచి పెట్టడం లేదు. దీంతో జిల్లాల్లో విధులు నిర్వహించే డీడీ, ఏడీలకు ప్రధాన కార్యాలయాల్లో విధులు నిర్వహించే అవకాశం రావడం లేదు. ఈ సారి బదిలీల్లో ప్రధాన కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారిని జిల్లాలకు పంపించి, జిల్లాల్లో పనిచేసే వారికి ప్రధాన కార్యాలయాల్లో అవకాశం కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచన చేయాలన్న సూచనలు వస్తున్నాయి.

తన్మయి హత్యపై నివేదిక ఇవ్వండి

» 3 రోజుల్లోగా ఇవ్వాలంటూ డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ లేఖ

» హత్య కేసును సుమోటోగా స్వీకరించిన కమిషన్

న్యూఢిల్లీ, అనంతపురం క్రైం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి (19) దారుణహత్య వంటి హింసాత్మక ఘటనలు మానవ హక్కుల ఉల్లంఘన మాత్రమే కాకుండా మహిళల భద్రతను, వారి గౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని జాతీయ మహిళా కమిషన్ వ్యాఖ్యానించింది. తన్మయి హత్యపై మీడియాలో కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకున్న కమిషన్ ఘటనపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ మంగళవారం లేఖ రాశారు. దర్యాప్తు పురోగతి, అరెస్టులు, ప్రస్తుత పరిస్థితులతో సహా వివరాలన్నీ ఉండాలని సూచించారు. నిందితులపై త్వరితగతిన, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిందితుడు అరెస్టు..: ఎస్పీ

తన్మయి హత్య కేసులో నిందితుడు కురుబ నరేశ్‌ని అరెస్టు చేశామని అనంతపురం ఎస్పీ జగదీష్ వెల్లడించారు. మంగళవారం ఆయన కేసు వివరాలు వెల్లడించారు. నరేశ్‌కు గతంలోనే వివాహమైందని, అయినా రెండో పెళ్లి చేసుకోవాలని తన్మయి ఒత్తిడి చేసిందని తెలిపారు. ఇది ఇష్టం లేకే నరేశ్.. ఆమెను హత్య చేశాడని వెల్లడించారు. అనంతపురం శివారులోని రామకృష్ణ కాలనీకి చెందిన ఎరుకల లక్ష్మీపతి కుమార్తె తన్మయికి, అనంతపురంలోని ఆరో రోడ్డుకు చెందిన నరేశ్‌కు మూడు నెలల క్రితం పరిచయమై, ప్రేమగా మారింది. నెల నుంచి తన్మయి పెళ్లి చేసుకోవాలని నరేశ్‌ను కోరుతోంది. ఈ నెల 3వ తేదీ రాత్రి కూల్‌డ్రింక్స్ కోసమని బయటకు వెళ్లిన తన్మయి తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు 4న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 7న తన్మయి శవమై కనిపించింది. దీంతో నరేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే ఈ హత్య చేసినట్లు అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. కాగా, తన్మయి మిస్సింగ్ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం చూపిన అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌పై సస్పెన్షన్ వేటు పడింది.

మామిడి గుజ్జు ధరల నిర్ణయానికి కమిటీ

అమరావతి, జూన్10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మామిడి గుజ్జు పరిశ్రమ, మామిడి రైతుల ప్రయోజనం కోసం అమ్ముడుపోని మామిడి గుజ్జును సరసమైన ధరలకు విక్రయించడానికి ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత సీజన్‌లో మామిడి ధరల తగ్గుదల నుంచి రైతులకు ఉపశమనం కలిగించేందుకు.. పార్లే ఆగ్రో, కోకో-కోలా, పెప్సీ-కో కంపెనీలతో సంప్రదింపులు జరిపి, సరసమైన ధరకు మామిడి గుజ్జు అమ్మకాలకు ఈ కమిటీ చర్యలు తీసుకోనుంది.

ఎరువులకు 'లింక్'లు పెడితే చర్యలు: అగ్రి డైరెక్టర్

ఎరువుల కంపెనీలు, హోల్‌సేల్ వ్యాపారులు తమ ఉత్పత్తుల కొనుగోలుకు రిటైల్ వ్యాపారులకు లింక్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు హెచ్చరించారు. మంగళవారం మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులు, ఎరువుల వ్యాపారులతో మాట్లాడారు. ఈ ఏడాది 25% రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్న సీఎం సూచనలకు అనుగుణంగా నానో ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు.

చంద్రబాబు విజనరీ: యూపీ సీఎం

» మంత్రి నారాయణ బృందం లక్నో పర్యటన

» వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లపై అధ్యయనం



ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి నారాయణ

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. రాష్ట్రంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల ఏర్పాటుపై అధ్యయనం కోసం మంగళవారం మంత్రి పి.నారాయణతో పాటు అధికారుల బృందం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో పర్యటించింది. అక్కడి సీఎం నివాసంలో ఆయనతో మంత్రి నారాయణ బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఏపీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం ఉపయోగిస్తున్న పద్ధతులను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు మంత్రి వివరించారు. అంతకు ముందు లక్నోలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను క్షేత్రస్థాయిలో మంత్రి బృందం పరిశీలించింది. ఘనవ్యర్థాల నిర్వహణపై లక్నో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి బృందానికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్‌శాఖ ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా ఇప్పటికే రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనుండగా, ఇతర రాష్ట్రాల్లో వ్యర్థాల నిర్వహణను ఏ విధంగా చేస్తున్నారో అధ్యయనం చేసేందుకు మంత్రి బృందం పర్యటిస్తోంది. సాయంత్రం పుణె సమీపంలో ఉన్న పింప్రి చించివాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలించారు.



ఎలక్ట్రిక్ ట్రాక్టర్ వచ్చేసింది!

» ఏపీ ఆగ్రోస్ ఆధ్వర్యంలో మోంత్ర కంపెనీ డెమో

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బైక్, ఆటో తరహాలో ఇప్పు డు ట్రాక్టర్లు కూడా మార్కెట్లోకి వచ్చేశాయి. చెన్నైలోని మోంత్ర ఎలక్ట్రిక్ కంపెనీ వీటిని తయారు చేసింది. ఏపీ ఆగ్రోస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉండవల్లి వద్ద పొలాల్లో డెమో నిర్వహించింది. 23 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఉండే ఈ ఎలక్ట్రికల్ ట్రాక్టర్‌కు 3-4గంటలు కరెంట్ చార్జింగ్ పెడితే.. 8-10గంటలు పని చేస్తుంది. బ్యాటరీకి ఆరేళ్ల వారెంటీ ఉంది. గరిష్ఠ విద్యుచ్ఛక్తి 27హెచ్‌పీతో 2డబ్ల్యూడీ, 4డబ్ల్యూడీతో ఈ ట్రాక్టర్లు ఉన్నాయి. డీజిల్ ట్రాక్టర్‌కు రూ.100ఖర్చయితే.. ఎలక్ట్రికల్ ట్రాక్టర్‌కు రూ.30 ఖర్చవుతుంది. రూ.12లక్షల విలువైన ఈ ఎలక్ట్రికల్ ట్రాక్టర్లను హరియాణా, మహారాష్ట్ర ప్రభుత్వాలు 50% సబ్సిడీతో అక్కడి రైతులకు ఇస్తున్నాయి. అన్ని నేలల్లో సాగుకు ఉపయోగపడే ఈ ఎలక్ట్రికల్ ట్రాక్టర్లను రాయితీపై మన రైతులకు కూడా ఇస్తే సాగు ఖర్చులు తగ్గుతాయని ఏపీ ఆగ్రోస్ భావిస్తోంది.


చిత్రజ్యోతి

SINCE 1965

ఉస్తాద్ సెట్స్‌లో పవన్



ఇటీవలే 'హరిహర వీరమల్లు' చిత్రం డబ్బింగ్ పనులు ముగించారు పవన్ కల్యాణ్. ఇప్పుడు ఆయన 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ మంగళవారం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో మొదలైంది. పవన్‌కల్యాణ్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. నెల రోజుల పాటు ఈ షెడ్యూల్ సాగనుంది. ఈ చిత్రంలో పవన్‌కు జోడీగా శ్రీలీల నటిస్తున్నారు. గతంలో పవన్‌కల్యాణ్‌తో 'గబ్బర్‌సింగ్' లాంటి బ్లాక్‌బస్టర్‌ను తెరకెక్కించిన హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయనంక బోస్.




ట్రైలర్ రిలీజ్ అప్పుడే

మంచు విష్ణు ప్రధాన పాత్రలో ముకేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'కన్నప్ప' ట్రైలర్‌ను ఈనెల 13న విడుదల చేస్తున్నారు. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. ఈనెల 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పరమ శివుని భక్తుడైన కన్నప్ప జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో మంచు విష్ణు టైటిల్ రోల్ పోషించగా, మోహన్ బాబు, ప్రభాస్, శరత్‌కుమార్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ వంటి అగ్రతారలు కీలక పాత్రల్లో నటించారు.

అంకెలతో పనిలేదు... అర్థం చేసుకుని ముందుకు సాగడమే!

నందమూరి బాలకృష్ణ



తానేంటో రాబోయే రోజులలో చూస్తారని, పట్టుదలతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు నందమూరి బాలకృష్ణ తెలిపారు. ఆయన 65వ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహించారు. సంస్థ ఆవరణలో ఉన్న దివంగత నందమూరి తారక రామారావు, బసవతారకం విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భారీ కేక్ కట్ చేసి క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు తినిపించారు. ఆ తర్వాత క్యాన్సర్ చికిత్స తీసుకొంటున్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఎటు అడుగు వేసినా ఆ పనిని ప్రేమించి చేయడం నాకు అలవాటు. వయసు కేవలం ఒక నంబర్ మాత్రమే. నా వయసు అందరికీ తెలిసిందే. తల్లితండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. నాకు అంకెలతో పని లేదు. నన్ను నేను అర్థం చేసుకుని ముందుకు వెళుతుంటా. ఎప్పటికప్పుడు నా మెదడుకు సాన పెడుతుంటా. తద్వారా పనిలో కొత్తదనాన్ని చూపే ప్రయత్నం చేస్తుంటా. నాన్నగారి కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశా. మెడిసిన్ చదవలేదు కానీ సినిమాల్లో డాక్టర్ పాత్రలు పోషించా. పదిహేనేళ్ల క్రితం ఈ ఆస్పత్రి బాధ్యతలు చేపట్టా. మా అమ్మగారి ఆశయాన్ని నెరవేర్చగలగడం పూర్వజన్మ సుకృతం. ఈ ఆస్పత్రి ఒక దేవాలయం లాంటిది. ఇక్కడ పని చేస్తున్న వారందరూ భగవంతునితో సమానం. నాకు పద్మభూషణ్ పతకం సినిమా పరంగా ఇచ్చినా దానికి ప్రధాన కారణం బసవతారకం ఆస్పత్రి ద్వారా చేస్తున్న పలు మంచి కార్యక్రమాలే అని భావిస్తున్నా' అని అన్నారు. ఈ సమావేశం తర్వాత తన అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అభిమానులు, రోగులతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. కొత్తగూడెం త్రివేణి స్కూలు యాజమాన్యం, పిల్లలు క్యాన్సర్ రోగుల చికిత్స కోసం అందించిన రూ. 1,01,016 ప్రత్యేక విరాళాన్ని వారి నుంచి స్వీకరించారు. ఇటీవల తనకు భారత ప్రభుత్వం అందజేసిన పద్మభూషణ్ పతకాన్ని ధరించి నందమూరి బాలకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

నిమిషానికి రూ. నాలుగు కోట్లు!



బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఆయన తీసుకునే పారితోషికం గురించిన ఓ వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో 2022లో విడుదలై సంచలన విజయం సాధించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఆ చిత్రంలో ఓ అతిథి పాత్రలో అజయ్ దేవగణ్ నటించిన విషయం తెలిసిందే. ఇందులో స్వాతంత్ర్యం కోసం పోరాడే వీరుడి పాత్రలో ఆయన ఎనిమిది నిమిషాల పాటు కనిపించారు. ఇంత చిన్న నిడివి ఉన్న పాత్ర కోసం ఆయన సుమారు రూ.35 కోట్లను నిర్మాతల ముక్కు పిండి వసూలు చేశారట. అంటే నిమిషానికి రూ.నాలుగు కోట్లపైనే. ఇది విన్న నెటిజన్లు షాక్ అవుతున్నారు. నిమిషాల పరంగా చూస్తే దేశంలో అత్యధిక పారితోషికం తీసుకున్న నటుడు ఆయనే అని లెక్కలు వేస్తున్నారు. అలాగే, ఓటీటీ పరంగానూ రికార్డు స్థాయిలో పారితోషికం తీసుకున్న ఘనత అజయ్ దేవగణ్ సొంతం. 2021లో విడుదలైన 'రుద్ర' అనే సిరీస్‌లో నటించడానికి ఆయన రూ.125 కోట్లు తీసుకున్నారని సమాచారం. అలాగే, సినిమా స్థాయిని బట్టి ఆయన తీసుకునే పారితోషికం మారుతుందట. భారీ బడ్జెట్ సినిమాకైతే రూ.40 కోట్లు.. తక్కువ స్థాయి బడ్జెట్‌లో తెరకెక్కే చిత్రాలకు రూ.20 కోట్ల వరకూ తీసుకుంటారట.

ఎన్టీఆర్‌లో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉంది

- కాస్ట్యూమ్స్ డిజైనర్ అనైతా





జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ కలసి నటించిన 'వార్ 2' చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్‌తో అంచనాలు అమాంతం పెరిగాయి. సినిమాలో ఎన్టీఆర్ లుక్, స్టైలింగ్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. 'వార్ 2' చిత్రానికి అనైతా ష్రాఫ్ అడజానియా కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేశారు. సినిమాలో ఆయన లుక్, ఇతర విషయాల గురించి అనైతా వివరిస్తూ 'ఎన్టీఆర్‌తో తొలిసారిగా కలసి పనిచేయడం ఆనందంగా అనిపించింది. ఆయన సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తే ఆ ఎనర్జీ అందరిలోకి ప్రవేశిస్తుంది. ఆయనలో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉంది. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆయన ఎంతో ఉల్లాసంగా ఉంచుతారు. 'వార్ 2'లో ఆయన పోషిస్తున్న పాత్రలో ఎన్నో రకాల లేయర్స్ ఉంటాయి. అందుకే చాలా లుక్స్ డిజైన్ చేశాం. ఆయన పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించేలా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాం. ఓ లక్ష్యంతో పని చేసే మానవ యంత్రంలా ఆయన్ని చూపించే ప్రయత్నం చేశాం' అన్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా 'వార్ 2' చిత్రాన్ని నిర్మించారు.

ప్రేమ గొప్పదనాన్ని చాటేలా...



యశ్‌రాజ్ ఫిల్మ్స్ బేనర్‌పై మోహిత్ సూరి తెరకెక్కిస్తోన్న కొత్త తరం ప్రేమ కథ 'సయరా'. జూలై 18న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రం ద్వారా ఆహాన్ పాండే హీరోగా పరిచయం అవుతున్నారు. అనీత్ పద్దా కథానాయిక. తాజాగా ఈ చిత్రం నుంచి 'బర్బాద్' అంటూ సాగే రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు దిరిష్ సాహిత్యాన్ని అందించడంతోపాటు బాణీని సమకూర్చగా, జుబిన్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మోహిత్ మాట్లాడుతూ 'రొమాంటిక్ పాటలకు లోతైన భావం ఉంటుంది. అలాంటి పాటలకు గతంలోకి తీసుకెళ్లే శక్తి ఉంటుంది. ఈ పాట ప్రేమ, ప్రేమికుల గొప్పదనాన్ని చాటేలా ఉంటుంది' అని అన్నారు.

ప్రేమతో.. మానుషీ



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రంతో తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నారు మాజీ విశ్వ సుందరి మానుషీ చిల్లర్. ఆమె ప్రస్తుతం బాలీవుడ్‌లో రాజ్‌కుమార్ రావు కథానాయకుడిగా పులకిత్ తెరకెక్కిస్తున్న 'మాలిక్' చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. రాజ్‌కుమార్ రావును ఆమె ప్రేమతో చూస్తున్న ఈ ఫొటో ఆకట్టుకునేలా ఉంది. ఇందులో ఆమె పోషిస్తున్న రోల్ మునుపటి చిత్రాల్లో కంటే భిన్నంగా ఉండనుందని మేకర్స్ తెలిపారు. జూలై 11న చిత్రం విడుదలవుతోంది. కాగా, జాన్ అబ్రహం నటిస్తున్న 'తెహ్రాన్' చిత్రంలోనూ మానుషీ చిల్లర్ నటిస్తున్నారు.



నా మనసుకు దగ్గరైన సినిమా

ధనుష్

"కుబేర' నా కెరీర్‌లో ప్రత్యేక చిత్రం. నా మనసుకు దగ్గరైన సినిమా. ఈ సినిమా షూటింగ్ ఓ మరపురాని అనుభవం. నాగార్జునతో కలసి పనిచేయడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సినిమాలో బిచ్చగాడి పాత్ర చేశాను. ఈ పాత్ర కోసం నేను ముందస్తుగా సన్నద్ధమవ్వలేదు. మా దర్శకుడు శేఖర్ కమ్ముల చెప్పింది చేశా. ఆయనో అద్భుతమైన దర్శకుడు. డంపింగ్ యార్డ్ సన్నివేశాలు చేసేటప్పుడు సైతం రష్మిక ఎలాంటి ఇబ్బంది లేకుండా నటించడం చూసి ఆశ్చర్యపోయాను. ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని హీరో ధనుష్ అన్నారు. ఈ నెల 20న కుబేర విడుదలవుతోంది. ఈ సందర్భంగా ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం 'పీ పీ డుమ్ డుమ్' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన నాగార్జున మాట్లాడుతూ '15 ఏళ్లుగా శేఖర్‌తో సినిమా చేయాలనుకుంటున్నాను. 'కుబేర'తో తీరింది. ధనుష్, రష్మిక ప్రతిభావంతులైన కళాకారులు. చాలా గొప్పగా నటించారు. సినిమా ఘన విజయం అందుకుంటుంది' అని చెప్పారు. రష్మిక మాట్లాడుతూ 'నటిగా 'కుబేర' విభిన్నమైన అనుభూతిని ఇచ్చింది. నా పాత్ర ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తుంది. అభిమానుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని తెలిపారు. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్‌మోహన్ నిర్మించారు.

అలరించే హారర్ థ్రిల్లర్



మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'నిశ్శబ్ద'. రమణమూర్తి తంగెళ్లపల్లి దర్శకత్వంలో ఎం.శ్రీనివాస్, సంధ్యారాణి నిర్మిస్తున్నారు. ఈ హారర్ థ్రిల్లర్ చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. మంగళవారం నిర్మాత శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 'కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వాలనే లక్ష్యంతో శ్రీ రిషి సాయి ప్రొడక్షన్స్ స్థాపించాను. త్వరలో 'నిశ్శబ్ద' విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. రమణమూర్తి మాట్లాడుతూ 'షూటింగ్ మొత్తం రాత్రివేళల్లో చేశాం. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు.



రాష్ట్ర వేడుకగా ఏడాది పండుగ

- సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్ పేరిట ఉత్సవాలు
- రేపు సాయంత్రం అమరావతిలో భారీ సభ
- వేడుకల్లో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలి
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'సుపరిపాలన-స్వర్ణాంధ్రప్రదేశ్' పేరుతో నిర్వహించే ఈ వేడుకల్లో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు భాగస్వాములు కావాలని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 5 గంటలకు అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖలను ఆదేశించారు. కాగా... కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పాలుపంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఆయన మంగళవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం అమరావతిలో జరిగే ఎన్డీయే బహిరంగ సభను విజయవంతం చేయాలని.. అందరూ పాల్గొనాలని సూచించారు.

ఎమ్మెల్యే సారూ...

కాస్త తగ్గాలి మీరు!

రియల్ వ్యాపారే షాడో ఎమ్మెల్యే

కర్నూలు జిల్లాలోని ఓ ఎమ్మెల్యేకు 'కృతజ్ఞతాభావం' కాస్తంత ఎక్కువే. తనకు ఎన్నికల్లో సాయం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి నియోజకవర్గాన్ని రాసిచ్చేశారు. అధికారుల బదిలీలు, పనుల కేటాయింపులు ఏవైనా సదరు వ్యాపారి సిఫారసు చేయాల్సిందే. ఇంత కాలం స్థిరాస్తి వ్యాపారం చేసుకున్న ఆయన.. ఇప్పుడు రాజకీయ వ్యాపారం ప్రారంభించి షాడో ఎమ్మెల్యేగా తయారయ్యారు. ప్రతి పనికో రేటు నిర్ణయించి వసూళ్లకు దిగారు. వైసీపీ రౌడీ గ్యాంగ్‌లను టీడీపీలో చేర్చుకున్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని కూడా ఎన్నికలకు వారం రోజుల ముందు పార్టీలో చేరిన వైసీపీ వ్యక్తికి కట్టబెట్టారు. కొత్తగా చేరిన వైసీపీ వారికే పార్టీలో ప్రాధాన్యం పెరుగుతోందని టీడీపీ కార్యకర్తలు రగిలిపోతున్నారు. పార్టీ కోసం పనిచేసిన సీనియర్ లీడర్లనూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ షాడో ఎమ్మెల్యే తీరుపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

పెత్తనమంతా భర్తదే..

నంద్యాల జిల్లాకు చెందిన మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఆమె భర్తదే హవా. మట్టి అక్రమ రవాణా, ఇసుక దోపిడీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి పనికీ ఓ రేటు పెట్టి వసూలు చేస్తారన్న పేరుంది. ఈమె భర్త తీరు కారణంగా జిల్లాలో సొంత పార్టీలోనే ఏకాకిగా మిగిలారు. అత్యంత కీలకమైన డెయిరీ ఛైర్మన్ పీఠంపై తన కుటుంబ సభ్యుడిని కూర్చోబెట్టాలన్న ఈమె ప్రయత్నాలను ఉమ్మడి జిల్లాలో మిగిలిన ఎమ్మెల్యేలు, మంత్రులు అడ్డుకుంటున్నారు.

ఇస్తారా.. లాక్కోనా..?

అనంతపురం జిల్లా నుంచి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేపై అటు ప్రజల్లో, ఇటు కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ప్రతి పనికీ రేటు పెట్టి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వివాదాస్పద భూములను, ఇతరులు పాడుకున్న మద్యం షాపులను బెదిరించి మరీ లాక్కున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇతరులు నిర్వహిస్తున్న మద్యం షాపుల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. మెడికల్ ఏజెన్సీలు, పీడీఎస్ బియ్యం.. దేనినీ వదలరని ఈయనకు పేరు.

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ దానినే గుర్తు చేస్తున్నారు.

గుమ్మనంగా దోపిడీ

అనంతపురం జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యే సరిగ్గా ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ తెచ్చుకుని విజయం సాధించారు. నియోజకవర్గం మొత్తం ఈయన సోదరుల గుప్పిట్లో ఉంటుంది. పేకాట శిబిరాలు, బెంగళూరుకు ఇసుక అక్రమ తరలింపు, మద్యం షాపుల నుంచి మామూళ్లు ఇవన్నీ సోదరులే చూస్తుంటారు. నియోజకవర్గంలో పనులను టీడీపీ శ్రేణులకు కాకుండా.. ఎవరు కమీషన్లు ఇస్తే వారికి కట్టబెడుతున్నారు.

ఆయనపై అధిష్ఠానమూ గుర్రు!

విజయవాడ నగరంలోని ఓ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడి అవినీతిపై అధిష్ఠానం కూడా తీవ్ర అసంతృప్తితో ఉంది. పోస్టింగులు, బదిలీలు మొదలు అక్రమ కట్టడాలు, వాణిజ్య సముదాయాలు, టింబర్ డిపోలు ఇలా వేటినీ వదలకుండా నెలవారీ వసూళ్లు చేస్తున్నారు. కేబుల్ ఆపరేటర్లను భయపెట్టి చాలా కనెక్షన్లను లాగేసుకున్నారు. అధిష్ఠానం కూడా విసుగెత్తిపోయి చెక్ పెట్టింది. నియోజకవర్గంలో ఎక్కడా ఈయన మాట చెల్లుబాటు కాకుండా ఇప్పటికే జాగ్రత్తలు తీసుకుంది.

అవినీతి దెబ్బకు తోక కట్!

ఎన్టీఆర్ జిల్లాలో రిజర్వుడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన తొలిసారి ఎన్నికయ్యారు. తనను కలిసేందుకు వచ్చే ప్రజలను చీదరించుకోవడంతోపాటు మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నాయకులతో అంటకాగుతూ టీడీపీ కేడర్‌ను నిర్వీర్యం చేస్తున్నారు.

ట్రావెల్ బస్సులనూ వదలరు..

శ్రీకాకుళం జిల్లా నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడి అవినీతిని పార్టీ శ్రేణులే నిరసిస్తున్నాయి. వంశధార నది నుంచి ఇసుక దోపిడీ మొదలు కాంట్రాక్టు పనుల్లో కమీషన్లు, చివరికి ట్రావెల్ బస్సుల నుంచి కూడా ముడుపులు తీసుకుంటున్నారు.

అభివృద్ధి పనుల్లో వాటాలు..

నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యేగా ఉన్న ఓ నాయకుడి అవినీతిపై నియోజకవర్గంలో తీవ్ర అసంతృప్తి ఉంది. పోర్టు కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా పోర్టు పనుల్లో సబ్ కాంట్రాక్టు పనులు తాను చెప్పిన వారికే ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో చివరకు అధిష్ఠానం జోక్యం చేసుకోవలసి వచ్చింది.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడే షాడో

పల్నాడు జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ఉన్న ఓ సీనియర్ నేతపై టీడీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి షాడో ఎమ్మెల్యేగా పెత్తనం చెలాయిస్తున్నారు. క్వారీ, గ్రావెల్ మైనింగ్‌ను ఈయనకు అప్పగించారు. వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌కు ఎమ్మెల్యే అండగా నిలవడం టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తికి కారణమైంది.

ఈయన దెబ్బకు పార్టీ 'గోవిందా'!

అనకాపల్లి జిల్లా నుంచి టీడీపీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడిపై జిల్లా అధ్యక్షుడు సహా టీడీపీ శ్రేణులన్నీ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. వైసీపీ నుంచి వచ్చిన నాయకులకు ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారు. వారితో కలిసి వ్యాపారాలు చేస్తున్నారు. ఆయన అనుచరులే ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. కూటమి నాయకులే ఈ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఎమ్మెల్యే వ్యవహారశైలితో నియోజకవర్గంలో పార్టీ కనుమరుగయ్యే పరిస్థితి.

తొలి గెలుపుతోనే అహంకారం..

విజయవాడ చెంతనే ఉన్న ఆ నియోజకవర్గం నుంచి గొప్ప నాయకులు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. అలాంటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడు మితిమీరిన అహంకారంతో వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు వాపోతున్నాయి. యువ నేతకు అత్యంత సన్నిహితుడినని ప్రచారం చేసుకుంటూ.. నియోజకవర్గంలో సీనియర్ నాయకులను పార్టీకి దూరం పెట్టేశారు. టీడీపీ శ్రేణులపైనే దాడులకు తెగబడుతున్నారు. ఈయన వన్‌టైం ఎమ్మెల్యే అన్న ప్రచారం ఇప్పటికే బాగా జరుగుతోంది. గ్రావెల్ అక్రమ తవ్వకాలను కట్టడి చేశానని చెబుతూ మట్టి తోలకాల్లో చేతివాటం చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

వైసీపీ వారే ముద్దు!

కృష్ణా జిల్లాలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యే అయిన నేతపై పార్టీ శ్రేణులు, ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తన అనుచరుడిని పోలీసులు అరెస్టు చేయడంతో కొత్తగా మరో వ్యక్తిని తెరపైకి తీసుకొచ్చారు. ఆయన కనుసన్నల్లోనే వసూళ్లు మొత్తం నడుస్తున్నాయి. పనులన్నీ వేరే జిల్లాల వారికి కట్టబెట్టారని, స్థానిక నాయకులను పూర్తిగా పట్టించుకోవడం మానేశారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే సన్నిహితుడైన వ్యక్తిని తన పక్కన పెట్టుకుని.. ఎవరు వచ్చినా అతడినే కలవాలని చెబుతున్నారు.

వైసీపీ ఎమ్మెల్యే చూపిన బాటలో..

విజయవాడ చెంతనే కృష్ణా జిల్లాకు చెందిన ఇంకో నియోజకవర్గ ఎమ్మెల్యే గతంలో దీనికి ప్రాతినిధ్యం వహించిన వైసీపీ ఎమ్మెల్యేను ఆదర్శంగా తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణా, మద్యం దుకాణాలు స్వయంగా నిర్వహిస్తుంటారు. అపార్ట్‌మెంట్ల నుంచి లేఔట్ల వరకు వసూళ్లు చేస్తున్నారు. తనకు డబ్బులు ముట్టచెప్పిన వారి అపార్ట్‌మెంట్లు, వెంచర్లకు ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేయిస్తుండడం విశేషం. దీంతో నియోజకవర్గంలో అవసరమైన చోట్ల రహదారులు లేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రధాన రోడ్లన్నీ గుంతలమయమైనా ఆయన పట్టించుకోవడం లేదు. నియోజకవర్గంలో కాంట్రాక్టులన్నీ తన మనుషులకే తప్ప ఇతరులకు దక్కడం అసాధ్యం.

తన ఆస్పత్రి ఉద్యోగే ఏజెంటు..

పల్నాడు జిల్లాలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నియోజకవర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. వైసీపీ నుంచి వచ్చిన వారికి ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారు. రియల్ ఎస్టేట్, మైనింగ్ వ్యాపారుల నుంచి వసూళ్ల కోసం తన ఆస్పత్రిలో పనిచేసే వ్యక్తిని ఏజెంటుగా పెట్టుకున్నారు.

కుటుంబ సభ్యుల హవా..

- నంద్యాల జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని తన ఇద్దరు కొడుకులకు కట్టబెట్టేశారు. వారు వైసీపీ నేతలతో కలిసి దందాలు సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నెలవారీ వసూళ్లు, భూకబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆయన వారంలో శని, ఆదివారాలు మాత్రమే నియోజకవర్గంలో ఉంటారు.
- నంద్యాల జిల్లాకే చెందిన మరో ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని తన చిన్నాన్న చేతికి అప్పగించారు. సదరు చిన్నాన్న.. క్వారీల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఈ ఎమ్మెల్యే సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ వైసీపీ నేతను పోలీసులు అరెస్టు చేస్తే.. అతడిని రిమాండ్‌కు పంపకుండా ఈయన సాయం చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే వైసీపీ హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పట్లో పార్టీ శ్రేణులు ఆయనకు అండగా నిలబడ్డాయి. కానీ గత ఏడాది గెలిచాక వారందరినీ పూర్తిగా విస్మరించారని.. నియోజకవర్గంలో ఆయన భార్య పంచాయితీలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈయన పీఏలు అందినకాడికి దండుకుంటున్నారు.
- అనకాపల్లి జిల్లాకు చెందిన మహిళా ఎమ్మెల్యే ప్రజలను, పార్టీ శ్రేణులను పూర్తిగా విస్మరించారన్న ఆరోపణలున్నాయి. మండలానికో నాయకుడి చొప్పున ఓ కోటరీని ఏర్పాటు చేసుకుని వారితో తప్ప ఇతర నాయకులు, కార్యకర్తలను కలవడం లేదు. భూముల సెటిల్‌మెంట్లు, గ్రావెల్, మట్టి దందా, మద్యం వ్యాపారం.. అన్నీ ఈ కోటరీ కనుసన్నల్లోనే నడుస్తున్నాయి.
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఓ నియోజకవర్గం నుంచి కూటమి పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడి దర్శనం కోసం ప్రజలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో నెలలో ఒకట్రెండు రోజులు ఉన్నా ఎక్కువే. అధిక సమయం అమరావతి, ఢిల్లీలో గడుపుతుంటారు. ఈయన పీఏనే ఇక్కడ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తుంటారు. వైసీపీ హయాంలో టీడీపీ, జనసేన నాయకులను, కార్యకర్తలను వేధించిన వారిని బీజేపీలో చేర్చుకుంటున్నారు.

పెత్తనమంతా కొడుకు, అల్లుడిదే

కృష్ణా జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో పెత్తనమంతా ఆయన కుమారుడు, అల్లుడిదే. ఇసుక, మట్టి తవ్వకాలు, రవాణా అంతా వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. ఏ పనిమీదైనా వెళ్తే కుమారుడిని కలవాలని ఆయన చెబుతున్నారు.



ఎన్డీయే పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

స్వర్ణయుగానికి పదకొండేళ్లు

- మోదీ పాలనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారతావనిలో స్వర్ణయుగానికి సాక్ష్యంగా గత పదకొండేళ్ల ఎన్డీయే పాలన నిలిచిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. దేశంలోని అన్ని వర్గాలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పదకొండేళ్ల ఎన్డీయే పాలన, దేశ ప్రగతిపై ఆయన మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. దేశంలో ఆర్థిక ప్రగతి, అన్నదాతల సంక్షేమం, జాతీయ భద్రత, వైద్య-విద్యా రంగాల్లో మార్పులు, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగాలు, ఉపాధి, పేదరికం తగ్గుదల, సామాజిక సంస్కరణలు, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి మోదీ పాలనలో సాధ్యమైందని వివరించారు. 2014 నాటికి దేశం ఆర్థికంగా అట్టడుగున, అవినీతిలో అగ్రభాగాన ఉందని.. సమర్థ నాయకుడైన మోదీ అధికారం చేపట్టాక దేశం దిశ మారిందన్నారు. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి భారత్ శక్తిని చాటామన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామాలయ నిర్మాణం, ట్రిపుల్ తలాక్ తొలగింపు వంటి సామాజిక సంస్కరణలు జరిగాయన్నారు. 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపే ప్రణాళిక, పని మొదలైందని తెలిపారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అద్భుతమైన సహకారాన్ని అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు తపన చౌదరి, కుమారస్వామి, వల్లూరు జయప్రకాశ్, పాతూరి నాగభూషణం, యామినీ శర్మ, షేక్ బాజీ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

దేశం రూపురేఖలు మార్చిన మోదీ: సత్యకుమార్



అనంతపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): యూపీఏ పాలనలో దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా పొందినా.. 11 ఏళ్ల పాలనలో విప్లవాత్మక నిర్ణయాలతో దేశం రూపురేఖలు మార్చిన నాయకుడు ప్రధాని మోదీ అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ కొనియాడారు. అనంతపురంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం అందించడమే ధ్యేయంగా పాలన చేస్తున్నారని అన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని పేర్కొన్నారు. ఎక్కడా అవినీతి మరకలేదని, మచ్చలేని నాయకుడిగా పాలన సాగిస్తున్నారని అన్నారు. రూ.44 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లోకి వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 20 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కల్పనలో ఎన్డీయే ప్రభుత్వం దూసుకుపోతోందని అన్నారు.

గనుల ఆదాయానికి గండి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటుంది. ఆ తర్వాత పర్యావరణ అనుమతులు పొందాలి. అయితే తీరా లీజులు ఇచ్చిన తర్వాత కొన్ని రకాల భూములపై అటవీ శాఖ నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. అది రిజర్వ్ చేయని (అన్‌రిజర్వ్) అటవీ ప్రాంతమని, అక్కడ మైనింగ్ చేయడానికి వీలు లేదంటూ అటవీ విభాగం నోటీసులు ఇస్తోంది. నిజానికి ఇలాంటివి రాష్ట్రవ్యాప్తంగా 100 లీజులున్నాయి. వీటిని పరిష్కరించాల్సింది రెవెన్యూశాఖనే. ఇవి సత్వరమే సెటిల్ అయ్యేలా రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకోవాల్సింది గనుల శాఖ. కానీ ఆ రెండు విభాగాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా గత దశాబ్దన్నర కాలంగా ఆ లీజుల నుంచి వచ్చే రూ.వందల కోట్ల ఆదాయం నిలిచిపోయింది. దీనికి ప్రధాన బాధ్యత రెవెన్యూదే అని ఆ శాఖవర్గాలే చెబుతున్నాయి.

రికార్డుల్లో ఉన్నా..

ఉమ్మడి కృష్ణా జిల్లా జి. కొండూరు మండలం కడిమిపోతవరంలోని లోయగ్రామంలో దాదాపు 18-20 లీజులున్నాయి. విలువైన రోడ్‌మెటల్, బిల్డింగ్ మెటల్, ఎర్రమట్టి నిల్వలున్నాయి. సర్వే నంబర్ 143లో ఉన్న 98.940 హెక్టార్లలో (244 ఎకరాలు)గ్రావెల్, రోడ్‌మెటల్ లీజులను 2007లో ఓ కంపెనీకి కేటాయించారు. అక్కడ మైనింగ్‌కు అవసరమైన అన్ని అనుమతులూ పొందాక, ఆ భూమి సర్వేచేయని, రిజర్వ్‌చేయని అటవీ అని ఫారెస్ట్ విభాగం అభ్యంతరం లేవనెత్తింది. నిజానికి రెవెన్యూశాఖ సిఫారసుతో అది రెవెన్యూ పోరంబోకు అని రికార్డుల్లో ఉన్న తర్వాతనే లీజులను మంజూరు చేశారు. ఇందుకోసం రెవెన్యూ ఆమోదం తీసుకున్నారు. అటవీ శాఖ అభ్యంతరం లేవనెత్తినప్పుడు అది రెవెన్యూ పోరంబోకు భూమి అని రెవెన్యూశాఖ నిగ్గు తేల్చాలి. కానీ ఆ శాఖ ఈ పనిచేయడం లేదు. అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఫలితంగా గత 18 సంవత్సరాలుగా ఆ లీజుల్లో మైనింగ్ జరగడం లేదు. అయితే, ఇందులోనూ ఓ ట్విస్ట్ ఉంది. ఆ భూమి పక్కనే ఉన్న ఇతర లీజుల్లో మైనింగ్ జరుగుతోంది. కానీ సర్వే నంబర్ 143లో మాత్రం ఆపేశారు. కారణాలు ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు. నిజంగా దట్టమైన చెట్లున్న భూముల్లో మైనింగ్ సాగుతుంటే, చెట్టూచేమలేని చోట మాత్రం అటవీ శాఖ వివాదం రాజేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాల్సిన రెవెన్యూశాఖ కదలడం లేదు.

కదలని మైనింగ్..

విశాఖజిల్లా నాతవరం మండలంలో 190ఎకరాల్లో లాటరైట్ లీజు మైనింగ్‌కు 2014లో అనుమతి ఇచ్చారు. అది రెవెన్యూ పోరంబోకు. ఇక్కడ కూడా అదే పరిస్థితి. అది సర్వేచేయని అటవీభూమి అని ఆ శాఖ అభ్యంతరం చెప్పింది. సరుగుడు పంచాయతీ పరిధిలో 120 ఎకరాల్లో విలువైన లాటరైట్ నిక్షేపాలున్నాయి. 2016లోనే లీజులు ఇచ్చారు. కానీ అది అటవీ భూమి అన్న అభ్యంతరం రావడంతో మైనింగ్ ముందుకు సాగడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాల పరిధిలో 72 గ్రావెల్, రోడ్‌మెటల్ లీజులు అటవీ వివాదంలో ఇరుక్కున్నాయి.

పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. అక్టోబరులో వచ్చే తుఫాన్లు ఎక్కువగా ఉత్తర కోస్తా, తూర్పుగోదావరి జిల్లాలకు నష్టం కలిగించాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "అనంతపురం వంటి జిల్లాల్లో ఏడాదిలో కేవలం 4 నెలలే పంటలు సాగు చేసి, 8 నెలల పాటు భూములు ఖాళీగా వదిలేస్తున్నారు. దీని వల్ల భూసారం దెబ్బతింటోంది. అలాకాకుండా మిగిలిన 8 నెలలు కూడా ఏదోక పంట సాగు చేసే పరిస్థితులు కల్పించాలి. వచ్చే వేసవిలో జలవనరుల లభ్యత ఉన్న 141 మండలాల్లోనూ సాగు జరిగేలా చూడాలి. దీనిలో 19 మండలాలు రిజర్వాయర్లు, 57 మండలాలు చెరువులు, 65 మండలాలు భూగర్భ జలాలపై ఆధారపడి ఉన్నాయి. వీటిని వినియోగించుకుని, దిగుబడులు సాధించాలి. అలాగే వచ్చే ఏడాది వేసవిలో ఉత్తర కోస్తా, గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోని 5 లక్షల ఎకరాల్లో వేసవి పంటలు సాగు చేసేలా రైతుల్ని సన్నద్ధం చేయాలి. వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలను పండించేలా రైతుల్ని ప్రోత్సహించాలి. అన్నదాతకు ఆదాయం మరింత పెరిగే మార్గాలను చూడాలి." అని సీఎం సూచించారు.

అంతర పంటకు ప్రాధాన్యం

వరిలో అంతర పంటగా గట్లపై కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరి పంట మధ్యలో లేదా, పంట చుట్టూ ఆక్వాకల్చర్, హార్టికల్చర్ సాగుకు ప్రయత్నించాలన్నారు. రైతుల పొలం మధ్యలో వెడల్పుగా అదనపు గట్లు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే ఈ గట్లను ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో అపరాలు, చిరు ధాన్యాల సాగు పెరగాలని సూచించారు. ఈ సీజన్‌లో రైతులు కోరిన 24 గంటల్లో బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి ఉండాలన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి, భూసారాన్ని కాపాడేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గతేడాది 39 లక్షల టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ ఏడాది 35 లక్షల టన్నులకు తగ్గించేలా చూడాలన్న సీఎం.. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

అవగాహన పెంచాలి!

రైతులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో కూడా వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. కాగా, హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లను పరుచూరు యార్డులో ప్రారంభించామని, దీనిపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు సీఎంకు వివరించారు. బర్లీ పొగాకు స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోకో, మామిడి కొనుగోళ్ల వివరాలపై సీఎం ఆరా తీశారు. మరోవైపు వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా కొత్తగా వ్యవసాయశాఖకు సంబంధించిన 3 సేవలు అందుబాటులో తెచ్చామని అధికారులు చెప్పారు. పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ అమలు విధానాన్ని వివరించారు. మార్క్‌ఫెడ్ సేవలను ఇకపై వాట్సాప్ ద్వారా రైతులు పొందే అవకాశం కలిగిందన్నారు.

అనకాపల్లి జిల్లాలో 'యాక్షన్ టెసా'

- రూ. 200 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు
- సుమారు 4 వేల మందికి ఉపాధి
- అచ్యుతాపురం సెజ్‌లో భూమి పూజ

రాంబిల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో మరో ప్రతిష్ఠాత్మక పరిశ్రమ ఏర్పాటవుతోంది. ఇళ్లల్లో ఇంటీరియర్‌కు వినియోగించే ప్యానల్స్, ఫ్లోరింగ్ బోర్డులు తయారుచేసే 'యాక్షన్ టెసా' సంస్థ తన ప్లాంటును ఇక్కడ ఏర్పాటు చేస్తోంది. అచ్యుతాపురం-రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో సుమారు రూ. 200 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఈ పరిశ్రమకు మంగళవారం భూమి పూజ చేశారు. 105 ఎకరాల్లో నిర్మించే ఈ కంపెనీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు, నాలుగు వేల మందికి ఉపాధి కలగనుంది. భూమి పూజ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, కంపెనీ ఛైర్మన్ ఎన్‌కే అగర్వాల్, ఎండీ వివేక్‌జైన్, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న చంద్రబాబు

సీఎంతో కిషన్‌రెడ్డి భేటీ

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. బీజేపీ కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన కిషన్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చారు. ముఖ్యమంత్రి ఆయనతో కలిసి భోజనం చేశారు. ఏపీకి కేంద్ర సాయం, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి: జనార్దన్

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, సీనియర్ నటులు, దివంగత ఎన్టీఆర్‌కు దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్దన్ డిమాండ్ చేశారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఎన్నారై టీడీపీ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం, సీబీఎన్ 75 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

అంకారావుకు వెంకయ్య అభినందన

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ అటవీ, పర్యావరణ పరిరక్షణ సలహాదారుగా నియమితులైన కొమెర అంకారావును మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అభినందించారు. అటవీ పరిరక్షణే జీవితంగా ఆయన ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. అంకారావు మంగళవారం, వెంకయ్యను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అంకారావును సలహాదారుగా నియమించినందుకు ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా ప్రశంసించారు.

టీడీపీ కార్యాలయంలో బాలకృష్ణ జన్మదిన వేడుక



అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మానవత్వానికి నిలువెత్తు రూపంగా నందమూరి బాలకృష్ణ నిలుస్తారని గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సజ్జల వ్యాఖ్యలపై రఘురామ ఫైర్

- సంకరజాతి అంటూ దూషించిన ఆయనపై చర్యలు ఉంటాయి
- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ డీజీపీకి ఫిర్యాదు చేసిన ఆర్‌ఆర్‌ఆర్



డీజీపీకి చేసిన ఫిర్యాదును చూపుతున్న రఘురామ

కాళ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రజలను ఉద్దేశించి వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అమరావతిలో మహిళలను వేశ్యలుగా వర్ణిస్తూ జగన్ మీడియాలో మాట్లాడిన జర్నలిస్టు కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక మహిళలు వారి ఫొటోలను చెప్పులతో కొట్టారు. దానిపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడటం హాస్యాస్పదం. ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలని రాక్షసులు, పిశాచులు, సంకర జాతి అంటూ మాట్లాడటం దారుణం. అమరావతి ప్రాంతంలో కేవలం ఒక కులం వారే జీవించడం లేదు. అక్కడ ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఓసీ.. తదితర అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు జీవిస్తున్నారు. అమరావతిలో నివాసం ఉంటున్న వారిని సంకరజాతి అనడం క్షమించరాని పదం. సమాజాన్ని కించపరుస్తూ మాట్లాడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డీజీపీకి ఫిర్యాదు చేశా. ఆ మీడియా సంస్థను నడుపుతున్న వ్యక్తి కూడా మహిళే. ఆమె కూడా ఇటువంటి వ్యాఖ్యలను ఖండించకపోగా అరెస్టును నిరసించడం సమంజసం కాదు' అని రఘురామ అన్నారు.

మనుషులా? మృగాలా?

- మహిళలను సంకర జాతి అంటారా?: మంత్రి సంధ్యారాణి

అమరావతి, విజయనగరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'మహిళలను సంకర జాతి అంటారా? ఇంత నీచులా? మనుషులా? మృగాలా..! సజ్జలకు సమాజంలో తిరిగే హక్కులేదు' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మండిపడ్డారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 'చేయకూడని తప్పులు చేస్తున్నారు. కాలగర్భంలో కలిసిపోతారు. మహిళల విషయంలో జగన్‌రెడ్డి, సజ్జల, కొమ్మినేని తీరు అసహ్యంగా ఉంది. వైసీపీని, సాక్షి చానల్‌ను మూసేసే సమయం దగ్గర పడింది. సజ్జల రామకృష్ణారెడ్డి సంకర జాతి అని వ్యాఖ్యానించడం మరింత దురదృష్టకరం. జగన్, సజ్జల, సాక్షి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి' అని మంత్రి డిమాండ్ చేశారు.

రాజధానిపై విషం కక్కుతున్నారు: మంత్రి కొండపల్లి

రాజధాని అమరావతిపై జగన్ తన మీడియాతో విషం కక్కిస్తున్నారని, దీన్ని రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సాక్షి డిబేట్‌లో అమరావతిపై చేసిన వ్యాఖ్యలను వైఎస్ జగన్, భారతిరెడ్డి ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. మంగళవారం విజయనగరంలో మాట్లాడుతూ... ఆ రోజున సాక్షిలో వచ్చిన డిబేట్‌ను పరిశీలిస్తే వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే కృష్ణంరాజు ఆ వాఖ్యలు చేశారన్నారు. కొమ్మినేని కూడా వాటిని ఖండించకపోవడం ఏంటని ప్రశ్నించారు.

జగన్, భారతి.. మహిళలకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నరసింహ యాదవ్

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు, సజ్జల రామకృష్ణారెడ్డిలకు కొమ్ముకాస్తున్న జగన్, సాక్షి ఎండీ వైఎస్ భారతి మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అమరావతి మహిళలను ఎన్నో రకాలుగా అవమానించిన వైసీపీ నాయకులు, అధికారం కోల్పోయినా వారినే లక్ష్యంగా చేసుకుని అవమానించడం వారి నీచ సంస్కృతికి నిదర్శమన్నారు.



తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని సాక్షి జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, తెలుగు మహిళలు, కార్యకర్తలు



తిరుపతిలో మహిళల ఆందోళన.. పెట్రోల్ పోసుకుంటున్న మహిళ

జగన్ మీడియాను నిషేధించాలి

- మూడోరోజూ మహిళల ఆందోళనలు
- సాక్షి కార్యాలయాల వద్ద నిరసనలు
- తిరుపతిలో మహిళ ఆత్మహత్యాయత్నం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జగన్ మీడియా లైవ్ డిబేట్‌లో అమరావతి రాజధాని మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులతోపాటు ఆ మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, బీజేపీ, జనసేన మహిళా నేతలు, మహిళా సంఘాల కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. జగన్ మీడియా కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. నియోజకవర్గాల్లోని ముఖ్యమైన కూడళ్లలో భారీ ర్యాలీలు నిర్వహించారు. జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. జగన్ మీడియా టీవీచానల్‌కు, ఆ సంస్థ ప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నెల్లూరు జిల్లా కావలి, కందుకూరు, వింజమూరు, కోవూరులలో ర్యాలీలు నిర్వహించారు. కోవూరులో తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం సమర్పించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని సాక్షి కార్యాలయం ఎదుట అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. సాక్షి నేమ్ బోర్డును మహిళలు పీకేశారు. జగన్ మీడియాను నిషేధించాలని నినాదాలు చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఆజాద్ చౌక్ నుంచి దేవిచౌక్ వరకు భారీ ర్యాలీ చేశారు. తిరుపతి జిల్లా జీవకోనలో ఓ మహిళ ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా మిగిలిన మహిళలు అడ్డుకున్నారు. జగన్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. వెంకటగిరిలో కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలను మహిళలు చెప్పులతో కొట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. గూడూరులో సాక్షి పత్రిక ప్రతులు, జగన్ ఫ్లెక్సీని దహనం చేశారు. సూళ్లూరుపేట బస్టాండు వద్ద మానవహారం నిర్వహించారు. సత్యవేడులోనూ ర్యాలీ నిర్వహించారు. విజయనగరంలోని మూడు లాంతర్ల జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరి జంక్షన్ వరకు మహిళలు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గం కక్కలపల్లి కాలనీలో నరిగమ్మ గుడి నుంచి కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్ వరకు.. అనంతపురం నగరంలో క్లాక్ టవర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీలు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, కదిరి, పెనుకొండలో భారీ ర్యాలీలు నిర్వహించారు. జగన్, భారతి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తి, కదిరి పోలీస్ స్టేషన్లలో, పెనుకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. ఏలూరు, కామవరపు కోట, నూజివీడుల్లో ర్యాలీలు చేశారు. మహిళలు సాక్షి కార్యాలయంలోకి కోడిగుడ్లు విసిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి చానల్‌పైన, జగన్, భారతి, కొమ్మినేని, కృష్ణంరాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్‌ల చొక్కాలు విప్పుతామని ఒకవైపు జగన్ వార్నింగ్ ఇస్తుంటే.. సాక్షి కార్యాలయం వద్ద మీరెలా బందోబస్తు నిర్వహిస్తారంటూ అక్కడ ఉన్న పోలీసులను ఉద్దేశించి మహిళలు వ్యాఖ్యానించారు. కడప నగరంలో సంధ్యాసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంధ్యా సర్కిల్లో సాక్షి దినపత్రికను దహనం చేశారు. జగన్, భారతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆ వ్యాఖ్యలు దారుణం: భూపతిరాజు

అమరావతిని వేశ్యల రాజధాని అని సాక్షి చానల్ లైవ్ డిబేట్‌లో వ్యాఖ్యానించడం దారుణమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మిలతో కలిసి జగన్ పత్రిక ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని, యాజమాన్యంపై చర్యలు తప్పవన్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మహిళల నిరసన ర్యాలీ



గూడూరులో తెలుగు మహిళల నిరసన ర్యాలీ



నెల్లూరు జిల్లా కందుకూరులో తెలుగు మహిళల ర్యాలీ

మంటలు 'పుట్టించారు'!

అగ్ని ప్రమాదంపై తప్పుడు ప్రచారం

- ఏలూరులో ఫర్నిచర్ గోడౌన్‌లో మంటలు
- పైఅంతస్తులో ఉన్న 'సాక్షి' కార్యాలయం
- అక్కడికి 200 మీటర్ల దూరంలో ఆందోళనకారులు
- అయినా... వారే నిప్పంటించారని దుష్ప్రచారం
- స్పష్టత ఇచ్చిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు రూరల్/క్రైమ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలతో వైసీపీ రాజకీయం! దానికి తోడు... జగన్ రోత మీడియా ప్రచారం! మంగళవారం ఏలూరులో జరిగిన ఘటన ఈ వికృత రూపాన్ని మరోసారి బయటపెట్టింది. ఫర్నిచర్ గోడౌన్‌లో మంటలు చెలరేగగా... 'సాక్షి' కార్యాలయానికి టీడీపీ నేతలు నిప్పుపెట్టారంటూ అటు వైసీపీ సోషల్ మీడియాలో, సాక్షి వెబ్‌సైట్‌లో తప్పుడు ప్రచారం చేశారు. అదే భవనంలో ఒక భాగంలో 'సాక్షి' స్థానిక కార్యాలయం ఉండటం నిజం! 'అమరావతి వేశ్యల రాజధాని' అంటూ 'సాక్షి' చానల్‌లో చేసిన రోత వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ కార్యకర్తలు, నేతలు ఆందోళనకు దిగిన మాటా నిజం! కానీ... వీరి ర్యాలీ సాక్షి కార్యాలయానికి 200 మీటర్ల దూరంలో ఉండగానే అక్కడ మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదానికీ, టీడీపీ ర్యాలీకి ఎలాంటి సంబంధంలేదని పోలీసులూ ధ్రువీకరించారు. అయినా సరే... విష ప్రచారం మాత్రం ఆగలేదు. అసలేం జరిగిందంటే...

భారీ నిరసనగా

దెందులూరు నియోజకవర్గానికి చెందిన వందలాది మంది మహిళలు ఏలూరు పాత బస్టాండ్ దగ్గర నుంచి ర్యాలీగా ఎన్‌ఆర్‌పేటలోని సాక్షి కార్యాలయానికి బయలుదేరారు. ఒక భవనంలోని రెండు పోర్షన్లలో ఒక దానిలో భవన యజమానురాలు నివసిస్తున్నారు. మరో పోర్షన్‌ను ఫర్నిచర్ షాపు యజమాని అద్దెకు తీసుకుని... రిపేరు గోడౌన్‌గా వినియోగిస్తున్నారు. ఇదే భవనం మొదటి అంతస్తులోని ఒక పోర్షన్‌లో సాక్షి కార్యాలయం ఉంది. మరో పోర్షన్‌ను ఉపాధ్యాయ సంఘాలు సమావేశ కార్యాలయంగా వినియోగించుకుంటున్నాయి.. 'సాక్షి' కార్యాలయం వద్దకు టీడీపీ నేతలు, కార్యకర్తలు నిరసనగా వస్తున్న నేపథ్యంలో... ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు, 20 మంది పోలీస్ సిబ్బందిని అక్కడ బందోబస్తుగా పెట్టారు. నిరసన ప్రదర్శన మరో 200 కిలోమీటర్ల దూరంలో ఉండగానే ఫర్నిచర్ గోడౌన్ వరండాలో... మరమ్మతుకు వచ్చిన సోఫాకు మంటలు అంటుకున్నాయి. ఆ పక్కనే ఉన్న కుర్చీలు కూడా దగ్ధమయ్యాయి. పోలీసులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని... మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నీళ్లు చిమ్మారు. ఇదీ అక్కడ జరిగింది.



ఏలూరులోని సాక్షి కార్యాలయం పార్కింగ్ ప్లేస్‌లో మంటలు

నిప్పంటించారంటూ...

ఫర్నిచర్ గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై 'సాక్షి' మీడియా, సోషల్ మీడియా వక్రీకరించింది. తమ కార్యాలయాన్ని దహనం చేశారంటూ, సిబ్బందిని నిర్బంధించి కార్యాలయంలో పెట్రోలు పోసి తగలపెట్టారని ప్రచారం మొదలుపెట్టారు. దీంతో... మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. "అగ్ని ప్రమాద ఘటనకు, సాక్షి కార్యాలయానికీ సంబంధం లేదు. మంటలు చెలరేగే సమయానికి... టీడీపీ నిరసన ప్రదర్శన అక్కడికి 200 మీటర్ల దూరంలో ఉంది. మంటలు ఆర్పుతున్న సమయానికి దెందులూరు మహిళలు ర్యాలీగా అక్కడికి చేరుకున్నారు. సాక్షి కార్యాలయంపై దాడి, దహనం అని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు" అని డీఎస్పీ స్పష్టం చేశారు. ఫర్నిచర్ షాపు యజమాని ఉంగరాల శ్రీనివాసరావు కూడా ఇదే విషయం తెలిపారు. తన గోడౌన్‌లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయని చెప్పారు. అక్కడ రసాయనాలు ఉపయోగించి మంటలు సృష్టించినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ స్పష్టం చేశారు. తాము వెళ్లేటప్పటికే పోలీసులు మంటలను ఆర్పివేశారన్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్పష్టం చేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

హైకోర్టును ఆశ్రయించిన కృష్ణంరాజు

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): "అమరావతి దేవతల రాజధాని కాదు. వేశ్యల రాజధాని." అంటూ సాక్షి చానల్ చర్చలో జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై మండిపడ్డ మహిళలు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కృష్ణంరాజు హైకోర్టును ఆశ్రయించారు. "ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని మాత్రమే డిబేట్‌లో ప్రస్తావించాను. నన్ను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశారు. అరెస్ట్ చేసి, చిత్రహింసలకు గురిచేస్తారనే ఆందోళన ఉంది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాకు వర్తించవు. దర్యాప్తునకు సహకరిచేందుకు సిద్ధంగా ఉన్నా. ముందస్తు బెయిల్ మంజూరు చేయండి." అని పిటిషన్‌లో కోరారు.

కృష్ణంరాజు వ్యాఖ్యలపై ఎన్‌సీడబ్ల్యూ

సుమోటో విచారణ

- తీసుకున్న చర్యలపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీకి ఆదేశం

అమరావతి, న్యూఢిల్లీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జగన్ చానల్‌లో జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా విచారణకు తీసుకుంది. ఆయనపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ మంగళవారం కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు లేఖ రాశారు. ఆ వ్యాఖ్యలపై విచారణను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, తీసుకున్న చర్యలపై మూడు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను ఉద్దేశించి కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు అప్రతిష్ఠను కలిగించేవిగా కమిషన్ పేర్కొంది. 'వేశ్యల రాజధాని' అన్న మాటలను ఖండించిన ఎన్‌సీడబ్ల్యూ... అది అమరావతి మహిళా రైతులను ఘోరంగా అవమానించడమేనని స్పష్టం చేసింది.

ఎన్‌సీడబ్ల్యూ స్పందన అభినందనీయం: లోకేశ్


అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'అమరావతి మహిళలను లక్ష్యంగా చేసుకుని కృష్ణంరాజు చేసిన అవమానకర వ్యాఖ్యలు కచ్చితంగా ఖండించదగ్గవి. ఈ విషయంలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నిర్ణయాన్ని సమర్థిస్తున్నా' అని మంత్రి లోకేశ్ అన్నారు. మంగళవారం ఎక్స్‌లో ఈ విషయంపై స్పందించారు. 'అమరావతి మహిళలను అవమానించేలా చేసిన కామెంట్లపై జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పందించిన తీరు అభినందనీయం. అమరావతి మహిళా రైతులను వేశ్యలని పేర్కొనడం సిగ్గుచేటు మాత్రమే కాదు... వారి త్యాగాలను అవమానించే నేరపూరిత కుట్ర. రాజధాని అమరావతి పోరాటానికి మహిళా రైతులే వెన్నుముక. వారికి బలమైన అండగా నిలబడతాం' అని లోకేశ్ పేర్కొన్నారు.





అనంతపురం అంబేడ్కర్ సర్కిల్‌లో జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

కడప సంధ్యా సర్కిల్‌లో మహిళల ర్యాలీ



జగన్ దగ్గర సొంత చెల్లికే మర్యాద లేదు

- రాష్ట్రంలో మహిళలను ఇంకేం గౌరవిస్తారు?
- సజ్జల మూర్ఖుడిలా మాట్లాడుతున్నారు: షర్మిల



రాయచోటి, పుట్టపర్తి టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దగ్గర సొంత చెల్లికే గౌరవం, మర్యాద లేదు. రాష్ట్రంలోని మహిళలకు ఇంకేం గౌరవం ఉంటుంది?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. ఆ రెండు చోట్ల ఆమె మీడియాతో మాట్లాడారు. 'రక్త సంబంధమే నాపై విష ప్రచారం చేసింది. నేను వైఎస్సార్‌కు పుట్టలేదని, విజయమ్మకు తాను అక్రమ సంతానమని అన్నారు. అక్రమ సంబంధాలను అంటగట్టే సైతాన్ సైన్యం వైసీపీ. సజ్జల కొడుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని నాపై దాడి చేశాడు. రక్త సంబంధం, అక్కచెల్లెళ్ల బంధం గురించి వైసీపీ మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తల్లిని, చెల్లిని దూరం చేసుకున్న జగన్ సమాజానికి ఏం చెబుతారు? రాజధాని అమరావతి మహిళలపై సజ్జల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ఆయన మూర్ఖుడిలా మాట్లాడుతున్నారు. మహిళలను పిశాచులతో పోల్చి రాక్షసులని, సంకర జాతి అని అవమానిస్తారా? చేసిన తప్పుకి క్షమాపణ చెప్పడానికి నామోషీ ఎందుకు? కాంగ్రెస్ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం' అని షర్మిల హెచ్చరించారు.



కోస్తా, రాయలసీమకు భారీ వర్షసూచన

14 నుంచి నైరుతిలో పురోగతి

16 తర్వాత అల్పపీడనం

విశాఖపట్నం,అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనాలు, ఉపరితల ద్రోణులు, షీర్ జోన్ ప్రభావాలతో బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి దక్షిణ భారతదేశంపైకి భారీగా తేమగాలులు వీస్తున్నాయి. దీంతో మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. బుధ, గురువారాల్లో రాయలసీమలో ఎక్కువచోట్ల, కోస్తాలో అనేకచోట్ల ఈదురుగాలులతో వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ భారతంలో వర్షాలు పెరుగుతుండడం, హిందూ మహాసముద్రం నుంచి తేమగాలులు వస్తుండడంతో ఈ నెల 14 నుంచి నైరుతి రుతుపవనాల్లో కదలిక వస్తుందని, మధ్య, తూర్పుభారతంలో పలు ప్రాంతాలకు విస్తరించనున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, ఈ నెల 16 తర్వాత పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. దీంతో రుతుపవనాలు చురుగ్గా మారే అవకాశం ఉందన్నారు. కాగా, రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు, బుధవారం విజయనగరం, మన్యం, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో 40-41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

స్వర్ణాంధ్ర 2047 కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- చైర్మన్‌గా సీఎం చంద్రబాబు.. కో-చైర్మన్‌గా టాటా సన్స్ ఈసీ చంద్రశేఖరన్

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్- విజన్ 2047లో భాగంగా రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీకి సీఎం చంద్రబాబు చైర్మన్‌గా, టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, అపోలో హాస్పిటల్స్ వైస్‌చైర్మన్ డాక్టర్ ప్రీతారెడ్డి, భారత్ బయోటెక్ కో-ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్రా ఎల్ల, నాసర్ వర్సిటీ కంప్యూటర్స్ విభాగం ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ సతీ‌ష్‌రెడ్డి, ఎల్ అండ్ టీ చైర్మన్ ఎన్ సుబ్రహ్మణియన్, సీఎస్ సభ్యులుగా ఉంటారు. పారిశ్రామికాభివృద్ధి ద్వారా.. రాష్ట్రంలో ఆర్థిక, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ కమిటీ ఉపయోగపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. 2024-29 కాలంలో భారీ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ పాలసీల రూపకల్పనలో సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొంది.

ఎస్జీటీల బదిలీలు ప్రారంభం

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం పాఠశాల విద్యాశాఖ మంగళవారం మధ్యాహ్నం నుంచి మాన్యువల్ విధానంలోనే కౌన్సెలింగ్ ప్రారంభించింది. జిల్లాల్లో ఎస్జీటీల సంఖ్య ఆధారంగా రోజుకు సగటున 500 మందికి కౌన్సెలింగ్ నిర్వహించేలా షెడ్యూలు నిర్ణయించారు. ఎలాంటి వివాదాలు లేకుండా ప్రక్రియ ప్రశాంతంగా సాగితే ఐదు రోజుల్లో బదిలీలు పూర్తవుతాయి. ఎస్జీటీలు ఎక్కువగా ఉన్న తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో మరికొంత సమయంపట్టే అవకాశం ఉంది. 2025-26 విద్యాసంవత్సరం గురువారం ప్రారంభం కానుంది. ఆ రోజు బడులు పునఃప్రారంభమవుతాయి. ఏదైనా పాఠశాలలో టీచర్లంతా బదిలీల్లో ఉంటే అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో బడి నిర్వహిస్తారు.

మెగా డీఎస్సీకి 94.03% హాజరు

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో మంగళవారం జరిగిన బయలాజికల్ సైన్స్ పరీక్షకు 94.03 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్ (కన్నడ, ఒడియా, తమిళం, ఉర్దూ) అభ్యర్థులకు ఉదయం 101 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 18,293 మందికి గాను 17,541 మంది, మధ్యాహ్నం 68 కేంద్రాల్లో 12,375 మందికి గాను 11,387 మంది హాజరయ్యారని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి వివరించారు. ఉదయం తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 96.45శాతం మంది, మధ్యాహ్నం అనంతపురంలో అత్యధికంగా 97.96శాతం మంది పరీక్ష రాశారని తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

- ఇంటర్వ్యూలకు 224 మంది ఎంపిక
- 23 నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. మొత్తం 89 పోస్టుల భర్తీ కోసం 2023లో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించిన మెయిన్స్ పరీక్షలు మే 3 నుంచి 9 వరకు జరిగాయి. ఆ పరీక్షల ఫలితాలను ఇప్పుడు ప్రకటించింది. జనరల్ కోటాలో 182 మంది, స్పోర్ట్స్ కోటాలో 42 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 17 నుంచి ఏపీపీఎస్సీ కార్యాలయంలో క్రీడా ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. వాటిని శాప్‌కు పంపి, శాప్ నిర్ధారించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జనరల్ అభ్యర్థులకు ఈనెల 23 నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. అనంతరం తుది ఫలితాలు ప్రకటిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం అందుతుందని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని కమిషన్ స్పష్టం చేసింది.

కాకాణి టోల్ పాపం బద్దలు!

కృష్ణపట్నం పోర్టులో 40 కోట్ల వసూళ్ల దందా

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాపాలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. అధికారంలో ఉండగా.. తన నియోజకవర్గం పరిధిలోని కృష్ణపట్నం పోర్టులో అనధికార టోల్ గేటు పెట్టి కోట్లు వసూలుచేసిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. కృష్ణపట్నం పోర్టు నుంచి సరుకు ఎగుమతులు, దిగుమతుల కోసం రోజూ కొన్ని వందల వాహనాలు వచ్చి పోతుంటాయి. వీటి నిర్వహణ కోసం ట్రాన్స్‌పోర్టర్లు 'కృష్ణపట్నం లారీ ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్' ఏర్పాటు చేసుకున్నారు. పోర్టు ఆరంభం నుంచీ ఇది నడుస్తోంది. 2019 వరకు దీనిపై రాజకీయ పెత్తనం లేదు. అసోసియేషన్ సంక్షేమం కోసం నామమాత్రంగా టోల్ ఫీజు వసూళ్లు చేసేవారు. ఆ లెక్కలు పక్కాగా నిర్వహించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడం, కాకాణి సర్వేపల్లి నుంచి ఎమ్మెల్యేగా రెండోసారి గెలువడంతో అక్రమ ఆదాయం కోసం వైసీపీ నేతలు ఈ పోర్టుపై కన్నేశారు. తొలుత లారీ అసోసియేషన్‌లోకి చొరబడ్డారు. పాత పాలకవర్గం నుంచి లాక్కుని.. అనుబంధంగా కృష్ణపట్నం లాజిస్టిక్స్ అనే కంపెనీ ఏర్పాటు చేశారు. పాత అసోసియేషన్‌ను డమ్మీ చేసి మొత్తం రవాణాను చేజిక్కించుకున్నారు. పోర్టు గుండా విదేశాల నుంచి సరుకులు దిగుమతి చేసుకునే కంపెనీలు 60కి పైగా ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ పోర్టు లోపలే కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని దిగుమతి, ఎగుమతి వ్యవహారాలు చూసుకుంటాయి. కాకాణి అనుచరులు వాటిపై పెత్తనం చేయడం మొదలుపెట్టారు. అప్పటి వరకు ఈ కంపెనీలు తమకు అవసరమైన ట్రాన్స్‌పోర్టు వాహనాలను సమకూర్చే కాంట్రాక్టును కృష్ణపట్నం లారీ అసోసియేషన్‌కు ఇచ్చేవి. ఆ సంఘం వాహనాలను సమకూర్చేది. అయితే ఈ కాంట్రాక్టులను వైసీపీ నాయకులు తాము ఏర్పాటు చేసుకున్న కృష్ణపట్నం లాజిస్టిక్స్ కంపెనీకి ఇవ్వాలని హుకుం జారీ చేశారు. వీరిని కాదంటే సరుకు ఎగుమతి, దిగుమతులకు వాహనాలు పోర్టులోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆయా కంపెనీలు విధిలేక సరుకు రవాణా కాంట్రాక్టును వీరికే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాజిస్టిక్స్ కంపెనీ పేరుతో పోర్టుకు వెలుపల పంటపాళెం వద్ద అనధికారిక టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. పోర్టు నుంచి ఎగుమతి, దిగుమతుల కోసం వాహనాలను కేటాయించే క్రమంలో వాహనదారుల నుంచి భారీ మొత్తంలో కమీషన్ గుంజారు. బాడుగకు బండి పెట్టాలంటే రూ.5 వేల నుంచి 7 వేల వరకు వసూలు చేశారు. కొద్ది రోజులకు కమీషన్‌ను పర్సంటేజ్ కింద మార్చారు. బాడుగ మొత్తంలో 4 శాతం వసూలు చేశారు. కంటైనర్లను మోసుకెళ్లే భారీ ట్రక్కుల బాడుగను బరువును బట్టి, దూరాన్ని బట్టి లక్షల్లో నిర్ణయించారు. ఆ బాడుగ మొత్తంలో 4 శాతం అంటే.. ఒక్కో ట్రిప్పునకు 10 వేల నుంచి 20 వేల వరకు వైసీపీ నాయకులకు ముట్టజెప్పాల్సి వచ్చేది.



కంపెనీలను తెగ బాదేశారు

ఎగుమతి, దిగుమతి లైసెన్సు కలిగిన కంపెనీలు పోర్టు నుంచి సరుకు రవాణాకు స్వతంత్రంగా వాహనాలు ఏర్పాటు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. ఆ కాంట్రాక్టును లాజిస్టిక్స్ కంపెనీకే ఇచ్చేలా ఒత్తిడి చేసి సాధించుకున్నారు. పోనీ వాహనాలకు సహేతుకంగా అద్దె వసూలు చేశారా అంటే అదేమీ లేదు. అద్దెను భారీగా నిర్ణయించి కంపెనీల నుంచి పిండుకున్నారు. అంతేగాక ఆ మొత్తాన్ని ముందే వసూలు చేశారు. వాహనదారులకు మాత్రం తక్కువ అద్దె ఇచ్చారు. అది కూడా 2-3 నెలలకు చెల్లిస్తూ వేధించారు.

కంటైనర్ టెర్మినల్ ఎత్తివేయడానికి..

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ ఎత్తివేయడానికి, వేల మంది కార్మికులు వీధిన పడడానికి ప్రధాన కారణాల్లో వైసీపీ నాయకుల అక్రమ దందా కూడా ఒకటని పోర్టు ఉద్యోగుల వాదన. ఎప్పుడైతే ఎగుమతి, దిగుమతి కంపెనీలకు వాహనాల అద్దెను విపరీతంగా పెంచారో.. అవి భరించలేక తమ కార్యకలాపాలకు చెన్నై పోర్టుపై ఆధారపడడం మొదలుపెట్టాయి. ఫలితంగా కృష్ణపట్నం పోర్టుకు వచ్చే కంటైనర్ల సంఖ్య దారుణంగా తగ్గిపోయింది. దీంతో కంటైనర్ టెర్మినల్ లాభసాటిగా లేదని పోర్టు యాజమాన్యం దీనిని ఎత్తివేసింది. కేవలం బొగ్గు, బూడిద దిగుమతి, ఎగుమతుల టెర్మినల్‌గా మార్చేసింది. దీంతో కృష్ణపట్నం పోర్టుపై ఆధారపడిన వందలాది ట్రాన్స్‌పోర్టు కంపెనీలు ఉపాధి కోల్పోయాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం.. కాకాణి ఓడిపోవడంతో దందా ఆగిపోయింది. అయితే వైసీపీ నాయకుల అక్రమ వసూళ్ల కారణంగా నష్టపోయిన ట్రాన్స్‌పోర్టర్ షేక్ ఫరీద్ అనే వ్యక్తి.. వారి అరాచకాలపై పోలీసులకు ఈ నెల 6న ఫిర్యాదు చేశారు. వీరి కారణంగా తనలాంటి ఎందరో ట్రాన్స్‌పోర్టర్లు నిలువునా మునిగిపోయామని అందులో తెలిపారు. అంతే కాదు.. కృష్ణపట్నం లాజిస్టిక్స్ కంపెనీ పేరుతో వైసీపీ నాయకులు ఎంత దండుకున్నదీ ఉప్పందించారు. వైసీపీ అధికారంలో ఉండగా.. అటువైపు కన్నెత్తి చూడని పోలీసులు.. ఫరీద్ ఫిర్యాదుతో దర్యాప్తు మొదలు పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం కాకాణి నేతృత్వంలోనే జరిగిందని గుర్తించారు. ఆయన(ఏ-1), ఆయన అనుచరులు 10 మందిపై ఈ నెల ఏడో తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనధికారిక టోల్ గేట్, లాజిస్టిక్స్ కంపెనీ పేరుతో ట్రాన్స్‌పోర్టర్లు, ఎక్స్‌పోర్ట్ కంపెనీల నుంచి రూ.40 కోట్లు దండుకున్నట్లు పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. ఈ డబ్బులు ఎలా చేతులు మారాయో ఆధారాలు కూడా లభ్యమైనట్లు సమాచారం. త్వరలోనే కాకాణిని ఈ కేసులో అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయనపై ఇప్పటికే క్వార్ట్జ్ అక్రమ తవ్వకం, రవాణా.. అక్రమ గ్రావెల్ తవ్వకాలు, ఫొటోల మార్ఫింగ్ తదితర కేసులు ఉన్నాయి.

గుంటూరు కోర్టుకు కాకాణి

గుంటూరు: మాజీ మంత్రి కాకాణిని మంగళవారం గుంటూరు సీఐడీ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. గతంలో ఆయన టీడీపీ నేత సోమిరెడ్డి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కేసుకు సంబంధించి పీటీ వారంట్‌పై కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్ విధించడంతో తిరిగి నెల్లూరు జైలుకు తరలించారు.

8 రాష్ట్రంలో మరో కొవిడ్ కేసులు

- గుంటూరులో నలుగురు, ఏలూరులో ఇద్దరికి పాజిటివ్
- అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఒక్కో కేసు వెలుగులోకి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



కొవిడ్-19 చాపకింద నీరులా విస్తరిస్తోంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 8 కరోనా కేసులు నమోదయ్యాయి. గుంటూరులో నలుగురికి, ఏలూరులో ఇద్దరికి, అనంతపురం, నెల్లూరుల్లో ఒక్కొక్కరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. గుంటూరు జిల్లాలో గతవారం రోజుల్లో 37 కేసులు నమోదవగా.. వారిలో నలుగురు గర్భిణులు ఉన్నారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాలలోని స్టేట్ వైరాలజీ ల్యాబ్‌లో 58 నమూనాలకు ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి పాజిటివ్ వచ్చింది. ఈ ల్యాబ్‌లో రోజుకు సగటున 60 నమూనాలను పరీక్షిస్తున్నారు. ఇందులో సింహభాగం జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలల నుంచే వస్తున్నాయి. కొవిడ్ లక్షణాలతో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చిన 8మంది శాంపిల్స్‌ను పరీక్షించగా ఇరువురికి పాజిటివ్ నిర్ధారణ అయింది. ఏలూరులో వేర్వేరు ప్రాంతాలకు చెందిన 53ఏళ్ల పురుషుడు, 28ఏళ్ల మహిళకు కరోనా సోకిందని, ప్రస్తుతం వీరిద్దరూ హోం ఐసోలేషన్‌లో ఉన్నారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ వెల్లడించారు. దీంతో జిల్లాలో యాక్టివ్ కేసుల సంఖ్య 9కి చేరింది. అనంతపురం జిల్లాలో... కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వృద్ధుడు (75) కొవిడ్ బారిన పడినట్టు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో జిల్లాలో కొవిడ్ బాధితుల సంఖ్య ఐదుకు చేరిందన్నారు. కాగా, నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాల ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షలో తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన యువకుడి (21)కి పాజిటివ్ వచ్చినట్టు నిర్ధారణైంది.

సెల్‌ఫోన్ కోసం చంపేశారు!

- బాల్య స్నేహితుడి హత్య.. ఐదుగురు అరెస్టు
- తూర్పుగోదావరి జిల్లా నిడిగట్లలో ఘటన

కోరుకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కోసం బాల్య స్నేహితుడినే దారుణంగా హతమార్చిన ఘటన తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది. నార్త్‌జోన్ డీఎస్పీ వైశ్రీకాంత్ కథనం మేరకు... రాజమహేంద్రవరం ఆర్యాపురానికి చెందిన సింహాదుర్గాసాయి, శెట్టి వీరబాబు, ఆకుల గణేశ్, కర్రి శ్రీనివాస్ రెడ్డి, రేలంగి సాయి మణికంఠ(అలియాస్ తరుణ్), మృతుడు రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగరానికి చెందిన కొవ్వాడ చిన్నబ్బులు(32) బాల్య స్నేహితులు. చిన్న చిన్న ఈవెంట్లు, కార్పెంటర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరంతా ఈ నెల 4న మధ్యాహ్నం రాజమహేంద్రవరం రివర్ బేలో పార్టీ చేసుకుని మద్యం తాగారు. పార్టీ అనంతరం వీరబాబుకు చెందిన సెల్‌ఫోన్ చిన్నబ్బులు చేతిలో ఉండగా కింద పడి గ్లాస్ పగిలిపోయింది. దీంతో వారి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. అదేరోజు సాయంత్రం ఆరుగురూ కలసి కోరుకొండ మండలం గాడాల శివారు నిడిగట్ల రోడ్డుకు చేరుకుని మరోసారి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న వారి మధ్య సెల్‌ఫోన్ విషయమై మళ్లీ వాగ్వాదం మొదలైంది. చిన్నబ్బులుపై మిగిలిన ఐదుగురు పదునైన బ్లేడ్‌తో దాడి చేసి, బండరాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారు. మృతదేహాన్ని అక్కడే ఉన్న డ్రైన్‌లో పడేశారు. గాడాల వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన కోరుకొండ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన బ్లేడ్‌తో పాటు వారి సెల్‌ఫోన్‌లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఐదుగురూ పాత నేరస్తులని డీఎస్పీ తెలిపారు.

'మద్యం' నిందితుల బెయిల్ పిటిషన్లు 17కు వాయిదా

విజయవాడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణను సీఐడీ కోర్టు 17వ తేదీకి వాయిదా వేసింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కె.ధనుంజయ్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై మంగళవారం జరగాల్సిన విచారణ వాయిదా పడింది.

'సిట్' అదుపులో చెవిరెడ్డి పీఏ

- మరో ఇద్దరి కోసం అధికారుల గాలింపు

తిరుపతి(నేరవిభాగం)/తిరుపతి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పీఏ బాలాజీని సిట్ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ నుంచి వచ్చిన సిట్ బృందం నాలుగు రోజులుగా తిరుపతిలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. తిరుపతి రూరల్ మండలం తిరుమలగిరికి చెందిన బాలాజీని తిరుపతిలో అదుపులోకి తీసుకుని విజయవాడకు తీసుకెళ్లినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇదే కేసులో మరో ఇద్దరి కోసం సిట్ బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం. 2024 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ఓటర్లకు పంపిణీ చేయడానికి, ఇతరత్రా వస్తువులకు డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయనే దానిపై అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. కాగా, లిక్కర్ స్కాంలో తనను ఇరికించి జైలుకు పంపాలని సిట్ అధికారులు తపన పడుతున్నారని చెవిరెడ్డి ఆరోపించారు. గతంలో తనవద్ద పనిచేసిన గన్‌మన్ గిరిని, తన స్నేహితుడు వెంకటేశ్, ఆయన భార్యను అదుపులోకి తీసుకుని హింసించారని, రెండ్రోజుల ముందు బాలాజీని తీసుకెళ్లి రహస్య ప్రాంతంలో కాళ్లు, చేతులు కట్టేసి నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టించడానికి ఒక వ్యవస్థ ఈ స్థాయికి దిగజారిపోతుందా అని ప్రశ్నించారు. ఈ కేసులో మరో ఇద్దరు విలేకరులను కూడా త్వరలో తీసుకెళ్తారని చెబుతున్నారని, దీనిపై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తామని తెలిపారు.

ఆ వ్యాఖ్యల వెనుక కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

విధించడంతో కొమ్మినేనిని పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. సాక్షి చానల్‌లో ఈ నెల 6న జరిగిన చర్చలో.. "అమరావతి దేవత రాజధాని కాదు.. వేశ్యల రాజధాని." అంటూ ఎనలిస్టు కృష్ణంరాజు దారుణ వ్యాఖ్యలు చేశారు. ఈ డిబేట్‌ను నిర్వహించిన యాంకర్ కొమ్మినేని సదరు వ్యాఖ్యలను ఖండించకపోగా 'అవును.. నిజమే' అన్నట్లుగా సమర్థించారు. ఈ వ్యాఖ్యలపై మహిళాలోకం తీవ్ర ఆగ్రహావేశాలకు లోనైంది. ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష ఈ నెల 8న తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంతోపాటు 8 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో కృష్ణంరాజును ఏ1గా, కొమ్మినేని శ్రీనివాసరావును ఏ2గా, సాక్షి యాజమాన్యాన్ని ఏ3గా పేర్కొన్నారు. కేసు విచారణాధికారి టి.మురళీకృష్ణ సాక్షులను విచారించిన అనంతరం 9న కొమ్మినేనిని హైదరాబాదులో అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడైన కృష్ణంరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో ఆయన కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. కొమ్మినేనిని పోలీసులు సోమవారం రాత్రి గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం, మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. కొమ్మినేని తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది మనోహర్ రెడ్డితోపాటు పలువురు న్యాయవాదులు వాదనలు వినిపించారు. కాగా, ప్రాసిక్యూషన్ తరఫున వీరగంధం రాజేంద్రప్రసాద్, మంగళగిరి కోర్టు ఏపీపీ శివలీల వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి కె. సురేశ్‌బాబు నిందితుడు కొమ్మినేని శ్రీనివాసరావుకు 24 వరకు రిమాండ్ విధించారు.

పకడ్బందీగా రిమాండ్ రిపోర్ట్

కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన సందర్భంగా స్పెషల్ కౌన్సిల్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో తుళ్లూరు పోలీసులు పకడ్బందీగా రిమాండ్ రిపోర్ట్ రూపొందించారు. ఈ కేసులో పేర్కొన్న సెక్షన్లకు సంబంధించిన సమగ్ర వివరాలను కూడా కోర్టు ముందు ఉంచారు.

బీఎన్ఎస్ 79: మహిళలను ఉద్దేశపూర్వకంగా దుర్భాషలాడుతూ కించపరచడం నేరం. ఈ సెక్షన్ కింద మూడేళ్లు శిక్ష పడే అవకాశం ఉంటుంది.

బీఎన్ఎస్ 196(1): సమాజంలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచాలని, కలహాలు సృష్టించాలనే దురుద్దేశంతో కుట్రపూరితంగా నేరానికి పాల్పడడం. మూడేళ్ల శిక్ష పడే అవకాశం ఉంది.

బీఎన్ఎస్ 353(2): అభూత కల్పనలను సృష్టించి గొడవలు పెట్టాలనే దురుద్దేశం. నేరం రుజువైతే మూడేళ్లకు తక్కువ కాకుండా శిక్ష. సమాజంలో అలజడి సృష్టించాలనే దురుద్దేశంతో ఒక పథకం ప్రకారం గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలనే ఉద్దేశం.



కొమ్మినేని శ్రీనివాసరావుకు మంగళగిరి కోర్టు రిమాండ్ విధించడంతో గుంటూరు జిల్లా జైలుకు తీసుకువచ్చిన పోలీసులు

రిమాండ్ విధించండి: స్పెషల్ కౌన్సెల్

రాజధాని మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేసులో కొమ్మినేని శ్రీనివాసరావును రిమాండ్ నుంచి తప్పించేందుకు మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి తదితరులు తీవ్రంగా యత్నించి విఫలమయ్యారు. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం ఏడేళ్లలోపు శిక్షలు పడే నేరాలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు 41ఏ నోటీసు జారీ చేయాలని, రిమాండ్ విధించకూడదని పొన్నవోలు వాదించారు. అయితే ఏడేళ్లలోపు శిక్ష పడే కేసు అయినప్పటికీ కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉంటే తప్పనిసరిగా రిమాండ్ విధించవచ్చునని పలు కోర్టులు ఇచ్చిన జడ్జిమెంట్లను స్పెషల్ కౌన్సెల్ రాజేంద్రప్రసాద్ కోర్టు ముందు ఉంచారు. సమాజంలో వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు.. విభేదాలు సృష్టించేందుకు జరిగిన కుట్రను చేదించాల్సి ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. దురుద్దేశపూరితంగా కుట్ర ప్రకారం జరిగిన లైవ్ డిబేట్‌కు సంబంధించిన కేసులో సమగ్రంగా విచారణ జరపాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఏ1 నిందితుడు కృష్ణంరాజు పరారీలో ఉన్నారని, ఈ తరుణంలో రెండో నిందితుడైన కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ ఇస్తే ఆయన సాక్షులను బెదిరించే అవకాశం ఉందన్నారు. మహిళలు తీవ్ర ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారని, ఈ దశలో రిమాండ్ విధించకుంటే ఆందోళనలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కొమ్మినేనికి రిమాండ్ విధించకుంటే కోర్టులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.

వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కోర్టు

సాక్షి టీవీలో ప్రసారమైన లైవ్ డిబేట్‌లో రాజధాని ప్రాంత మహిళలను వేశ్యలుగా చిత్రీకరించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. కృష్ణంరాజు నీచాతినీచంగా మాట్లాడితే కొమ్మినేని దానిని ఖండించకపోగా, ప్రోత్సహించినట్లుగా మాట్లాడారని రాజేంద్రప్రసాద్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సాక్షిలో ప్రసారమైన 15 నిమిషాల నిడివిగల కార్యక్రమాన్ని ల్యాప్‌టాప్‌లో మేజిస్ట్రేట్‌కు చూపారు. ఆ కార్యక్రమాన్ని చూసిన తర్వాత.. వారు చేసిన వ్యాఖ్యలను కోర్టు తీవ్రంగా పరిగణించింది.

పొన్నవోలు చిందులు..

కొమ్మినేని తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, ఇతర న్యాయవాదులు వాదనలు వినిపించారు. కొమ్మినేనికి రిమాండ్ విధించడంతో పొన్నవోలు తీవ్ర అసహనానికి గురయ్యారు. "మా వాదనలు పూర్తిగా వినకుండానే రిమాండ్ విధించడం అన్యాయం, అక్రమం, అధర్మం." అంటూ చిందులు తొక్కారు. స్పెషల్ కౌన్సెల్ రాజేంద్రప్రసాద్ జోక్యం చేసుకుని ఒకసారిరిమాండ్ విధించిన తర్వాత తిరిగి వెనక్కి తీసుకునే అవకాశం లేదంటూ.. వాదన వినిపిస్తుండగా... పొన్నవోలు తీవ్ర అసహనంతో రగిలిపోయారు. స్పెషల్ కౌన్సిల్‌ను.. "నోరు మూసుకో.. ఏం మాట్లాడుతున్నావ్!" అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. దీంతో రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. "ఏం మాట్లాడుతున్నావ్.. నన్ను బెదిరిస్తున్నావా.. జాగ్రత్తగా ఉండు." అంటూ హెచ్చరించారు. పొన్నవోలు తీరుపై మేజిస్ట్రేట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు కోర్టులో ఉన్నారనే విషయం గుర్తుంచుకోండి. ఇది చేపల మార్కెట్ కాదు. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది." అంటూ హెచ్చరించారు. దీంతో గొంతు సవరించుకున్న పొన్నవోలు.. "నా వాదనలు సమగ్రంగా వినిపించాల్సి ఉంది." అని చెప్పడంతో.. భోజన విరామం తర్వాత వాదనలు వింటామని చెప్పారు. భోజన విరామం అనంతరం పొన్నవోలు ముంబై కోర్టు జడ్జిమెంట్‌ను కోర్టు ముందుంచారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం ఏడేళ్లలోపు శిక్షపడే నేరాలకు సంబంధించిన కేసుల్లో రిమాండ్ విధించడానికి వీల్లేదని పేర్కొన్నారు. అయితే ఆయన వాదనల పట్ల సంతృప్తి చెందని మేజిస్ట్రేట్ రిమాండ్‌ను కొనసాగిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

అట్రాసిటీ చట్టంపై అభ్యంతరం

సాక్షి టీవీ చర్చలో చేసిన వ్యాఖ్యలపై నమోదైన కేసులో అట్రాసిటీ సెక్షన్ నమోదు చేయడంపట్ల న్యాయాధికారి సురేశ్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సెక్షన్లను ఎలా నమోదు చేస్తారని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణను నిలదీశారు. గతంలోనూ తాను ఒకసారి చెప్పానని అయినప్పటికీ మళ్లీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ను జోడించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఏ ప్రాతిపదికన అట్రాసిటీ సెక్షన్లు నమోదు చేశారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆ సెక్షన్‌ను మినహాయించి మిగిలిన సెక్షన్లను పరిగణనలోకి తీసుకుని కొమ్మినేనికి రిమాండ్ విధించారు.

అందువల్ల.. మీరు శిక్షార్హులే!

కోర్టులో జడ్జి అడిగిన ప్రశ్నలకు నిందితుడు కొమ్మినేని శ్రీనివాసరావు నీళ్ల నమిలారు. "డిబేట్లో మీరు యాంకర్‌గా ఉన్నప్పుడు, ఏయే విషయాలు ప్రస్తావించాలి? ఏయే అంశాలను అనుమతించాలి? వీటిని ఎక్కడ కట్ చేయాలి అనేది మీ పరిధిలోనే ఉంటుంది కదా. వేశ్యలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు రాజధాని చుట్టూ ఉన్నారని ఇంత దుర్మార్గమైన వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు.. మీరెందుకు వాటిని ఖండించలేదు. అంతేగాక హిందూ దేవతలు, ముస్లిం దేవతలు, క్రిస్టియన్ దేవతలు అంటూ నవ్వుతూ వ్యంగ్యంగా మాట్లాడడం.. కృష్ణంరాజు వ్యాఖ్యలను ప్రోత్సహించినట్లే కదా!. అందువల్ల మీరు శిక్షార్హులే. మిమ్మల్ని ఎలా వదిలి పెట్టాలి?." అని జడ్జి ప్రశ్నించారు. దీంతో.. ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక కొమ్మినేని కొద్దిసేపు నీళ్ల నమిలారు. "నేనేమీ మాట్లాడలేదు. నా తప్పేమీ లేదు." అని తప్పించుకునేందుకు ప్రయత్నించారు. అయితే జడ్జి మాత్రం ఆ వ్యాఖ్యలను సీరియస్‌గా పరిగణించి రిమాండ్ విధించారు.

గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌లపై నేడు తీర్పు



హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో దోషిగా తేలిన మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌లపై బుధవారం టీ-హైకోర్టు తీర్పు వెలువరించనుంది. ముద్దాయిలు గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లతోపాటు గాలి జనార్దన్‌రెడ్డి విడిగా దాఖలు చేసిన జైలుశిక్ష సస్పెన్షన్ పిటిషన్లపై తీర్పు వెలువడనుంది. జైలుశిక్ష సస్పెన్షన్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు కొనసాగాయి. జనార్దన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు నళిన్‌కుమార్, నాగముత్తు వాదించారు. పిటిషనర్ ఇప్పటికే 50శాతానికి పైగా అంటే మూడున్నరేళ్లపాటు జైలు జీవితం అనుభవించారని తెలిపారు. ఇంకా మూడున్నరేళ్ల జైలు శిక్ష మాత్రమే మిగిలి ఉందని.. ఈ దశలో శాసన సభ్యత్వం కోల్పోకుండా సీబీఐ కోర్టు తీర్పును సస్పెండ్ చేయాలని కోరారు. శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఇప్పటికే కర్ణాటక అసెంబ్లీ కార్యదర్శి గతనెలలో నోటిఫికేషన్ జారీ చేశారని.. ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కోలుకోలేని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. బెయిల్ విషయంలో ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయని సీబీఐ.. జైలుశిక్షను సస్పెండ్ చేసే విషయంలో వ్యతిరేకించింది. జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. బుధవారం ఆదేశాలు వెలువరిస్తానని పేర్కొంది. ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న ఐఏఎస్ శ్రీలక్ష్మి పిటిషన్ సైతం బుధవారం విచారణ జాబితాలో లిస్ట్ అయింది.

ఆస్పత్రిలో చేరిన పీఎస్ఆర్



విజయవాడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు ఆస్పత్రిలో చేరారు. రాత్రి ఆయాసం రావడం, మంగళవారం ఉదయం గుండెపోటు వచ్చిందని చెప్పడంతో జైలు అధికారులు ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియాలజీ వార్డులో చేర్పించారు. నలుగురు వైద్యుల బృందం ఆయనను పరీక్షిస్తోంది. ఈసీజీ, ఎకో 2డీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. 24 గంటల పాటు పరిశీలనలో ఉంచాలని జైలు సిబ్బందికి వైద్యులు సూచించారు. ఇదిలాఉండగా, అనారోగ్య కారణాల రీత్యా తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పీఎస్ఆర్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను న్యాయాధికారి దేవిక బుధవారానికి వాయిదా వేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.